www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) :23
సంచిక (Issue) : 66
బుధవారం | 4-6-2025
శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: నవమి రా.11.55 తదుపరి దశమి, నక్షత్రం: ఉత్తర తె 3.36 తదుపరి హస్త, వర్జ్యం: ఉ.8.58-10.44, దుర్ముహూర్తం: ఉ.11.47-12.39, అమృతఘడియలు: రా.7.36-9.23, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 5.43, సూర్యాస్తమయం: 6.43
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆర్‌సీబీ జట్టు సభ్యుల విజయోత్సాహం

బెంగళూరు.. బెంగ తీరింది

12

ఐపీఎల్ నయా చాంప్ ఆర్‌సీబీ.. నెరవేరిన విరాట్ కోహ్లీ కల

తుది పోరులో పంజాబ్ బోల్తా
దెబ్బకొట్టిన క్రునాల్ పాండ్యా
కీలక మ్యాచ్‌లో అయ్యర్ ఫ్లాప్
పోరాడిన శశాంక్

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. మూడు సార్లు ఊరించి.. ఉసూరుమనిపించిన ఐపీఎల్ ట్రోఫీ.. ఎట్టకేలకు ఆ జట్టు సొంతమైంది. మెగా లీగ్ ఆరంభం నుంచి ఒకే ఫ్రాంచైజీకి ఆడుతున్న కోహ్లీ కెరీర్‌లో ఐపీఎల్ ట్రోఫీ లేదనే లోటు తీరింది. మెగా వేలం తర్వాత సమతుల్యమైన జట్టుతో బరిలోకి దిగిన ఆర్‌సీబీ.. ఈ సీజన్‌లో చెలరేగిపోయింది. అద్భుత ప్రదర్శనతో నాలుగోసారి ఫైనల్‌కు చేరి.. తుది పోరులో పంజాబ్ కింగ్స్‌ను 6 పరుగుల తేడాతో ఓడించి తొలిసారి ఐపీఎల్ ట్రోఫీ గెలుచుకుంది. మరోవైపు.. దశాబ్దం తర్వాత ఫైనల్ చేరిన పంజాబ్ గుండె పగిలింది. ఆఖరి పోరులో దూకుడు లేకపోయినా.. సమష్టిగా చెలరేగిన బెంగళూరు 190 పరుగుల స్కోరు చేసింది. కోహ్లీ (43) క్రీజులో నిలబడగా.. మిగతా బ్యాటర్లు దూకుడుగా ఆడడంతో.. బెంగళూరు పోరాడగలిగే స్కోరు చేసింది. కానీ, బ్యాటింగ్ బలం కలిగిన పంజాబ్ ముందు నిలుస్తుందా? అనే అనుమానం కలిగింది. అయితే, వ్యూహాత్మకంగా వ్యవహరించిన ఆర్‌సీబీ బౌలర్లు పంజాబ్‌ను సమర్థంగా కట్టడి చేశారు. పవర్‌ప్లేలో హాజిల్‌వుడ్ దెబ్బతీయగా.. మధ్య ఓవర్లలో క్రునాల్ పాండ్యా కీలక వికెట్లు పడగొట్టాడు. ఒంటిచేత్తో పంజాబ్‌ను ఫైనల్ చేర్చిన కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (1)ను షెఫర్డ్ వెనక్కి పంపడంతో.. బెంగళూరు పట్టుబిగించింది. తర్వాత క్రమం తప్పకుండా వికెట్లను పడగొడుతూ ఒత్తిడి పెంచింది. చివర్లో శశాంక్ సింగ్ చెలరేగినా.. అప్పటికే ఆలస్యమై పోయింది. ఆర్‌సీబీకి విజయం సొంతమైంది.

ఉద్యోగుల డిమాండ్లకు పచ్చజెండా!



పెండింగ్ బిల్లుల చెల్లింపునకు గ్రీన్ చానల్?

రేపు క్యాబినెట్ భేటీలో నిర్ణయం!.. ఒక డీఏకు సుముఖం.. రెండో డీఏపై చర్చ
ఆర్థికేతర అంశాల్లో దాదాపు అన్నిటిపైనా సానుకూలమే
ఏటా సాధారణ బదిలీలకు సుముఖత.. రైతు భరోసా, రైతుబీమా, బోనస్‌లపై చర్చ
యువ వికాసంపైనా చర్చించనున్న మంత్రి మండలి
ఉద్యోగులు, యువత, రైతుల ఆశలన్నీ ఈ భేటీపైనే

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల డిమాండ్లకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తుందా? పంటలకు పెట్టుబడి సాయం కోసం రైతుభరోసా నిధులు విడుదల చేస్తుందా? యువత స్వయం ఉపాధి కోసం యువ వికాసం దరఖాస్తులను ఖరారు చేస్తుందా? రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న చర్చ ఇది. ఈసారి జరగనున్న క్యాబినెట్ భేటీలో ఈ వర్గాల ఆర్థిక ప్రయోజనాలపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని చెబుతుండడమే ఇందుకు కారణం. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో క్యాబినెట్ భేటీ జరగనుంది. దీంతో రాష్ట్రంలోని ఉద్యోగులు, యువత, రైతాంగం.. తమ ఆశలన్నీ మంత్రివర్గ సమావేశంపైనే పెట్టుకున్నారు. తాము లేవనెత్తిన డిమాండ్లలో ఆర్థిక, ఆర్థికేతర అంశాలపై క్యాబినెట్‌లో ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉందని ఉద్యోగులు భావిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వానికి, ఉద్యోగ సంఘాలకు మధ్య భేదాభిప్రాయాలు రావడం, సర్కారు వెంటనే అధికారుల కమిటీని ఏర్పాటు చేయడం తెలిసిందే. ఈ కమిటీ ఉద్యోగ సంఘాలతో సమావేశమై వారి డిమాండ్లను, ప్రతిపాదనలను విని మే 31న తన నివేదికను మంత్రివర్గ ఉపసంఘానికి అందజేసింది. ఆ నివేదికపై క్యాబినెట్‌లో కీలక చర్చ

మిగతా 13వ పేజీలో...

కోర్ అర్బన్ రీజియన్‌కు ప్రత్యేక పాలసీ

చెరువులు, నాలాలు, రోడ్ల విస్తరణ
అభివృద్ధికి రూపకల్పన 13
అధికారులకు సీఎం ఆదేశాలు
వర్షాకాల సన్నద్ధతపై సమీక్ష

నరేందర్.. సరెండర్!

ట్రంప్ ఆదేశించారు.. ప్రధాని మోదీ ఆపేశారు!

పాక్‌తో కాల్పుల విరమణపై రాహుల్ విమర్శలు
కొద్దిగా ఒత్తిడి తెస్తే చాలు..
బీజేపీ, ఆరెస్సెస్ నాయకులు లొంగిపోతారు
స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచీ అంతే..
నాడు అమెరికా బెదిరింపులకు ఇందిర లొంగలేదు.. పాక్‌ను ముక్కలు చేశారు: రాహుల్

ఆరు పాక్ ఫైటర్లను కూల్చాం!

ఒక సీ-130, 2 నిఘా విమానాలు కూడా..
30కిపైగా క్షిపణులు గాల్లోనే ధ్వంసం
పెద్ద సంఖ్యలో డ్రోన్ల కూల్చివేత
ఆపరేషన్ సిందూర్ డేటాపై రక్షణ శాఖ
ఇండియా టుడే కథనం



ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంట్‌ను సమావేశపరచాలి
ప్రధానికి ఇండియా కూటమి పార్టీల లేఖ
సంతకం చేయని ఎన్సీపీ
విడిగా లేఖ రాస్తామన్న ఆప్

భోపాల్, జూన్ 3: ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు మోదీ లొంగిపోయారన్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్.. ప్రధానిపై విమర్శలు గుప్పించారు. "ఆపరేషన్ సిందూర్ ప్రారంభం కాగానే మోదీకి ట్రంప్ ఫోన్ చేశారు. మోదీజీ.. ఏం చేస్తున్నారు? అని అడిగారు. నరేందర్.. సరెండర్

మిగతా 2వ పేజీలో...



చాట్‌జీపీటీ వినియోగంలో భారత్ టాప్!

అమెరికాను దాటి అగ్రస్థానంలోకి..
అంతర్జాతీయ వినియోగదారుల్లో 13.5 శాతం మంది భారత్‌లోనే

వాషింగ్టన్, జూన్ 3: కృత్రిమ మేధ (ఏఐ) ప్రపంచాన్ని ఏలుతోంది. ప్రస్తుతం ప్రపంచమంతటా ఏఐ శకం నడుస్తోంది. ఏఐ వాడకంలో భారతీయులు ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలుస్తున్నారు. ముఖ్యంగా చాట్‌జీపీటీ వినియోగంలో భారత్ అమెరికాను దాటేసింది. మొత్తం ప్రపంచ వినియోగదారుల్లో భారతీయులు 13.5 శాతం

మిగతా 2వ పేజీలో...

ఎర్రగడ్డ ఆస్పత్రి రోగులకు కలుషిత ఆహారం

71 మందికి అస్వస్థత.. ఒకరి మృతి
ముగ్గురి పరిస్థితి ఆందోళనకరం.. ఉస్మానియాలో చికిత్స
ఆస్పత్రిని సందర్శించిన డీఎంఈ, జిల్లా కలెక్టర్
ఘటనపై విచారణకు ఆదేశం.. నమూనాల సేకరణ
అనారోగ్యం వల్లే రోగి మృతి.. ఆస్పత్రి సూపరింటెండెంట్ వెల్లడి
ఘటనపై వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ ఆరా!

హైదరాబాద్ సిటీ/ఎర్రగడ్డ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని మానసిక చికిత్సాలయంలో ఫుడ్ పాయిజనింగ్ ఘటన చోటుచేసుకుంది. ఆస్పత్రిలోని 71 మంది మానసిక రోగులు అస్వస్థతకు గురయ్యారు. ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స

మిగతా 13వ పేజీలో...

చేర్యాల ప్రభుత్వాస్పత్రి వైద్యుడికి మెమో
'చచ్చేవారికి సిరప్ ఎందుకు?'
వ్యాఖ్యలపై అధికారుల చర్యలు
ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్ 3



గోశాల ఆవరణలో ఈదకుల కింద కోడెలు

ఎములాడ కోడెకు ఎంత కష్టం!

రాజన్న సన్నిధిలో సామర్థ్యానికి మించి కోడెలు 3
660 ఉండాల్సిన చోట 1300.. పచ్చగడ్డికీ కటకట
తాజాగా మరో 6 కోడెల మృతి.. వారంలో 26 మృత్యువాత
రంగంలోకి అధికారులు.. కోడెల గ్రేడింగ్, సరిపడా దాణా
సంరక్షణ కోసం 12 మందితో ప్రత్యేక బృందం ఏర్పాటు
గోశాలకు రంగారెడ్డి జిల్లా ఎన్కేపల్లిలో భూముల పరిశీలన

గోదావరి-బనకచర్ల అనుసంధానం ఒప్పుకోం

ప్రాజెక్టు అడ్డుకునేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తాం
త్వరలోనే కార్యాచరణ.. ఇప్పటికే కేంద్రానికి ఫిర్యాదు
గోదావరిలో నీళ్లు లేవనే ఏపీ.. ఇప్పుడు ఏ నీటిని తరలిస్తుంది?: మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నుంచి చేపట్టదలిచిన 'గోదావరి-బనకచర్ల' అనుసంధానాన్ని అడ్డుకుంటామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను

మిగతా 14వ పేజీలో...

కాళేశ్వరంపై ఏం చేద్దాం?
విజిలెన్స్ నివేదికను అమలు చేయాలా?
ఘోష్ రిపోర్టు తర్వాతే ముందుకెళ్లాలా? 13
రేపటి క్యాబినెట్ భేటీలో ఈ అంశంపై చర్చ!

నరేందర్.. సరెండర్..!




(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. వెంటనే మోదీ కాల్పుల విరమణ ప్రకటించారు. ట్రంప్ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించారు" అని రాహుల్ ఎద్దేవా చేశారు. బీజేపీ, ఆరెస్సెస్ నేతలపై కొద్దిపాటి ఒత్తిడి తెచ్చినా వెంటనే లొంగిపోతారని, భయంతో పారిపోతారని, వారి గురించి తనకు బాగా తెలుసని అన్నారు. అదేసమయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీని పొగడ్తలతో ముంచెత్తారు. "అమెరికా బెదిరింపులను సైతం లెక్క చేయకుండా ఇందిరా గాంధీ హయాంలో 1971లో పాకిస్థాన్‌ను భారత్ విచ్ఛిన్నం చేసింది. అగ్రరాజ్యాలకు తల వంచకుండా పనిచేసింది. గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్.. వీరంతా అగ్రరాజ్యాలకు వ్యతిరేకంగా పోరాడిన యోధులే" అని రాహుల్ చెప్పారు. ఇదీ బీజేపీ, ఆరెస్సెస్ నేతలకు, కాంగ్రెస్ నేతలకు మధ్య ఉన్న తేడా అని పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్యోద్యమ సమయం నుంచీ అంతేనని, వారికి లొంగిపోతూ లేఖలు రాయడం అలవాటని వ్యాఖ్యానించారు. కొద్దిపాటి ఒత్తిడి తెచ్చినా లొంగిపోతారని, అది వారి నైజమని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నటికీ లొంగిపోదన్నారు. కాంగ్రెస్ నేతలంతా పోరాట యోధులని చెప్పారు. మరోవైపు అదానీ సంస్థలో ఎల్ఐసీ రూ.5వేల కోట్లు పెట్టుబడి పెట్టడంపైనా రాహుల్ విమర్శలు గుప్పించారు. "డబ్బు, పాలసీ, ప్రీమియం మీది.. భద్రత, సౌకర్యం, లబ్ధి అదానీది" అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

జీ7కి ఆహ్వానం రాకపోవడం భంగపాటే

కెనడాలో జరగనున్న జీ7 దేశాల సదస్సుకు ప్రధాని మోదీకి ఆహ్వానం అందలేదు. దీంతో జీ7లో ప్రధాని పాల్గొనకపోవడం ఆరేళ్లలో తొలిసారి అవుతుంది. ఈ అంశంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, జపాన్, ఇటలీ, కెనడాతోపాటు జర్మనీ అధినేతలు జీ7 సదస్సులో పాల్గొననున్నారని, వీరితోపాటు బ్రెజిల్, మెక్సికో, దక్షిణాఫ్రికా, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా దేశాధినేతలకూ ఆహ్వానం అందిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. 2014కు ముందు జీ8గా ఉండేదని, నాటి ప్రధాని మన్మోహన్‌కు అప్పట్లో ఆహ్వానం అందేదని తెలిపారు. 2014 తర్వాత ఈ సంప్రదాయం కొనసాగినప్పటికీ.. ఆరేళ్లలో తొలిసారి మన ప్రధానికి ఆహ్వానం అందలేదన్నారు. ఎలా చూసినా.. దౌత్యపరంగా ఇదో భంగపాటేనని చెప్పారు. అయితే, జీ7 సదస్సుకు ఆహ్వానం అందినా, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశం లేదని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం కెనడాతో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో మోదీ అక్కడికి వెళ్లకపోవచ్చనే వాదన ఉంది.



లోకం తీరు

మెడికల్ రిప్రజెంటేటివ్‌లు కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులతో సమావేశం కావడంపై డీజీహెచ్‌ఎస్ నిషేధం విధించింది. ఈ మేరకు మే 28న ఆయా ఆస్పత్రుల ఉన్నతాధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆధునిక వైద్య విధానాలు, ఔషధాలకు సంబంధించిన సమాచారాన్ని వైద్యులతో పంచుకునేందుకు మెడికల్ రిప్రజెంటేటివ్‌లు ఈ-మెయిల్, మరేదైనా డిజిటల్ మీడియాను వినియోగించాలని డీజీహెచ్‌ఎస్ సూచించింది.

చెప్పినదానికన్నా ఎక్కువే

11 పాకిస్థాన్ ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేశామన్న భారత రక్షణ శాఖ

- ఆ జాబితాలో లేని మరో 8 చోట్ల భారత్ దాడి చేసిందన్న పాకిస్థాన్
- సరిహద్దుల నుంచి 700 కిలోమీటర్ల లోపల కూడా టార్గెట్ చేసినట్టు ఆరోపణ



ఆపరేషన్ సిందూర్ వార్ రూమ్‌లో సైనికాధికారులు(ఫైల్ ఫొటో)

న్యూఢిల్లీ, జూన్ 3: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ చేసిన దాడులు పాకిస్థాన్‌లో తీవ్ర విధ్వంసం సృష్టించాయా? మన ప్రభుత్వం అధికారికంగా వెల్లడించినదాని కంటే కూడా ఎక్కువ ప్రాంతాలను వాయుసేన ధ్వంసం చేసిందా? పాక్ తనకు భారీ నష్టం జరిగిందని స్వయంగా ప్రకటించడం ఏమిటి? నిజంగా భారీ నష్టం జరిగిందా? దీని వెనుక భారత్‌ను బద్నాం చేసే కుట్ర ఉందా?.. భారత ఆపరేషన్‌కు ప్రతిగా చేపట్టిన 'ఆపరేషన్ బన్యన్ ఉన్ మర్సూస్'కు సంబంధించి పాక్ విడుదల చేసిన 'సవివర సమాచార పత్రం (డోజియర్)' ఇవే ప్రశ్నలను లేవనెత్తుతోంది. భారత్ మరో ఎనిమిది ప్రాంతాల్లోనూ దాడులు చేసినట్టు పాక్ అందులో పేర్కొంది.

డోజియర్‌లో మ్యాప్‌లతో సహా..

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత్.. మే 7న అర్ధరాత్రి పాక్, పీఓకేలలోని 9 ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసిన విషయం తెలిసిందే. దీనికి ప్రతిగా పాక్ పెద్ద సంఖ్యలో డ్రోన్లు, స్వల్ప శ్రేణి క్షిపణులతో భారత్‌లోని పౌర ప్రాంతాలపై దాడులకు ప్రయత్నించింది. వీటిని అడ్డుకుని, పాక్‌ను నిలువరించేందుకు మన వాయుసేన.. 10వ తేదీన భారీ ఎత్తున దాడులకు దిగింది. పాక్‌లోని 11 ఎయిర్‌బేస్‌లు, వ్యూహాత్మక స్థావరాలు (నూర్‌ఖాన్, రఫీఖి, మురిద్, సుక్కుర్, సియాల్‌కోట్, మర్సుర్, చునియన్, సర్గోధా, స్కరు, భొలారి, జకోబాబాద్)ను క్షిపణి దాడులతో ధ్వంసం చేశామని ప్రకటించింది. వాటికి ఆధారాలను కూడా చూపింది. అయితే పాక్ ఇందులో మూడు ఎయిర్‌బేస్‌లు మురిద్, రఫీఖి, మర్సుర్‌తోపాటు బలూచిస్థాన్ ప్రాంతంలోని సముంగ్లి ఎయిర్‌బేస్‌లపై మాత్రమే భారత్ దాడి చేసినట్టు డోజియర్‌లో పేర్కొంది. వీటితోపాటు మరో ఎనిమిది ప్రాంతాలు.. పెషావర్, ఝూంగ్, సింధ్ రాష్ట్రంలోని హైదరాబాద్, పంజాబ్ రాష్ట్రంలోని గుజ్రాత్, గుజ్రన్‌వాలా, భావల్‌నగర్, అట్టోక్, చోర్‌లలోనూ భారత్ దాడులు జరిగాయని చెబుతూ.. ఆ ప్రాంతాల మ్యాప్‌ను కూడా పెట్టింది. భారత్ దాడిచేసినట్టు చెప్పిన ప్రాంతాలకన్నా కూడా.. ఈ ప్రాంతాల్లో కొన్ని పాక్ భూభాగంలో మరింత లోపల ఉండటం గమనార్హం. అయితే భారత్ వాస్తవంగా దాడి చేసిన కొన్ని ఎయిర్‌బేస్‌ల వివరాలు దాచిపెట్టడం, ఎక్కడో దూరంగా ఉన్న ప్రాంతాలను పేర్కొనడంపై సందేహాలు వస్తున్నాయని రక్షణ నిపుణులు చెబుతున్నారు.

భారత్‌ను బద్నాం చేసే కుట్ర?

వాస్తవానికి భారత్ చెప్పిన దానికంటే ఎక్కువ చోట్ల దాడులు జరిగాయని పాక్ తనంతట తానుగా ఎందుకు చెబుతోందన్నది కీలకమని రక్షణ నిపుణులు అంటున్నారు. పాక్ డోజియర్‌లో పేర్కొన్న సముంగ్లి ఎయిర్‌బేస్ బలూచిస్థాన్‌లోని క్వెట్టా నగరానికి దగ్గరిలో భారత సరిహద్దుల నుంచి సుమారు 600 కిలోమీటర్ల లోపల ఉంటుంది. పెషావర్ సుమారు 1,000 కిలోమీటర్లు, అట్టోక్ సుమారు 700 కిలోమీటర్లు లోపల ఉంటాయి. దీనికితోడు పాక్ అదనంగా చెప్పిన ఏడు ప్రాంతాలు మిలిటరీ స్థావరాలా, పౌర ప్రాంతాలా అన్నది కూడా పేర్కొనలేదు. అంటే పాకిస్థాన్ భూభాగంలో లోపలి పౌర ప్రాంతాల్లోనూ భారత్ దాడి చేసిందంటూ.. అంతర్జాతీయ సమాజం ముందు దోషిగా నిలబెట్టేందుకు చేపట్టిన దుష్ప్రచారం ఇదని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి పాక్‌లో సాధారణ పౌరులకు ఏమాత్రం నష్టం జరగకుండా, చాలా కచ్చితత్వంతో మిలటరీ, ఉగ్ర స్థావరాలపై దాడులు చేశామని భారత దళాలు స్పష్టంగా ప్రకటించాయని గుర్తు చేస్తున్నారు. ఒకవేళ అవి మిలటరీ స్థావరాలే అయితే.. భారత్ భీకర దాడి చేసినట్టేనని, పాక్ దిగొచ్చి కాల్పుల విరమణ కోరడానికి ఇది కారణమై ఉంటుందని భావించవచ్చని చెబుతున్నారు.

ఆరు పాక్ ఫైటర్లు కూల్చాం!

- ఆపరేషన్ సిందూర్ డేటా విశ్లేషణలో ఇప్పటివరకు నిర్ధారించిన రక్షణ శాఖ!
- ఇండియా టుడే కథనం

న్యూఢిల్లీ, జూన్ 3: ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌కు గట్టి దెబ్బ తగిలిందని.. ఆరు యుద్ధ విమానాలు, రెండు నిఘా విమానాలతోపాటు ఒక సీ-130 రవాణా విమానాన్ని కూడా కోల్పోయిందని రక్షణ వర్గాలు చెబుతున్నాయి. అంతేకాదు 30కిపైగా క్షిపణులను, పెద్ద సంఖ్యలో డ్రోన్లను కూడా భారత్ ధ్వంసం చేసిందని వివరిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో నమోదైన రాడార్, నిఘా వ్యవస్థలు, గగనతల రక్షణ వ్యవస్థల డేటాను విశ్లేషించి ఈ నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. రక్షణ శాఖలోని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ.. ఇండియా టుడే సంస్థ ఈ మేరకు కథనాన్ని ప్రచురించింది. ఆ వివరాల మేరకు.. ఆపరేషన్ సిందూర్ జరిగిన 4రోజుల్లో పాకిస్థాన్‌కు చెందిన ఆరు యుద్ధ విమానాలను మన వాయుసేన క్షిపణుల సాయంతో కూల్చివేసింది. ఇక సుమారు 300 కిలోమీటర్ల దూరంలోని ఒక అత్యంత విలువైన ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ (ఈడబ్ల్యూ) విమానం లేదా అవాక్స్ నిఘా విమానాన్ని సుదర్శన్ క్షిపణి వ్యవస్థను ఉపయోగించి ధ్వంసం చేసింది. మరోవైపు పాక్‌లోని భొలారి ఎయిర్‌బేస్‌పై మన వాయుసేన చేసిన క్షిపణి దాడుల్లో.. ఆ ఎయిర్‌బేస్‌లో నిలిపి ఉన్న స్వీడన్ తయారీ నిఘా విమానం ధ్వంసమైంది. ఈ ఎయిర్‌బేస్‌లోని హ్యాంగర్ (విమానాలను పార్క్ చేసే భారీ షెడ్) కూడా కుప్పకూలింది. అందులో కొన్ని యుద్ధ విమానాలు పార్క్ చేసి ఉన్నట్టు నిఘా వర్గాలకు సమాచారం ఉంది. మరో ఎయిర్‌బేస్‌లోని హ్యాంగర్‌పై రాఫెల్, సుఖోయ్ ఫైటర్లతో చేసిన దాడిలో.. చైనా తయారీ వింగ్ లూంగ్ డ్రోన్లు పెద్ద సంఖ్యలో ధ్వంసమయ్యాయి. ఇక పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రాంతంపై భారత్ చేసిన డ్రోన్ దాడుల్లో పాక్ కు చెందిన సీ-130 రవాణా విమానం కూలిపోయింది. కాగా, అంచనా వేసినదానికన్నా పాకిస్థాన్‌కు నష్టం ఎక్కువ జరిగినట్లు రక్షణ వర్గాలు భావిస్తున్నాయి.

సిందూర్‌పై ప్రత్యేక పార్లమెంట్ నిర్వహించాలి

- ప్రధానికి ఇండియా కూటమి నేతల లేఖ

న్యూఢిల్లీ, జూన్ 3: ఆపరేషన్ సిందూర్‌పై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని కోరుతూ ప్రధాని మోదీకి విపక్ష ఇండియా కూటమిలోని 16 పార్టీలు లేఖ రాశాయి. ఈ మేరకు న్యూఢిల్లీలో మంగళవారం ఆ పార్టీల నేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి జైరాం రమేష్, దీపేంద్ర హుడా (కాంగ్రెస్), ఓబ్రెయిన్(టీఎంసీ), రాంగోపాల్ యాదవ్(ఎస్పీ), మనోజ్ ఝా (ఆర్జేడీ), సంజయ్ రౌత్ (శివసేన-యూబీటీ) తదితరులు హాజరయ్యారు. మోదీకి రాసిన లేఖపై సంతకాలు చేసినా ఎం.కరుణానిధి జయంతి నేపథ్యంలో డీఎంకే నేతలు ఈ భేటీలో పాల్గొనలేదు. లేఖపై రాహుల్, ప్రియాంక(కాంగ్రెస్), అఖిలేష్(ఎస్పీ), టీఆర్ బాలు(డీఎంకే), అభిషేక్ బెనర్జీ (టీఎంసీ), అరవింద్ సావంత్(శివసేన-యూబీటీ) తోపాటు నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), సీపీఎం, ఐయూఎంఎల్, సీపీఐ, ఆర్ఎస్పీ, విడుథలాయి చిరుథాయిగల్ కచ్చి(వీసీకే), కేరళ కాంగ్రెస్, ఎండీఎంకే, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీల నేతలు లేఖపై సంతకాలు చేశారని విపక్ష నేతలు చెప్పారు. ఈ సమావేశానికి డుమ్మా కొట్టిన ఆప్.. మోదీకి విడిగా లేఖ రాస్తామని తెలిపింది. ఇక, శరద్ పవార్ సారథ్యంలోని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ-ఎస్‌పీ) ఈ భేటీకి గైర్హాజరైంది.

చాట్‌జీపీటీ వినియోగంలో భారత్ టాప్!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. ఏఐ చాట్‌బాట్ అయిన చాట్‌జీపీటీ నెలవారీ క్రియాశీల వినియోగదారుల జాబితాలో భారత్ మొదటి స్థానంలో నిలిచింది. తర్వాత స్థానాల్లో అమెరికా 8.9 శాతం, ఇండోనేసియా 5.7 శాతం ఉన్నాయి. చాట్‌జీపీటీ మాత్రమే కాదు.. చైనా రూపొందించిన డీప్‌సీక్ వినియోగంలోనూ భారతీయులు దూసుకెళ్తున్నారు. డీప్‌సీక్ మొత్తం వినియోగదారుల్లో 6.9 శాతంతో ప్రపంచంలోనే మూడో స్థానంలో నిలిచారు. 33.9 శాతం వినియోగదారులతో చైనా అగ్రస్థానంలో నిలవగా.. 9.2 శాతం యూజర్లతో రష్యా రెండో స్థానంలో ఉంది. ఈ వివరాలను ప్రముఖ విశ్లేషకురాలు మేరీ మీకర్ తన '2025 ట్రెండ్స్' నివేదికలో వెల్లడించారు. భవిష్యత్తు మొత్తం ఏఐదేననడానికి ఇదో సంకేతమని పేర్కొన్నారు. చాట్‌జీపీటీ వచ్చిన తొలి రెండేళ్లలోనే ఏటా 35000 కోట్ల సెర్చ్‌లు చేశారని.. గూగుల్‌కు ఈ సంఖ్యను చేరుకోవడానికి 11 ఏళ్లు పట్టిందని వెల్లడించారు. "నెట్ వినియోగదారులు కేవలం సమాధానాలు మాత్రమే కోరడం లేదు. వారు సమగ్ర సారాంశాన్ని కోరుకుంటున్నారు. దశాబ్దకాలం పట్టే సెర్చ్ లెర్నింగ్ ప్రక్రియను చాట్‌జీపీటీ కొన్ని నెలలకు పరిమితం చేసింది" అని గ్రేహౌండ్ రిసెర్చ్ సీఈవో విర్ గాగియా పేర్కొన్నారు. అయితే, కొన్ని క్లిష్టమైన ప్రశ్నలకు జనరేటివ్ ఏఐ చాలా బాగా ఉపయోగపడుతోందని, కానీ చాలా సెర్చ్‌లకు దాన్ని వాడాల్సిన అవసరం లేదని కౌంటర్‌పాయింట్ రిసెర్చ్ సంస్థ డైరెక్టర్ మోహిత్ అగర్వాల్ అన్నారు. తెలిపారు.

గృహహింస బాధితులకు రక్షణ

జిల్లా, తాలూకా స్థాయిల్లో ప్రత్యేక అధికారుల నియామకం ఆరు వారాల్లోపు పూర్తి చేయాలి

- రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ, జూన్ 3: గృహహింస బాధితులకు రక్షణ కల్పించటానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక అధికారులను ఆరు వారాల్లోపు నియమించాలని రాష్ట్ర, కేంద్రపాలితప్రాంతాల ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. గృహహింస నిరోధక చట్టం నిబంధనలు సమర్థంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్‌చంద్రశర్మలతో కూడిన ధర్మాసనం గత నెల 20వ తేదీన ఇచ్చిన తీర్పు తాలూకు పూర్తి వివరాలు తాజాగా వెల్లడయ్యాయి. ఈ తీర్పు కాపీని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. తీర్పులోని ముఖ్యాంశాలు..

- మహిళా, శిశు సంక్షేమశాఖలో జిల్లా, తాలూకా స్థాయిల్లో పని చేస్తున్న అధికారుల్లో కొందరిని గృహహింస బాధితుల కోసం 'రక్షణ అధికారులు'గా నియమించాలి. దీనికోసం ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంత ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శులు సమన్వయంతో పని చేసి నియామకాల్ని ఆరు వారాల్లోగా పూర్తి చేయాలి. రక్షణ అధికారులు గృహహింస నిరోధక చట్టంలోని సెక్షన్ 9కి అనుగుణంగా విధులను నిర్వర్తించాలి.
- గృహహింస నిరోధక చట్టం సెక్షన్ 11 ప్రకారం.. బాధిత మహిళలకు చట్టం కల్పించే రక్షణ గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలి. చట్టం గురించి పోలీసు, న్యాయవ్యవస్థలతోపాటు ఇతర శాఖల అధికారులకు కూడా ఎప్పటికప్పుడు శిక్షణనివ్వాలి. చట్టం అమలును నిర్ణీత కాలవ్యవధుల్లో క్రమం తప్పకుండా సమీక్షించాలి. కేంద్రప్రభుత్వం కూడా కీలకపాత్ర పోషించాలి.
- బాధిత మహిళలకు ఉచితంగా, తక్షణ న్యాయ సహాయం అందించాలని చట్టం నిర్దేశిస్తోంది. ఈ మేరకు జాతీయ న్యాయ సేవల అథారిటీ తగు చర్యలు చేపట్టాలి.

ఇదీ నేపథ్యం

పలు రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంతాల్లో గృహహింస నిరోధక చట్టం సరిగా అమలు కావటం లేదంటూ 'వి ద ఉమెన్' అనే స్వచ్ఛందసంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ చట్టం అమలుకు ప్రత్యేకంగా అధికారులను నియమించకుండా.. 'సమీకృత శిశు సంక్షేమ పథకం' (ఐసీడీఎస్) సిబ్బందికి, అంగన్‌వాడీ కార్యకర్తలకు అదనంగా బాధ్యతలు అప్పగిస్తున్నారని తెలిపింది. ఇది వారి పని భారాన్ని పెంచటంతో.. చట్టం అమలుపై వారు దృష్టి పెట్టలేకపోతున్నారని.. ఫలితంగా బాధిత మహిళలకు రక్షణ లేకుండా పోతుందని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే, ప్రత్యేకంగా అధికారులను నియమించాలని, చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీ చేసింది.

- బాధిత మహిళలు తలదాచుకోవటానికి షెల్టర్‌హోం, నారీనికేతన్ వంటి గృహ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. జిల్లా, తాలూకా స్థాయిల్లో వీటి వివరాలను బహిరంగంగా ప్రకటించాలి. 10 వారాల్లోపు ఇది జరగాలి.

మీరేమైనా చరిత్రకారులా..?

తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందన్న కమల్ హాసన్‌ను నిలదీసిన కర్ణాటక హైకోర్టు

- క్షమాపణ చెప్పాలని సూచించిన జడ్జి
- కమల్ ససేమిరా..
- తన సినిమా 'థగ్ లైఫ్'ను ప్రస్తుతానికి కర్ణాటకలో విడుదల చేయట్లేదని వెల్లడి



బెంగళూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కన్నడ భాషపై తానుచేసిన వ్యాఖ్యలు కర్ణాటకలో వివాదాస్పదమైన నేపథ్యంలో.. రాష్ట్రంలో తన సినిమా 'థగ్ లైఫ్' విడుదలకు మార్గం సుగమం చేయాలని.. థియేటర్ల వద్ద భద్రత కల్పించాలని కోరుతూ పిటిషన్ వేసిన సినీ హీరో కమల్ హాసన్‌పై కర్ణాటక హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ ఇటీవల సినిమా ప్రీ-రిలీజ్ వేడుకల్లో చేసిన వ్యాఖ్యలకు మొదట క్షమాపణ చెప్పాలని సూచించింది. భాష ప్రతి వ్యక్తి సాంస్కృతిక, భావోద్వేగ గుర్తింపులో భాగమని.. తమిళం నుంచి కన్నడ పుట్టిందనే హక్కు కమల్‌కు ఎవరిచ్చారని న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న ఈ సందర్భంగా నిలదీశారు. 'ఇలాంటి ప్రకటన చేయడానికి మీరేమైనా చరిత్రకారులా.. లేక భాషావేత్తలా? ఏ ప్రాతిపదికన అలా మాట్లాడారు? ఏ భాషా మరో భాష నుంచి పుట్టదు. నీరు, నేల, భాష ప్రజలకు పవిత్రమైనవి. భాష ప్రాతిపదికనే దేశంలో రాష్ట్రాలు ఏర్పడ్డాయి. మీరు చేసిన వ్యాఖ్యలు కర్ణాటక ప్రజల మనోభావాలను దెబ్బతీశాయి. క్షమాపణ చెబితే సమస్య పరిష్కారమయ్యేది. మీరు కమల్ హాసన్ కావచ్చు.. ఇంకెవరైనా కావచ్చు. ప్రజల మనోభావాలను దెబ్బతీయడానికి వీల్లేదు. సి.రాజగోపాలాచారి కూడా 75 ఏళ్ల కిందట ఇలాంటి ప్రకటనే చేసి.. తర్వాత క్షమాపణ చెప్పారు. మరి మీరెందుకు చెప్పరు? సినిమా విడుదల ద్వారా కర్ణాటకలో రూ.కోట్లు ఆర్జించాలని భావిస్తున్నారు. కానీ క్షమాపణ చెప్పరా? ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సాధారణ పౌరులను కూడా శిక్షిస్తాం. మీరేమైనా ఇందుకు మినహాయింపా' అని ఆక్షేపించారు. పరిస్థితి సద్దుమణిగేలా చేయడానికి క్షమాపణ చెప్పే విషయం ఆలోచించాలని కమల్‌కు సూచించారు. మధ్యాహ్నం 2.30 వరకు విచారణను వాయిదావేశారు. విచారణ పునఃప్రారంభమయ్యాక.. క్షమాపణ చెప్పడానికి కమల్ హాసన్ నిరాకరించారు. ప్రస్తుతానికి ఆ సినిమాను కర్ణాటకలో విడుదల చేయడం లేదని కమల్, ఆయన నిర్మాణ సంస్థ నిర్ణయించినట్లు వారి లాయర్ తెలిపారు. కేఎఫ్‌సీసీతో చర్చలు జరిపేదాకా విడుదల ఆపేస్తామన్నారు. క్షమాపణ చెప్పడానికి కమల్ నిరాకరించడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. విచారణను 10వ తేదీకి వాయిదావేసింది.

తప్పుగా అర్థం చేసుకున్నారు..

తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని కేఎఫ్‌సీసీ అధ్యక్షుడు నరసింహులుకు కమల్‌హాసన్ ప్రత్యేకంగా లేఖ రాశారు. కన్నడ భాషపై తనకు అగౌరవం లేదని, అభిమానం ఉందని తెలిపారు. తమిళం, కన్నడ, తెలుగు, మళయాళం సహా ఈ గడ్డపై ఉన్న అన్ని భాషలతో తనకు అనుబంధం ఉందన్నారు. తనపై ఉన్న ప్రేమ, అనుబంధంతో శివణ్ణ (శివరాజ్‌కుమార్) కూడా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు వచ్చారని, తన కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యాఖ్యానించారు. ఈ వివాదంపై బీజేపీ సీనియర్ నేత, మాజీ సీఎం యడియూరప్ప స్పందించారు. శాంతి, సామరస్యానికి భంగం కలిగించేలా, కోట్లాదిమంది కన్నడిగుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. క్షమాపణలు చెప్పినంత మాత్రాన చిన్నవారైపోరని 'ఎక్స్'లో అభిప్రాయపడ్డారు.

ఎములాడ కోడెకు ఎంత కష్టం!

రాజన్న సన్నిధిలో సామర్థ్యానికి మించి కోడెలు.. 660 ఉండాల్సిన చోట 1300 కోడెలు

- మంగళవారం ఒక్కరోజే 6 కోడెల మృతి
- వారం రోజుల్లో మొత్తం మరణాలు 26
- ప్రస్తుతం అనారోగ్యంగా 16 జీవాలు
- వానలకు తడవడం, తోపులాటతోనే కోడెలకు అస్వస్థత
- రంగంలోకి అధికారులు..
- సంరక్షణకు ప్రత్యేక బృందం ఏర్పాటు



తిప్పాపూర్ గోశాలలోని షెడ్డులో వున్న రాజన్న కోడెలు

వేములవాడ కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్నకు తాము ఎంతో భక్తిప్రపత్తులతో సమర్పించే కోడెలు మృత్యువాతపడుతుండటం భక్తులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. సోమవారం వరకు కేవలం వారం వ్యవధిలో 26 కోడెలు మృత్యువాత పడటం గమనార్హం. 16 కోడెలు అనారోగ్యంతో బాధపడుతున్నాయి. మే 29న 8 కోడెలు, ఆ మర్నాడు 5 కోడెలు మృత్యువాతపడ్డాయి. తాజాగా మంగళవారం ఒక్కరోజే మరో ఆరు కోడెలు చనిపోయాయి. శ్రావణ మాసంలో 300-400, మిగతా నెలల్లో 150-180 కోడెల దాకా భక్తులు సమర్పిస్తారు. ఆలయ పరిధిలోని తిప్పాపూర్ గోశాలలో మొత్తం 13 షెడ్లు ఉన్నాయి. అందులో రెండు షెడ్లను ఇతర పనులకు ఉపయోగిస్తుండగా, 11 షెడ్లలో 60 చొప్పున మొత్తంగా 660 కోడెలను సంరక్షించేందుకు అవకాశం ఉంది. అయితే సామర్థ్యానికి రెండింతలు... 1300 దాకా కోడెలు ప్రస్తుతం అక్కడ ఉన్నట్లు స్వయంగా సిరిసిల్ల జిల్లా పశువైద్య శాఖ అధికారే చెప్పారు.

ఎందుకు చనిపోతున్నాయి?

గోశాల షెడ్లలో స్థలం చాలకపోవడంతో కట్టెలతో మేదరి తడకలు ఏర్పాటు చేసి వాటి కింద కోడెలను వదిలేశారు. గోశాలలో, పందిరి కింద కోడెలకు మేత కోసం వేస్తున్న రెండు ట్రాక్టర్ల పచ్చిగడ్డి (టన్ను) ఏమాత్రం సరిపోవడం లేదు. పైగా శ్రేణీకరించకుండా అన్నింటినీ ఒకే చోట ఉంచడంతో దిట్టంగా ఉన్న కోడెల మధ్య నీరసంగా ఉన్న కోడెలు నలిగిపోతున్నాయి. ఇటీవల వరుసగా నాలుగు రోజులు కురిసిన వర్షాలకు తడిసిపోయిన కోడెలు జబ్బుపడ్డాయి. వీటిలోనే కొన్ని మృత్యువాతపడ్డాయి. గుట్టుచప్పుడుకాకుండా మూలవాగులో కళేబరాలను ఖననం చేస్తుండటంతో వాస్తవంగా ఎన్ని మృత్యువాతపడ్డాయనే లెక్కలు తెలియడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రోజుకు 5 ట్రాక్టర్ల పచ్చిగడ్డి

కోడెలు వరుసగా మృత్యువాతపడుతుండటంతో అధికారులు రంగంలోకి దిగారు. గోశాలను పరిశీలించారు. బురదమయంగా మారడంతో పూర్తిగా శుభ్రం చేయించారు. కోడెలను గ్రేడింగ్ చేసి, అనారోగ్యంగా ఉన్న కోడెలను వేరుచేశారు. దిట్టంగా ఉన్న కోడెలను, చిన్న కోడెలను వేర్వేరు షెడ్లలో ఉంచారు. కోడెల సంరక్షణకు 12మంది పశువైద్య అధికారుల బృందాన్ని ఏర్పాటు చేశారు. కోడెల కోసం రోజూ 10టన్నుల (5 ట్రాలీల సామర్థ్యం) పచ్చి గడ్డిని అందించేలా చర్యలు తీసుకున్నారు. కాగా కలెక్టర్ చొరవతో 64 రాజన్న కోడె పిల్లలను అర్హులైన రైతులకు పంపిణీ చేశారు. కాగా అనారోగ్యంతో ఉన్న కోడెలు, జెర్సీ కోడెలను భక్తులు ఆలయానికి ఇస్తున్నారన్న అభిప్రాయాలున్నాయి. ఇలాంటి కోడెలను సమర్పించొద్దని అధికారులు సూచిస్తున్నా, భక్తులు ఆలయం వద్ద వదిలేసి వెళుతుతుండటంతో సిబ్బందికి వాటిని సంరక్షించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

మొక్కుల ద్వారా ఏటా రూ.20 కోట్లు

వేములవాడ ఆలయానికి భక్తులు కోడెలను స్వామివారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. కోడెలు దొరక్కపోతే భక్తులు.. కోడెల ఖరీదు కింద ఎంతో కొంత మొత్తం ఆలయానికి సమర్పించి, రూ.200 చార్జీల కింద కడతారు. ఆ తర్వాత గోశాల నుంచి కోడెను తీసుకొని, ఆలయానికి సమర్పించి లాంఛనంగా మొక్కు తీర్చుకుంటారు. ఇలా శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి యేటా కోడె మొక్కుల ద్వారా రూ.22 కోట్ల ఆదాయం సమకూరుతోంది.

గోశాల కోసం ఎన్కేపల్లిలో భూముల పరిశీలన

మొయినాబాద్ రూరల్, జూన్3 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్కేపల్లిలోని 180వ సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిని హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కలెక్టర్ నారాయణ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఇప్పటికే గోవు ల కోసం గోశాల ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభు త్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిపై పూర్తి ప్రణాళిక, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని గతంలోనే సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో ఎన్కేపల్లిలోని సర్వే నం.180 లోని ప్రభుత్వ భూమిని సర్ఫరాజ్ అహ్మద్, నారాయణరెడ్డి పరిశీలించారు. కాగా, ఏళ్ల తరబడి వ్యవసాయం చేసుకుంటున్న భూముల్ని తీసుకుంటే తాము ఎలా బతకాలని కలెక్టర్ వద్ద ఎన్కేపల్లి దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని సర్కారు దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. దీనిపై ప్రజలు బుధవారం మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా వివరాలను వెల్లడించాలని సూచించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసుపై సిట్‌తో సీవీ ఆనంద్ సమీక్ష

- ప్రభాకర్‌రావు సిట్ ముందుకు రానున్న నేపథ్యంలోనే భేటీ
- కర్ణాటక మఠం భూముల సెటిల్‌మెంట్‌లో ప్రభాకర్‌రావు
- ఎస్ఐబీ మాజీ చీఫ్‌పై ఉన్నతాధికారులకు మౌఖిక ఫిర్యాదులు

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ(స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో) మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు త్వరలో సిట్ ముందు హజరుకానున్న నేపథ్యంలో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ సిట్ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఫోన్ ట్యాపింగ్ కేసే కాకుండా ఎస్ఐబీలో పనిచేసిన సమయంలో ప్రభాకర్‌రావు సీక్రెట్ రిజర్వ్(ఎస్ఆర్) ఫండ్స్‌ను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపైనా చర్చించారు. మావోయిస్టు ఆపరేషన్లకు వాడాల్సిన ఆ నిధులపై ఆడిటింగ్ ఉండదని, ఈ నేపథ్యంలో కోట్ల రూపాయలు దుర్వినియోగం అయ్యాయని పోలీసు వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు, ప్రభాకర్‌రావు అధికార దుర్వినియోగానికి సంబంధించి ఉన్నతాధికారులకు అనేక ఫిర్యాదులు అందినట్లు సమాచారం. కర్ణాటకలోని ఒక మఠానికి సంబంధించిన ఆస్తులు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఉన్నాయని, ఆ ఆస్తులను 2016-18 మధ్య కాలంలో పాతబస్తీకి చెందిన ఒక నేతకు కట్టబెట్టడంలో ప్రభాకర్‌రావు చొరవ చూపించారని, ఈ క్రమంలో కొందరిపై బెదిరింపులకు పాల్పడ్డారని ఉన్నతాధికారులకు మౌఖికంగా ఫిర్యాదు అందినట్లు తెలుస్తోంది. 2022-2023 మధ్యలో ప్రభుత్వంలోని ఒక పెద్దమనిషి కోసం కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలను ప్రభాకర్‌రావు టీం బెదిరించిందన్న ఆరోపణలున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావును తొలుత టెక్నికల్ డాటా ఆధారంగా విచారించాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు సమాచారం. ఈ కేసులో అరెస్టు అయిన పోలీసు అధికారులంతా పై అధికారి చెబితేనే ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డామని స్పష్టం చేసిన క్రమంలో.. పై అధికారి అయిన ప్రభాకర్‌రావు చట్టవిరుద్ధమైన ఆదేశాలు ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందన్న దానిపై ప్రశ్నించడానికి సిట్ అధికారులు సిద్ధం అవుతున్నారు. ప్రభాకర్‌రావు దర్యాప్తును ఎదుర్కోవడానికి పూర్తిస్థాయి కసరత్తు చేసుకుని ఉంటారని, అరెస్టు అయిన వారి వాంగ్మూలాలు, చార్జిషీట్లు స్టడీ చేశారని, అందువల్ల ఆయన అక్రమాలను నిరూపించాలంటే స్పష్టమైన సాక్ష్యాధారాలు అవసరమని ఉన్నతాధికారులు సిట్ బృందానికి సూచించినట్లు తెలుస్తోంది. ప్రభాకర్‌రావుపై ఇప్పట్లో కొత్త కేసులు ఉండకపోవచ్చని, ఆయనపై స్పష్టమైన ఫిర్యాదు ఉంటేనే కొత్త కేసులు నమోదు చేస్తామని పోలీసు ఉన్నతాధికారులు అంతర్గత సంభాషణల్లో పేర్కొంటున్నారు.

రియాధ్‌లో తొలిసారిగా మినీ మహానాడు

- సౌదీలో నిర్వహించిన తెలుగు తమ్ముళ్లు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సౌదీ అరేబియా రాజధాని రియాధ్‌లో తొలిసారిగా మినీ మహానాడు నిర్వహించిన తెలుగు తమ్ముళ్లు చరిత్ర సృష్టించారు. తెలుగుదేశం పార్టీ ప్రముఖులు షేక్ జానీ బాషా, చెన్నుపాటి రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మినీ మహానాడు నిర్వహించారు. ఏపీలోని అన్ని జిల్లాలకు చెందిన ప్రవాసీయులు ఈ కార్యక్రమాన్ని పండుగలా జరుపుకొన్నారు. మహిళలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచం నలుమూలల్లో ఉన్న తెలుగువారికి చేరువ కావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేస్తున్న కృషిని వివరించారు. తెలుగువారి ఆరాధ్య దైవమైన శ్రీవేంకటేశ్వర స్వామిని ప్రవాసీయులు ఎలాంటి ఇబ్బందీ లేకుండా దర్శనం చేసుకోవడానికి ఏపీ ఎన్నార్టీ సంస్థ దర్శన విధానాన్ని పునరుద్ధరించడంతో పాటు స్లాట్ల సంఖ్య పెంచిందని రాధాకృష్ణ వెల్లడించారు. స్థానిక చట్టాలకు లోబడి.. ఇక్కడ వివిధ ప్రాంతాల్లో పార్టీని విస్తరించనున్నట్లు తెలుగుదేశం ఎన్నారై సౌదీ అరేబియా శాఖ అధ్యక్షుడు ఖాలీద్ సైపుల్లా పేర్కొన్నారు. రియాధ్, ఇతర గల్ఫ్ దేశాల నుంచి విజయవాడ, విశాఖపట్నం నగరాలకు నేరుగా అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభించాలని జానీ బాషా, రాజశేఖర్ కోరారు.

చేర్యాల ప్రభుత్వాస్పత్రి వైద్యుడికి మెమో

చేర్యాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ఆపదలో ఆస్పత్రికి వచ్చిన వ్యక్తితో అనుచితంగా మాట్లాడిన సిద్దిపేట జిల్లా చేర్యాల ప్రభు త్వ ఆస్పత్రి వైద్యుడు కల్యాణ్ చక్రవర్తిపై అధికారులు క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించారు. పట్టణానికి చెందిన దాసరి అనిల్‌కుమార్.. తన కూతురు కడుపునొప్పితో బాధపడుతుందంటూ ఆదివారం రాత్రి ఆస్పత్రికి వెళ్లి సిరప్ కావాలని కోరగా.. డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం 'చచ్చేవారికి సిరప్ ఎందుకు?' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. చర్యలు తీసుకోవాలని జిల్లా, ఆస్పత్రి వైద్యాధికారులకు సూచించారు. దీంతో డాక్టర్ కల్యాణ్ చక్రవర్తికి మెమో జారీ చేసినట్లు ఇన్‌చార్జి వైద్యాధికారి దామోదర్ తెలిపారు. అయి తే.. అనిల్‌కుమార్ ఆస్పత్రికి తాను మాత్రమే వచ్చి సిరప్ కావాలని అడిగారని చెప్పారు. ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

తుని రైలు దహనం కేసు తిరగదోడం!

అమరావతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని తుని రైలు దహనం కేసులో గందరగోళానికి రాష్ట్రప్రభుత్వం తెరదించింది. రైల్వే పోలీసులు నమోదు చేసిన కేసులో రైల్వే కోర్టు వెలువరించిన తీర్పుపై అప్పీలుకు వెళ్లే ఉద్దేశం లేదని, కేసును తిరగదోడే ఆలోచనే లేదని తేల్చి చెప్పింది. రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) అధికారి ప్రతిపాదనతో అప్పీలుకు వెళ్లాలంటూ సోమవారం హోంశాఖ వెలువరించిన జీవో-852ను ఉపసంహరిస్తూ మంగళవారం మరో జీవో 869ని జారీ చేసింది.

మందమర్రి పురపాలక సంఘ కార్యాలయం, మంచిర్యాల జిల్లా

నం: E1/03/mm/mplty/2025-26 టెండర్లు కోరుతూ ప్రకటన తేదీ:03.06.2025

SDF మరియు మునిసిపల్ జనరల్ నిధుల క్రింద రూ.7.50 లక్షల విలువైన (02) నం.ల పనులు అమలు చేయడానికి పేర్కొన్న "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన నం. E1/03/mm/mplty/2025-26 తేది:03.06.2025 ప్రకారం అర్హులైన సివిల్ కాంట్రాక్టర్లు మరియు సంస్థల నుండి మునిసిపల్ కమిషనర్, మందమర్రి పురపాలక సంఘం వారు "ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరుచున్నారు. టెండరు డాక్యుమెంట్ల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో 03.06.2025 నుండి 10.06.2025 మధ్యన లభించును. ఏదైనా ఇతర వివరాల కోసం, మునిసిపల్ కమిషనర్/మునిసిపల్ ఇంజనీర్, మందమర్రి, ఫోన్ నం. 9849971263/9849986750 (లేదా) వెబ్‌సైట్ www.Telangana e procurement.gov.in ను సంప్రదించగలరు.

సం/-కమిషనర్, మందమర్రి పురపాలక సంఘం

DIPR RO No.2991-PP/CL/ADVT/1/2025-26, తేది:03.06.2025

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)

E PROCUREMENT SHORT TENDER NOTICE (Second Call)

NIT No. 20/MAU61-PLG0OTH/40/2025-GIS/2nd call, Dt.02.06.2025

Name of Work: APCRDA - "RFP FOR SELECTION OF SERVICE PROVIDER FOR DESIGN, DEVELOPMENT AND MAINTENANCE OF GEO PORTAL AND SPATIAL DECISION SUPPORT SYSTEM". The bid can be downloaded on AP e-procurement portal from 04.06.2025 to 12.06.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 12.06.2025 up to 15.00 Hrs, Technical bid opening 12.06.2025 @16.00Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in .

Sd/-Commissioner, APCRDA, Vijayawada

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు & భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No.04/SE/R&B/KMM/2025-26 తేది: 30.05.2025

1) ఖమ్మం జిల్లాలో 1 నం. RSI పని కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. 2) ఆసక్తిగల బిడ్డర్లు టెండరు షెడ్యూలును ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in నుండి డౌనలోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది 23.06.2025న లేదా అలోగా మ.3:30 గం. వరకు. 3) తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.inలో చూడవచ్చును.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, (ఆర్&బి) సర్కిల్ :: ఖమ్మం

DIPR RO No.3028-PP/CL/ADVT/1/2025-26, Dt: 03.06.2025

తెలంగాణా ప్రభుత్వం
నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, గద్వాల్-509125.

క్ర.సం. 1, టెండర్ నెం మరియు తేది: 10/SE/IC/Gdl/2025-26, తేది:03.06.2025, పని పేరు: జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం- జోగులాంబ గద్వాల జిల్లా, ధరూర్ మండలం, రేలంపాడులో గల ర్యాలంపాడు రిజర్వాయర్ యొక్క ఎడమ మరియు కుడి ప్రధాన రెగ్యులేటర్ యొక్క ఆపరేషన్ మరియు నిర్వహణ రిపేర్ పనులు. పని విలువ: రూ.75.81 లక్షలు. టెండర్ డాక్యుమెంట్ లభించు తేది: 05.06.2025 ఉదయం 11.00 గంటల నుండి 12.06.2025 మధ్యాహ్నం 03.00 గంటలకు. టెండర్ స్వీకరించు తేది: 05.06.2025 ఉదయం 11.00 గంటల నుండి 12.06.2025 మధ్యాహ్నం 05.00 గంటల వరకు. సంబంధిత పర్యవేక్షక ఇంజనీర్ వారి చిరునామా : పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, గద్వాల్. మిగతా వివరములకు తెలంగాణ రాష్ట్ర 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ "https://tender.telangana.gov.in// నందు చూడగలరు.

సం/- పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, గద్వాల్-509125

DIPR RO No.3067-PP/CL/ADVT/1/2025-26, Dt.03.06.2025

పురపాలక సంఘ కార్యాలయం :: కొల్లాపూర్
జిల్లా:: నాగర్ కర్నూల్
ప్రకటన

లేఖ నెం. G1/219/KLPR/2025 తేది:03.06.2025

విషయము: పురపాలక సంఘం కొల్లాపూర్ – తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వు నెం. G.O. Rt. No. 269 తేది: 29.05.2025 మరియు ప్రభుత్వ ఉత్తర్వు నెం. G.O. Ms. No. 12, MA&UD (MA) Dept. తేది: 30.01.2021 ద్వారా పట్టణమునకు (19) వార్డుల విభజన గురించి.

సూచన: 1. G.O.Ms No. 12, MA&UD (MA) Dept. Dt: 30.01.2021
2. From the C&D MA, Hyderabad, Letter Roc.No. 7667743/2025/F1, dated.30.01.2025, 08.04.2025 & 23.05.2025.
3. G.O.Ms.No.103, MA&UD(MA) Department, Dated. 26.05.2025
4.G.O Rt.No.269 Dated:29.05.2025

తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వు నెం. G.O. Rt. No. 269 తేది: 29.05.2025 మరియు ప్రభుత్వ ఉత్తర్వు నెం. G.O. Ms.No. 12 MA&UD (MA) Dept., తేది: 30.01.2021 ద్వారా పురపాలక సంఘం కొల్లాపూర్ పట్టణమునకు (19) వార్డులుగా ప్రకటన చేయడమైనది. ప్రభుత్వ ఉత్తర్వుల సూచన 1 నుండి 3 నిబంధనల ప్రకారం వార్డుల విభజన ఈ దిగువ చూపబడిన విధముగా విభజించడమైనది. కావున పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలో తేది: 05.06.2025 నుండి 11.06.2025 వరకు తమ అభ్యంతరాలు / సలహాలు ఏవైనా ఉన్న యెడల ఈ దిగువ సంతకం దారునకు తెలియజేయగలరు.

Ward Numbers	House Numbers From	House Numbers To	Total Voting Strength	Locality
1	9th Block From H.No.1-9-1to	9th Block Upto H.No.1-9-108/3	1097	JANGALA COLONY, BC COLONY, SATHYA TALKIES ROAD.
2	Chukkaipally From H.No.1-1	Chukkaipally Upto H.No.3-4	1052	CHUKKAIPALLY BC COLONY, DHARGAH AREA
3	Chukkaipally From H.No.3-5 and SC Chukkaipally colony From H.No.2-17-1	Chukkaipally Upto H.No.6-10and LastH.No.and SC Chukkaipally colony Upto H.No.2-17-64	1030	AMBEDKAR COLONY, PSSCHOOL AREA, BYPASS ROAD SC COLONY, KOLLAPUR SC CHUKKAIPALLY COLONY CHENNAKESHAVA TEMPLE AREA
4	Kollapur SC Chukkaipally Colony From H.No.2-17-65 From16th Block H.No.2-16-1	Kollapur SC Chukkaipally Colony Upto H.No.2-17-205/1& Last H.No. Upto 16th Block H.No. 2-16-174/3/2& & Last H.No.	1006	KOLLAPUR SC CHUKKAIPALLY COLONY, PS SCHOOL AREA, CHURCH AREA, SC COMMUNITY AREA AMBEDKAR AREA
5	H.No.2-18-1 H.No.2-19-1 H.No.2-20-1	H.No. 2-18-121 & Last H.No. H.No.2-19-139/1 & LastH.No H.No.2-20-74	958	RANGADAS STREET, JERRI VEEDHI, SHIVALAYAM TEMPLE Rtd.DT ARUNKUMAR HOUSES AREA
6	H.No.2-20-75 H.No.3-21-1 H.No.3-22-1 H.No.3-23-1	H.No.2-20-144 & Last H.No. H.No.3-21-144 & Last H.No. H.No.3-22-122 & Last H.No. H.No.3-23-68 & Last H.No	1025	TERUVEEDHI, EX SARPANCH SRINADAM HOUSES, RAJAVEEDHI, JEMMICHETTU AREA, KLPR ANJANEYA TEMPLE, VASAVI FUNCTION HALL AREA
7	H.No.1-1-1 H.No.3-24-1 H.No.3-25-1 H.No.3-25-90	H.No.1-1-25 H.No.3-24-128/1 & Last H.No. H.No.3-25-68 H.No.3-25-115	964	CHAKALI VEEDHI, GANDHI SCHOOL ROAD, GODHAL MAHELA, GUVVALA GERI, YELLUR ROAD, AMARAGIRI COLONY.
8	H.No.3-25-69 H.No.3-25-116 H.No.3-26-1	H.No.3-25-89 H.No.3-25-130 & Last H.No H.No.3-26-122 & Last H.No.	941	MADINA CLINIC, CHOWNI VEEDHI PART, SRIKRISHNA TEMPLE AREA, VADDE GERI, RACHAKATTA ROAD
9	H.No.1-1-26 H.No.1-2-19	H.No.1-1-201 & Last H.No H.No.1-2-36/2	1038	QUBHA MASJID ROAD, COURT COMPLEX AREA, OLD GANESH TALKIES, CHOWNI VEEDHI PART, KHADAR BASHA ROAD.
10	H.No.1-2-1 H.No.1-2-36/3 H.No.1-3-1	H.No.1-2-18 H.No.1-2-139 & Last H.No. H.No.1-3-137	1024	BANDAI GUTTA, THOLLA GERI, VETERNARY HOSPITAL, VENKATESHWARA TALKIES, KADHAR BASHA ROAD
11	H.No.1-3-138 H.No.1-4-1	H.No.1-3-247/1 & Last H.No. H.No.1-4-70	1051	INDIRA COLONY, UPS SCHOOL, JAMEEN GADDA SC COLONY
12	H.No.1-5-1 H.No.1-4-71	H.No.1-5-162/1 & Last H.No. H.No.1-4-156 & Last H.No.	1052	JAMEEN GADDA, HANUMAN TEMPLE AREA, WARIDYALA KALLU COMPOUND
13	H.No.1-6-1 H.No.1-7-1 H.No.1-6-22/1	H.No.1-6-128/3 & Last H.No. H.No.1-7-43 H.No.1-8-22/7/1	943	WARIDYALA MAHABUB FUNCTION HALL, R&B GUEST HOUSE, OLD POST OFFICE, CHOWTABETLA ROAD
14	H.No.1-1	H.No.1-254	998	CHOWTABETLA
15	H.No.1-8-1 H.No. 1-8-22/7/2 H.No.1-7-44	H.No.1-8-22 H.No.1-8-118/1/A& Last H.No. H.No.1-7-154/3 & Last H.No.	1004	WARIDYALA POCHAMMA GUDI, MPDO OFFICE, MADHAVA SWAMY TEMPLE, TEACHERS COLONY
16	H.No.1-9-108/4 H.No.2-15-51	H.No.1-9-218&LastH.No H.No.2-15-82.	1014	S.T.AREA, SATYA SAITALKIES AREA, WARIDYALA VADDE GERI, CURRENT OFFICE, SCHOLERS SCHOOL.
17	H.No.2-15-1 H.No.2-15-82/1 H.No.2-14-1	H.No.2-15-50 H.No.2-15-158/3 & Last H.No. H.No.2-14-138 & LastH.No.	1011	TELUGU VEEDHI, LAXMI COLONY, AMBEDKAR COLONY, GANGAMMA TEMPLE, BUS STAND.
18	H.No.2-11-81 H.No.2-12-1 H.No.2-13-1	H.No.2-11-142 & LastH.No. H.No.2-12-138 & LastH.No. H.No.2-13-118 & Last H.No.	967	RAJAVEEDHI, JAME-E-MASJID, BOYA GERI, TELUGU VEEDHI
19	H.No.2-11-1 H.No.1-10-1	H.No.2-11-80 H.No.1-10-187/1 & Last H.No.	1001	RAJA PALACE, RAJA VEEDHI, SAVILLA VEEDHI
		TOTAL VOTING STRENGTH	19194	

Sd/- COMMISSIONER, KOLLAPUR MUNICIPALITY

DIPR RO.No 3035-PP/CL/ADVT/1/2025-26, Dt: 03.06.2025

भारत सरकार
अंतरिक्ष विभाग
राष्ट्रीय सुदूर संवेदन केंद्र
हैदराबाद -500 037, तेलंगाना भारत
टेलीफोन: +040-23884173 / 74
फैक्स: +040-23884179

Government of India
Department of Space
National Remote Sensing Centre
Balanagar, Hyderabad – 500 037, Telangana, India
Telephone: +040-23884173 / 74
Fax: +040-23884179

निर्माण एवं अनुरक्षण समूह / CONSTRUCTION & MAINTENANCE GROUP
ई-निविदा नोटिस / e-TENDER NOTICE

समूह प्रधान, सीएमजी, एनआरएससी, हैदराबाद द्वारा निम्नलिखित कार्यों के लिए ऑन-लाइन आइटम दर निविदा आमंत्रित की जाती है।
Online item rate tenders are invited by the Gr. Head CMG, NRSC, Hyderabad for the following work:

एनआईटी सं. NIT No.	कार्य का नाम / Name of work	अनुमानित प्राक्कलित लागत Approximate Estimated Cost ₹.	निविदा दस्तावेज़ डाउनलोड करने की अवधि Period during which the tender document can be downloaded	बोली अपलोड करने की अंतिम तिथि Last date for Bid uploading
NRSC/CMG/NIT/ET/07/2499/2025-26	एनआरएससी, बालानगर परिसर, हैदराबाद में निदेशक एवं वरिष्ठ अधिकारियों के लिए आवासीय आवास (2 बंगले) का निर्माण। (सिविल, पीएच एवं विद्युत कार्यों के लिए संयुक्त अनुबंध) । Construction of Residential Accommodation for Director and Senior Officials (2 Nos Bungalow) at NRSC, Balanagar Campus, Hyderabad. (Composite contract for Civil, PH and Electrical works).	₹ 254.70 लाख / Lakhs	From : 04.06.2025 से To : 16.06.2025 तक	Up to 20.06.2025 16:00 बजे / Hrs
NRSC/CMG/NIT/ET/09/25007/2025-26	एनआरएससी शादनगर परिसर में चिनाई वाली दिवार के साथ मैकेनिकल वर्कशॉप के हाई बे तक पहुंच मार्ग के लिए प्रस्तावित मिट्टी भराई । Proposed earth filling for approach road to high bay of Mechanical Workshop with Masonry retaining wall at NRSC Shadnagar Campus.	₹ 6.95 लाख / Lakhs	From : 04.06.2025 से To : 16.06.2025 तक	Up to 20.06.2025 16:00 बजे / Hrs

विस्तृत एनआईटी एवं पात्रता मानदंड ईएमडी बोली संबंधित प्रलेख आदि www.tenderwizard.com/ISRO पोर्टल से देखा/डाउनलोड किया जा सकता है। किसी प्रकार के संशोधन, समय विस्तार, स्पष्टीकरण आदि वेबसाइट पर अपलोड किया जाएगा और किसी समाचार पत्र में प्रकाशित नहीं किया जाएगा। बोलीकर्ता अद्यतन जानकारी हेतु नियमित रुप से वेबसाइट देखें।

Detailed NIT and eligibility criteria, EMD bidding document, etc. can be viewed /download from www.tenderwizard.com/ISRO portal. All amendments, time extension, clarifications, etc. will be uploaded on website and will not be published in newspapers. Bidders should regularly visit website to keep themselves updated.

समूह प्रमुख सी.एम.जी. / Group Head CMG, निर्माण एवं अनुरक्षण समूह / Construction & Maint. Group

---

TELANGANA CO-OPERATIVE MARKETING FEDERATION LTD.
Email: proc.tsmarkfed2018@gmail.com, Ph.No: 040-2460 7108, Fax: 040-2460 7100

Rc.No./P&M/ Disposal of Soyabean Vanakalam 2024-25 Date: 03.06.2025

TENDER FOR SALE OF SOYABEAN PROCURED BY TG MARKFED DURING VANAKALAM 2024-25

TG MARKFED invites online e-auction bids for the sale of the entire quantity of **590.067 MTs** of Soyabean procured during Vanakalam 2024-25, in a single lot, without a base price.

Online e-auction starts on dated **19.06.2025, from 11:00 AM to 02:00 PM** through **e-procurement.telangana.gov.in or https://auction.telangana.gov.in/** i.e. Telangana e-procurement portal (Applications in e-procurement portal will be available from 04.06.2025 AN). **EMD** submission end date 17.06.2025

For online registration and further technical support please contact Service providers Ph: 7337445546, 7337445545 & 6309339690, 9912756216.
For further details please contact. Ph: 7288879806, and 7288879829

DIPR RO No.2994-PP/CL/ADVT/1/2025-26,Dt.03.06.2025 Sd/- MANAGING DIRECTOR

పురపాలక సంఘం కార్యాలయము స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ:: జనగాం జిల్లా

ఫైల్ నెం:జీ1/టీ.పి/1-41/2025 చిత్తు ప్రకటన తేది:03.06.2025

కమిషనర్ మరియు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, తెలంగాణ, హైదరాబాద్ వారు, ప్రొసీడింగ్స్ నెం.774666-2/2025/F1, తేది:27.01.2025 ప్రకారం, జనగాం జిల్లా, స్టేషన్ ఘనపూర్ చాగల్ మరియు శివునిపల్లి గ్రామ పంచాయతీలను విలీనం చేసి స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీగా ప్రకటించడమైనది. ఈ ప్రకటనతో పాటు స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలో మొత్తం 18 వార్డులు ఏర్పాటు చేయడమైనది. ప్రతి వార్డు పరిధిలోకి వచ్చే గ్రామాలు, ఇంటి నెంబర్లు, మరియు వార్డు సరిహద్దుల వివరములు సంబంధిత చిట్టా ప్రకటనలో పేర్కొనబడ్డాయి. ఈ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేది నుండి (07) రోజులలోగా, స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ సూచనలు / అభ్యంతరాలు రాత పూర్వకంగా మున్సిపల్ కార్యాలయానికి పంపవలసినదిగా తెలియజేయడమైనది.

క్ర. సం.	వార్డు నెం.	ఇంటి నెంబరు నుండి ఇంటి నెంబరు వరకు	వార్డు సరిహద్దు వివరాలు	గ్రామము పేరు
1	1	11-52 నుండి 11-53/5 8-32 నుండి 9-100 వరకు	జయ పౌల్ట్రీ ఫాం నుండి ఎడ్ల రాజయ్య ఇంటి వరకు	ఘనపూర్
2	2	8-210 నుండి 8-217 వరకు 1-1/1 నుండి 1-6/6 వరకు 8-196 నుండి 8-202 8-189/1 నుండి 8-195 8-171/1ఎ నుండి 8-171/2/5 8-183 నుండి 8-187 8-167-7 నుండి 4167 వరకు /41 1-250/1 8-171/ఏ నుండి 8-217/5 8-169 నుండి 8-170 8-132 నుండి 8-167/1 8-1 నుండి 8-1/8 8-82 నుండి 8-131 8-78 నుండి 8-82 1-6/5 నుండి 1-11/2111 వరకు 8-3 నుండి 8-9/1 వరకు 8-39 నుండి 8-44 వరకు	పముసూర్ రోడ్డు నుండి ZPHS స్కూల్ మరియు వెనుక, రైల్వే గేట్, SC కాలనీ	శివుని పల్లి
3	3	7-111 నుండి 7-160 వరకు 4-86 నుండి 4-116 వరకు 8-44 నుండి 8-82 4-4 నుండి 4-6 3-50/ఏ నుండి 3-96 3-24 నుండి 3-48 3-7 నుండి 3-23 8-78/3/3 నుండి 8-826/8 నుండి 8-820/4 వరకు 2-135 1-229/3 నుండి 1-244 వరకు	వీవర్స్ కాలనీ, బీసి హాస్టల్, ఎస్‌సి కాలనీ, కుంటకట్టు రోడ్, లయోలా హై స్కూల్	శివునిపల్లి
4	4	7-4 నుండి 7-32 వరకు 7-97 నుండి 7-109/1 5-1 నుండి 5-108 వరకు 6-1 నుండి 6-150 వరకు 4-52 నుండి 4-84 వరకు	కూర్మవాడ, కుంటకట్టురోడ్, గుండయ్య మిల్లు బ్యాక్‌సైడ్, ముదిరాజ్ కాలనీ, UPS స్కూల్‌దగ్గర	శివునిపల్లి
5	5	4-39 నుండి 4-49 వరకు 2-41 నుండి 2-81 వరకు 2-35/35 నుండి 2-38/5 3-1 నుండి 3-6 1-146 నుండి 1-228 వరకు 1-52 నుండి 1-93 వరకు 2-1 నుండి 2-35/34/1 1-136/129 నుండి 1-129 వరకు 1-102 నుండి 1-126/7 వరకు	ఆదిత్య ఐటిఐ సమీపంలో, జూనియర్ కళాశాల, సివిఎస్‌ఎస్ గోదాం, కుమ్మరికుంట, రైల్వే స్టేషన్ రోడ్, పాలకుర్తి రోడ్	శివునిపల్లి
6	6	5-100/ఏ/2 నుండి 6-92 6-100/7-18/ఏ	శ్రీధర్‌వైన్స్ సర్వీస్ రోడ్, ఎస్‌సి కాలనీ, దగ్గర, తుమ్మలగూడెం పోస్టాఫీసు	చాగల్
7	7	7-32/3B నుండి 7-37/1ఎ వరకు, 8-20 నుండి 8-29 వరకు, 8-30 నుండి 10-77 వరకు	ఎన్‌టీఆర్ కాలనీ, శివారెడ్డి పల్లి, పద్మశాలి కాలనీ, బాబూజీనగర్	చాగల్
8	8	5-24 నుండి 7-98/2, 1-81 నుండి 2-1 వరకు	గుడిబండ, కుమ్మరివాడ, రాజన్నబంగ్లా, కుమ్మరి పేట, రైతు వేదిక	చాగల్
9	9	3-100/2E to 4-13, 1-1 to 2-55, 2-66 to 4-7	అకులవాడ,గుండ్లవాడ, సాయినగర్ కాలనీ, ఎస్‌సి కాలనీ	చాగల్
10	10	4-57 to 5-89	ఇందిరానగర్ కాలనీ, ఆర్‌టీసి కాలనీ, బీరప్పగుడి, పెద్దమ్మగుడి గల్లీ నుండి గబ్బకాంతయ్య ఇంటి వరకు	ఘనపూర్
11	11	5-90/1 to 8-31/A	గబ్బ కాంతయ్య ఇంటి నుండి [illegible]	ఘనపూర్
12	12	9-99 to 10-57/1R	[illegible]	ఘనపూర్
13	13	10-58 to 10-11 1-1 to 1-51/2	[illegible]	ఘనపూర్
14	14	1-62/3 to 2-31/3a	[illegible]	ఘనపూర్
15	15	2-31/b to 2-103/11-2	[illegible]	ఘనపూర్
16	16	2-103/11/2 to 2-13/11-4 2-103/11-5 to 2-104/C-D 2-104/1 to 2-105/72/1c	[illegible]	ఘనపూర్
17	17	2-105/72/1d to 3-115/3 2-103/11-2 to 2-103/11-4 2-104/1 2-104 2-104/C-D	[illegible]	ఘనపూర్
18	18	3-115/5 నుండి 4-56/E 4-132/1 నుండి 4-228 వరకు	[illegible]	ఘనపూర్
		మొత్తం		

DIPR R.O.No.3042-PP/CL/ADVT/1/2025-26, Dt.03.06.2025 కమిషనర్, స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రష్యా 'పెర్ల్‌హార్బర్'!

నలభైకి పైగా రష్యన్ విమానాలను ఉక్రెయిన్ పేల్చివేసిన ఆ ఘటన ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. సామాజిక మాధ్యమాల్లో అసలు దృశ్యాలకంటే కృత్రిమవిడియోలే అనేకరెట్లు విస్తృతంగా ప్రచారమైనాయి. ఇటీవలికాలంలో ఎన్నడూ చూడని, ఊహకు కూడా అందని ఈ కొత్తతరహా దాడి ఆధారంగా విడియోగేమ్‌లు కూడా తయారైనాయట. సరిహద్దునుంచి నాలుగువేల కిలోమీటర్ల లోపలకు చొచ్చుకుపోయి, రష్యాలోని వేర్వేరుప్రాంతాల్లో ఉన్న వైమానిక స్థావరాలపై ఉక్రెయిన్ దాడులు చేయగలగడం ఊహకు అందనిది. డ్రోన్లను ట్రక్కుల్లో దట్టించి రష్యాలోకి రహస్యంగా చేరవేయడం, ఆ వాహనాలను వైమానికస్థావరాలకు సమీపంలో ఉంచడం, తాము కోరుకున్న సమయంలో రిమోట్‌తో వాటి పైకప్పులను ఎత్తి డ్రోన్లను గాలిలోకి వదలడం 'ఆపరేషన్ స్పైడర్‌వెబ్' పేరుకు తగ్గట్టుగానే ఉంది. ఉబ్బితబ్బిబ్బవుతున్న జెలెన్‌స్కీ, ఏడాదిన్నర కష్టమిది అంటున్నారు. అణ్వాయుధాలను మోసుకుపోగలిగే యుద్ధవిమానాలు, బాంబర్లతో సహా, హెచ్చరిక, రక్షణ వ్యవస్థలున్న విమానాలు కూడా నాశనమైనవాటిలో ఉన్నాయని ఉక్రెయిన్ అంటోంది. ఉక్రెయిన్ గొప్పలన్నింటినీ నమ్మనక్కరలేదు కానీ, డ్రోన్లు, కృత్రిమమేథస్సు కలగలిపి సాగించిన ఈ విధ్వంసం యుద్ధం మొదలైన తరువాత రష్యాకు అతిపెద్ద దెబ్బ.

బుడాపెస్ట్ ఒప్పందంలో భాగంగా ఉక్రెయిన్ తన వద్ద ఉన్న ఆఖరు విడత అణ్వాయుధాలను రష్యాకు అప్పగించి ఆదివారం నాటికి 29 సంవత్సరాలైందని కొందరు గుర్తుచేసుకుంటున్నారు. రష్యన్ ప్రజలు ఈ డ్రోన్లదాడిని 1941 డిసెంబరు 7న పెర్ల్ హార్బర్‌లో అమెరికా నౌకాదళం మీద జపాన్ జరిపిన వైమానిక దాడితో పోల్చుకుంటున్నారు. యుద్ధాల్లో డ్రోన్ల వినియోగం ఏ స్థాయికి హెచ్చిందో ఈ ఘటన చెబుతోంది. ఇటీవలే రష్యా నాలుగువందల డ్రోన్లను వినియోగించి ఉక్రెయిన్‌ను దెబ్బతీసిన నేపథ్యంలో, అంతకంటే అత్యాధునికమైన, సొంత బుర్రతో సమస్త కార్యాలనూ చక్కబెట్టగల నాలుగోవంతు డ్రోన్లతో ఉక్రెయిన్ పైచేయి సాధించడం విశేషం. తక్కువ ఖర్చుతో తయారైన చిన్నచిన్న డ్రోన్లు ఇంతటి పెను విధ్వంసాన్ని సృష్టించడం యుద్ధరీతుల్లోనూ, నీతుల్లోనూ వచ్చిన మార్పుకు ప్రబల నిదర్శనం. ఒక్కసారిగా గాల్లోకి లేచి, తూనిగల్లాగా ఎగురుతున్న బుల్లి డ్రోన్లు ఏకంగా భారీ బాంబర్లను పేల్చివేస్తున్న దృశ్యాలు డ్రోన్ టెక్నాలజీలో అమితవేగంగా జరుగుతున్న ఎదుగుదలను తెలియచెప్పడమే కకాదు, భవిష్యత్ యుద్ధాలు ఏ విధంగా జరగబోతాయో కూడా హెచ్చరిస్తున్నాయి.

యుద్ధంలో ఉన్న రెండుపక్షాలు ఇంత సునాయాసంగా పరస్పరం నష్టపరచుకొనే, రెచ్చగొట్టుకొనే వీలున్నప్పుడు యుద్ధాలను ఆపడం కూడా కష్టమే. వారం క్రితం మిసైళ్ళు, డ్రోన్లతో రష్యా సాగించిన విధ్వంసం అమెరికా అధ్యక్షుడికి అమితాగ్రహం కలిగించింది. ఒకపక్క చర్చలు జరుగుతూంటే, కాల్పుల విరమణకు సిద్ధపడకుండా ఇప్పటివరకూ యుద్ధంలో వాడని అతిశక్తిమంతమైన మారణాయుధాలతో సామాన్యులను సైతం పుతిన్ చంపినందుకు ట్రంప్‌కు కోపం వచ్చింది. రష్యాను తానే రక్షిస్తున్నానని, తానేగనుక లేకపోతే ఈ పాటికి రష్యాకు తీవ్రమైన చెడు జరిగి, ప్రపంచపటం నుంచి చెరిగిపోయేదన్నట్టుగా ఆయన మాట్లాడారు. పుతిన్ నిప్పుతో చెలగాటమాడుతున్నాడన్నట్టుగా ట్రంప్ చేసిన వ్యాఖ్యల్లో రష్యా పెద్దలకు మూడో ప్రపంచయుద్ధం హెచ్చరిక కూడా కనిపించింది. వారం నాటి ఆ దాడి శాంతి చర్చలను ప్రభావితం చేస్తుందని అనుకుంటే, మలివిడత చర్చలకు కూచోబోతున్న కొద్దిగంటలముందు జరిగిన ఇప్పటిదాడి వాటి వైఫల్యానికి కారణం కావడం అత్యంత సహజం. తుర్కియే కేంద్రంగా రెండోవిడత చర్చలు కనీసం గంటకూడా సాగకుండా ముగిసిపోయాయి. ఈ చర్చల్లో కాల్పుల విరమణ గురించి పలుమార్లు ఉక్రెయిన్ ఒత్తిడిచేసినా రష్యా లొంగలేదట. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఆపరేషన్ స్పైడర్ వెబ్ తీవ్రమైన అవమానాన్ని మిగిల్చింది. ఏడాదిన్నరగా సాగుతున్న ప్రణాళికను రష్యన్ ఇంటలిజెన్స్ విభాగం పసిగట్టలేకపోవడం పెద్ద వైఫల్యం. ఉక్రెయిన్ మీద మరింత తీవ్రంగా కక్షసాధించాలన్న ఒత్తిడి పుతిన్‌మీద పెరుగుతోందని వార్తలు వస్తున్న నేపథ్యంలో, రాబోయే కాలంలో ఈ ప్రతీకార దాడుల స్థాయి, విస్తృతి ఊహకు అందదు. కాలం గడుస్తున్నకొద్దీ యుద్ధం కట్టుతప్పి ఇరుపక్షాలనూ ఎదురెదురుగా కూర్చోబెట్టగలిగే అవకాశమే లేకపోవచ్చు. రెండోవిడత చర్చలు విఫలమైన నేపథ్యంలో తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ ఓ ప్రతిపాదన చేశారు. సాధ్యమైనంత త్వరలో, కనీసం ఈ నెలాఖరులోగా, రష్యా, ఉక్రెయిన్, అమెరికా అధ్యక్షులు నేరుగా చర్చల్లో కూర్చోవాలన్న ఆ ఆలోచనకు ముగ్గురూ సరేనంటే తప్ప, చర్చల్లో ప్రగతి అసాధ్యం.

కాంగ్రెస్‌కు అధిష్ఠానమే గుదిబండ!



▪ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

గత నెల చివరి వారంలో నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ పదవ సమావేశంలో ముగ్గురే ముగ్గురు ముఖ్యమంత్రులు అద్భుతమైన ప్రసంగాలు చేసి అందరి దృష్టినీ ఆకర్షించారని ఒక అధికారి తెలిపారు. వారిలో ఇద్దరు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి కావడం గమనార్హం. సాధారణంగా తన సహజ శైలిలో చంద్రబాబు తన ప్రసంగ వెల్లువలో తానే కొట్టుకుపోకుండా నిర్దిష్టమైన సూచనలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను జాతీయ అభివృద్ధికి నమూనాగా మార్చేందుకు తానేమి చేయబోతున్నానో స్పష్టంగా చెప్పి చంద్రబాబు అందర్నీ ఆకట్టుకున్నారు. తెలంగాణ రైజింగ్ ఎజెండాను ఆవిష్కరిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థలోను, సామాజిక న్యాయం అందించడంలోను తెలంగాణ ముఖ్యమైన భూమిక ఎలా పోషించగలదో రేవంత్‌రెడ్డి వివరించారు. కేంద్రం సహకార సమాఖ్య విధానాన్ని అవలంబించినప్పుడే రాష్ట్రాలు సమానంగా అభివృద్ధి చెందగలవని ఆయన స్పష్టీకరించారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవత్‌సింగ్ మాన్ తమ రాష్ట్రం పట్ల కేంద్రం అవలంబిస్తున్న సవతి తల్లి ధోరణిని నిర్ద్వంద్వంగా ఖండించారు.

ఆ సమావేశం తర్వాత నరేంద్రమోదీ కూర్చున్న రౌండ్ టేబుల్‌లోనే చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కూడా ఉండడంతో సహజంగా మోదీ ఇరువురితోనూ స్నేహపూర్వకంగా మాట్లాడారు. మాటల సందర్భంలో రేవంత్ తన సహజ ధోరణిలో మాట్లాడుతూ 'నేను మొదట మీ స్కూలులోనూ, తర్వాత చంద్రబాబు కాలేజీలోనూ చదువుకున్నాను.. ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉద్యోగం చేస్తున్నాను..' అని చమత్కరించారు. ఇందుకు మోదీ బిగ్గరగా నవ్వి రేవంత్ భుజం తట్టారని సమాచారం. చంద్రబాబు ఢిల్లీలో ఉన్న రెండు రోజుల్లోనూ అమిత్ షాతో సహా ఏడుగురు మంత్రులను కలుసుకుని నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొని అదే రోజు సాయంత్రం వెళ్లిపోయారు. ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు నెలకోసారి సగటున ఢిల్లీకి వచ్చినప్పటికీ నిర్దిష్టంగా తనకు అవసరమైన పనులు చేసుకుని వెళ్లిపోతారు. ఆయన వచ్చిన ప్రతిసారీ ఆయన ప్రాధాన్యం కొట్టొచ్చినట్లు కనపడుతుంది. మంత్రులు ఆయనను ఎదురెదురుగా కూర్చోబెట్టడం కాకుండా తమ పక్కన కూర్చోబెట్టుకుని మాట్లాడడమే ఇందుకు నిదర్శనం.

నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొన్న రేవంత్ వెంటనే ఢిల్లీ నుంచి వెళ్లిపోలేదు. అదే రోజు ఆయనకు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో అపాయింట్‌మెంట్ లభించి రాష్ట్రానికి సంబంధించి కొన్ని ముఖ్యమైన ప్రతిపాదనలపై చర్చించే అవకాశం లభించినప్పటికీ కాంగ్రెస్ అధిష్ఠానంతో పెండింగ్ అంశాలను చర్చించడం కోసం మూడు రోజుల పాటు దేశ రాజధానిలోనే మకాం వేయవలసి వచ్చింది. చివరకు ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను తప్ప మరెవరినీ కలుసుకోలేక, సమస్యలకు పరిష్కారం సాధించలేక తిరిగి వెళ్లిపోయారు. నిజానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అనుకున్న సమయానికి రాలేకపోవడం వల్ల నిర్ణయాలు వాయిదా పడి ఉండవచ్చు కాని సహజంగానే ఒక ముఖ్యమంత్రి ఢిల్లీలో పార్టీ నేతలను కలుసుకోవడం కోసం ఇన్ని రోజులు ఉండాల్సి రావడంపై ప్రజల్లో చర్చకు రాక తప్పదు. పీసీసీ అధ్యక్షుడు తాను ఎంపికై ఏడెనిమిది నెలలు కావస్తున్నా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గాన్ని ఎంపిక చేసుకోలేకపోవడం, ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటిపోతున్నా మంత్రివర్గాన్ని విస్తరించలేకపోవడం ప్రధాన చర్చనీయాంశాలు. నిజానికి ఇవేమీ పెద్ద ప్రజాసమస్యలు కాకపోయినా ఢిల్లీ రావడం, రోజుల తరబడి వాటికోసం ఉండాల్సి రావడం జనం దృష్టిని దాటిపోలేని అంశాలే అనడంలో సందేహం లేదు. ముఖ్యమంత్రి వచ్చినప్పుడల్లా పెద్ద ఎత్తున కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి రావడం, పార్టీ నేతల్ని కలుసుకోవడం, రకరకాల కథనాలను ప్రచారం చేయడం జరుగుతూనే ఉంటోంది. ఎలాగూ ముఖ్యమంత్రి తరుచుగా వస్తున్నారు కనుక మళ్లీ వెళ్లిపోవడం ఎందుకులే అని కొందరు ఎమ్మెల్యేలు ఇక్కడే ఉండి రకరకాల నేతల్ని కలుసుకుంటున్నారు. ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కటాక్ష వీక్షణాలకోసం తాపత్రయ పడుతూనే ఉన్నారు. కర్ణాటక పరిస్థితి కూడా తెలంగాణ పరిస్థితికి ఏమంత భిన్నంగా లేదు. ముఖ్యమంత్రిని ఢిల్లీకి పదే పదే తిప్పించుకోవడం కాంగ్రెస్ పార్టీకి ఆది నుంచి అలవాటేనని, దాని వల్లే పార్టీకి ఈ దుస్థితి దాపురించిందని సీపీఐ నేత నారాయణ లాంటి వారు కూడా విమర్శించారు.

కాంగ్రెస్‌లో రెండు ప్రధాన లక్షణాలు కనపడుతుంటాయి. ఒకటి– పదవులకోసం తపన; రెండవది– అసమ్మతి. పదవులకోసం కాంగ్రెస్ నాయకుల ఆరాటం, ఓపిక చూస్తుంటే అధికారం లేకపోతే జీవించలేరా అన్న ఆశ్చర్యం కలుగుతుంది. అధికారమే కాదు, నిత్య అసమ్మతి కూడా కాంగ్రెస్‌లో జీవలక్షణంలా కనిపిస్తుంది. ప్రతి రోజూ ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఈ మెయిల్స్, ఫోన్లు ఢిల్లీకి చేరుతూనే ఉంటాయి. ముఖ్యమంత్రి ప్రతి నిర్ణయాన్నీ, ప్రసంగాన్నీ విమర్శిస్తూ కాంగ్రెస్ పార్టీకి ఏదో తీవ్ర నష్టం జరిగిపోతున్నదని చెప్పేవారు ఉంటారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే వీటిలో కొన్ని మాటలు పార్టీ నేతలు కూడా నమ్ముతుంటారు. దానివల్ల రాష్ట్రానికి సంబంధించిన కొన్ని కీలక నిర్ణయాలు సుదీర్ఘకాలం పెండింగ్‌లోనే ఉంటాయి.

నాలుగేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ పంజాబ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాలలో అధికారంలో ఉండేది. ఈ మూడు రాష్ట్రాల్లోనూ ముఖ్యమంత్రులను మార్చాలని కాంగ్రెస్ అధిష్ఠానంపై తరుచూ ఒత్తిళ్లు వచ్చేవి. పంజాబ్‌లో అమరీందర్‌సింగ్ నేతృత్వంలో కాంగ్రెస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆయనపై అసమ్మతి తార స్థాయికి చేరుకుంది. రాహుల్‌గాంధీకి సన్నిహితుడుగా భావించిన నవజ్యోత్‌సింగ్ సిద్ధూ అవకాశం వచ్చినప్పుడల్లా అమరీందర్‌సింగ్‌పై తీవ్ర విమర్శలు చేసేవారు. లోక్‌సభ టిక్కెట్ల పంపిణీ నుంచి శాఖ కేటాయింపు దాకా ప్రతి అంశంలోనూ విభేదించేవారు. ముఖ్యమంత్రిని అవినీతిపరుడని నిందించేవారు. ఈ ఘర్షణ తీవ్రమై చివరకు అమరీందర్‌సింగ్ స్థానంలో ఒక దళిత ముఖ్యమంత్రిని నియమించారు. అమరీందర్ సింగ్ వేరు కుంపటి పెట్టుకున్నారు. ఆ తర్వాత పంజాబ్‌లో కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. ఛత్తీస్‌గఢ్‌లో 2018లో బీజేపీని గద్దెదించిన తర్వాత పీసీసీ అధ్యక్షుడు భూపేశ్ భగేల్‌ను ముఖ్యమంత్రి చేశారు. ఆయన మంత్రిమండలిలో ఆరోగ్యమంత్రి, ఒకప్పటి ప్రతిపక్ష నేత టీఎస్ సింగ్ దేవ్ సీఎం కావాలని తహతహలాడుతుండేవారు. రాష్ట్రంలో రొటేషన్ ప్రాతిపదికన ముఖ్యమంత్రిని మారుస్తామని రాహుల్ తనకు వాగ్దానం చేసినట్లు ఆయన చెప్పుకుంటుండేవారు. అలాంటిదేమీ లేదని, తానే ముఖ్యమంత్రిగా ఉంటానని భూపేష్ భగేల్ ప్రతిఘటించేవారు. ఇరు వర్గాలను కాంగ్రెస్ అధిష్ఠానం తరుచూ కలుసుకుని బుజ్జగిస్తూ ఉండేది. ప్రతిసారీ అధిష్ఠానమే అంతా నిర్ణయిస్తుందనే వారు కాని ఆ కుంపటి రగులుతూ చివరకు ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం కోల్పోయేందుకు దారి తీసింది. రాజస్థాన్‌లో కూడా ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్‌కూ, సచిన్ పైలట్‌కూ మధ్య బహిరంగంగానే రాజకీయ ఘర్షణ జరుగుతుండేది. మధ్యప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ఉన్న కమల్‌నాథ్‌పై రాహుల్ సన్నిహితుడు జ్యోతిరాదిత్య సింధియా తిరుగుబాటు సచిన్ పైలట్‌కు ప్రేరణగా నిలిచింది. మంత్రివర్గంలో తన విధేయులను చేర్చలేదనే కినుకతో ఉన్న సచిన్‌ను బుజ్జగించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎన్నో ప్రయత్నాలు చేసింది. ఒక దశలో అశోక్ గెహ్లోట్‌ను కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడుగా నియమించాలని ప్రయత్నం చేసినా ఆయన ముఖ్యమంత్రిగా ఉంటానని భీష్మించుకుకూర్చునే సరికి అధిష్ఠానం ఏమీ చేయలేకపోయింది. చివరకు రాజస్థాన్‌లో కూడా కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. గత ఏడాది హర్యానాలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అనేక మంది భావించారు. కాని కుమారి సెల్జా, రణదీప్ సింగ్ సూర్జేవాలా వర్గాలకూ, నాటి ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా వర్గానికీ మధ్య రేగిన చిచ్చు ప్రధానంగా పార్టీ అధికారంలోకి రాలేకపోవడానికి కారణమైంది.

నిజానికి భారతీయ జనతా పార్టీలో కూడా అంతర్గత తగాదాలు లేకపోలేదు. కాని దీనివల్ల పార్టీకి పెద్దగా నష్టం రాకుండా జాతీయ నాయకత్వం దృఢవైఖరితో, నిర్ణయాత్మకంగా వ్యవహరించింది. ఒకే ఒక నాయకుడో, నాయకురాలో దేశంలో పార్టీని గెలిపించడం ఎల్లవేళలా సాధ్యం కాదని, స్థానిక నాయకత్వాలు కూడా బలంగా ఉండడం అవసరమన్న విషయంపై బీజేపీలో కూడా చర్చ జరుగుతోంది.

వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మొదట్లో తన సన్నిహితుడైన కేవీపీ రామచంద్రరావుకు రాజ్యసభ సభ్యత్వాన్ని సాధించలేకపోయారు. తన కుమారుడికి సీటు కూడా ఇప్పించలేకపోయారు. అయితే ఆయన క్రమంగా పార్టీపై పట్టు సాధించి తాను అనుకున్నవి జరిగేలా చూసుకున్నారు. పీజేఆర్‌ను మంత్రిగా నియమించాలని సోనియా భావించినా ఆయన సున్నితంగా తిరస్కరించారు. తనపై అసమ్మతి ప్రకటించిన వి. హనుమంతరావు లాంటి వారిని ఢిల్లీ విస్మరించేలా చేశారు. పార్టీపై తన పట్టు బిగించడానికి వైఎస్‌కు చాలా కాలం పట్టింది. విచిత్రమేమంటే కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో అధికారంలో లేకపోయినా, కేవలం మూడు రాష్ట్రాలకే పరిమితమయిపోయినా ఆ పార్టీ రాజకీయ సంస్కృతి మాత్రం మారలేదు! బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఎదగాలంటే ఆ రాజకీయ సంస్కృతిని ఏ విధంగా మార్చుకోవాలో ఆత్మవిమర్శ చేసుకోవాలి. ముఖ్యంగా తాము ఎంపిక చేసుకున్న నేతల్ని తమ దగ్గర పనిచేసే ఉద్యోగుల్లా కాకుండా విశ్వాసంలోకి తీసుకుని వారికి పూర్తి అండదండలివ్వడం అవసరం.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



కాంగ్రెస్ గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించలేకపోవడానికి ఆ పార్టీలో కొన్ని దశాబ్దాలుగా నెలకొన్న రాజకీయ సంస్కృతి ఒక కారణమని చెప్పక తప్పదు. పార్టీని జిల్లా స్థాయి నుంచి పటిష్ఠం చేయాలని, అభ్యర్థుల ఎంపికలో డీసీసీ అధ్యక్షులకు భాగస్వామ్యం కల్పించాలని, సామాజిక న్యాయానికి పెద్ద పీట వేయాలని రాహుల్ సంకల్పించారు. కాంగ్రెస్ పురోగతికి మౌలికంగా నష్టం కలిగిస్తున్న పార్టీ అధిష్ఠానం వ్యవహార శైలిపై ఆయన ముందుగా దృష్టి కేంద్రీకరించాల్సి ఉన్నది.

తెలంగాణ పోరాట ఖ్యాతి.. మసకబారొద్దు

'చరిత్ర మనకు బోధిస్తుంది, సంస్కృతి మనలను ఏకం చేస్తుంది, పోరాటమే మన భవిష్యత్తును నిర్మిస్తుంది, అందుకే పోరాటం ఒక్క రోజు ఫలితం కోసం కారాదు, శాశ్వత స్వేచ్ఛ కోసమై ఉండాలి' అన్న నినాదంతో దోపిడీ, పీడనలపై ఎనభై ఏళ్ల క్రితమే తెలంగాణ రైతాంగాన్ని ఐక్యం చేసి విముక్తి మార్గాన్ని చూపిన సేనాని రావి నారాయణరెడ్డి. ఆయన పోరాట స్ఫూర్తితో సాదాసీదా కూలి జనం ఒక్కటై నిజాం రాజుపై చేసిన పోరాటంతో భూస్వాములు పట్టణాలకు పోయారు, జాగిర్దారీ విధానం రద్దయ్యింది, భూస్వాముల భూకేంద్రీకరణ రద్దయింది. అన్నింటికీ మించి తెలంగాణ రైతుబిడ్డలకు ఆత్మగౌరవంతో కూడిన స్వేచ్ఛ లభించింది. బక్క రైతుల సాయుధ రైతాంగ పోరాటం తెలంగాణలో ప్రజారాజ్యం ఏర్పాటుకు దారి చూపింది. అనేక రక్షణలు, హామీలు అమల్లోకి వచ్చాయి. కానీ భారత యూనియన్‌లో విలీనమైన ఇరవై ఏళ్లలోనే మళ్లీ వివక్ష రూపం మారింది, దోపిడీ విధానం మారింది. దీంతో కడుపు మండిన విద్యార్థి, యువజనులు మా ఉద్యోగాలు మాకే కావాలంటూ మళ్లీ తుపాకీ గుళ్లకు ఎదురు నిలిచారు. అనేక వందల ప్రాణాలు పోయాయి. ఉద్యమం తర్వాత రాష్ట్రం రాలేదు కానీ, మళ్లీ అనేక హామీలు, నిధులు, రక్షణలు వచ్చాయి. ఇరవై ఏళ్లు గడిచే సరికి మళ్లీ తెలంగాణలో అసంతృప్తి, ఆందోళనలే. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ప్రత్యేక రాష్ట్రమే ఈ మారు ఎజెండా అయింది. ఎట్టకేలకు 2014 జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది.



అన్ని సమస్యలకు ఒక్కటే పరిష్కారం అన్నట్టుగా తెలంగాణ శకం ప్రారంభమై అప్పుడే ఒక దశాబ్దం గడిచిపోయింది. నీళ్లు, నిధులు, నియామకాల్లో ఇంకా జనం ఆశించిన లక్ష్యాలు సాకారం కాలేదు. పలు చోట్ల లక్ష్యాలు దారితప్పిపోయాయి. అందుకు కారణం అన్నింటా మితిమీరిన రాజకీయ జోక్యం, తెలంగాణకు ఏం కావాలన్న దిశా నిర్దేశంలో నెలకొన్న అయోమయం. అందుకే చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోకుండా బలమైన భవిష్యత్తు నిర్మితం కాబోదన్న అంశం మరోసారి రుజువు అయింది. అందుకే అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధి నినాదంతో ఏర్పడ రాష్ట్రంలో ఇంకా వెనకబడిన ప్రాంతాలు మరింత వెనకబడుతుంటే, రాజకీయ బలం ఉన్న నాయకుల ప్రాంతాలకే నీళ్లు, నిధులు పరుగులు పెడుతున్నాయి. అన్ని ప్రాంతాల్లో సమానాభివృద్ధి అనే అంశం నినాదంగానే మారిపోతున్నది. ఈ రకమైన విధానం తెలంగాణకు ఏ విధంగానూ మంచిది కాదు. నాడు నిజాం హయాంలో డెమాక్రటిక్‌గా కనిపించేందుకు ఒక లెజిస్లేటివ్ కౌన్సిల్ ఉన్నా, అందులో సభ్యులంతా జాగిర్దార్ల ప్రతినిధుల నుంచే వచ్చేవారు. పేరుకు లెజిస్లేటివ్ కౌన్సిల్ ఉన్నా, నిర్ణయాధికారమంతా నిజాందే. ఆయన నిర్ణయాలను ప్రధానమంత్రి తూ.చ తప్పకుండా అమలు చేసేవారు. ఎలాంటి ప్రజాభిప్రాయం, మేధోమథనం లేకుండానే నిజాం నోటి నుంచి ఆ క్షణానికి ఏం మాట వస్తే అదే ఫర్మానాగా వచ్చేది. అవి రాజ్య అభివృద్ధి, సంక్షేమం కంటే, నిజాం సంపదను, హోదాను పెంచేవిగానే ఉండేవి.

అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ తెలంగాణ ప్రజలు ఆకలి, అవసరాల కంటే ఆత్మగౌరవానికి ప్రాధాన్యతనిస్తారు. ఆత్మగౌరవానికి భిన్నంగా పాలన మారితే, ఎదురుగా ఎవరున్నారని చూడకుండా పిడికిలెత్తి పోరాట పంథాను ఎంచుకోవటం కొత్తేమీ కాదు. అలా ఎంచుకున్నవే 1946 రైతాంగ పోరాటం, 1968 తొలిదశ తెలంగాణ ఉద్యమం, 1997 తెలంగాణ మలి దశ ఉద్యమాలు. ఈ మూడు పోరాటాల్లో తెలంగాణ రైతులు, యువకుల ఆత్మబలిదానాలే కొత్త చరిత్రకు మైలురాయిగా నిలిచాయి. తెలంగాణను దోపిడీ, పీడనలు కమ్ముకున్న ప్రతి సమయంలోనూ రైతాంగ, విద్యార్థి, యువజన ఉద్యమాలు, విముక్తి ఉద్యమాలు వేగుచుక్కలై నిలిచాయి. అందుకే తెలంగాణ ఆత్మగౌరవాన్ని తక్కువగా అంచనా వేయొద్దు.

అమరుల త్యాగ స్ఫూర్తిని రేపటి తరానికి అందించేలా పోరాట వీరుల చరిత్రను పాఠ్యాంశాలుగా చేర్చాలి. వారి పేర్లతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. ముఖ్యంగా సాయుధ పోరాటంతో పాటు పార్లమెంటరీ పోరాటంలోనూ తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఆరిపోని వెలుగు కిరణం రావి నారాయణరెడ్డి సహా మూడు దశల పోరాటాల్లో పాల్గొన్న వీరుల ఖ్యాతి, లక్ష్యాలు మసకబారకుండా చూడాల్సిన అవసరం ప్రభుత్వం, ప్రజా ఉద్యమ సంస్థలు, రాజకీయ పక్షాలపై ఉంది.

• రావి ప్రతిభారెడ్డి
తెలంగాణ రైతాంగ అమరువీరుల ట్రస్ట్ సభ్యులు

(నేడు రావి నారాయణరెడ్డి జయంతి)

ఆదివాసీల అభివృద్ధికి అన్నీ ఆటంకాలే?!

'ఫిఫ్త్ షెడ్యూల్ ఏరియా' ఆదివాసీలకు సంబంధించిన భూభాగం. ఆ భూములపై హక్కులన్నీ వారివే. కానీ సదరు భూములకు సంబంధించి గతంలో జారీ అయిన జీవోలు, చట్టాలు ప్రస్తుతం అమలయ్యే పరిస్థితి కన్పించడం లేదు. దీనికి కారణాలు అనేకం. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచీ ఆదివాసీల అభివృద్ధి విషయంలో ఐటీడీఏల క్రియాశీలక పాత్ర తగ్గుతూ వస్తోంది. నిత్యం నీతిసూత్రాలు వల్లించే మేధావులే ఆదివాసీల హక్కులను కాలరాస్తున్నారు!

ఫిఫ్త్ షెడ్యూల్ ప్రాంతంలో ఐటీడీఏల ద్వారా 29 శాఖల్లో ఉద్యోగాలను భర్తీ చేయాలి. కానీ ఈ నిబంధన అమలుకు నోచుకోవడం లేదు. స్థానిక యువత వంద శాతం రిజర్వేషన్లు పొందుతున్నారని చెబుతూ జీవో 3ను ఎత్తివేశారు. దీంతో ఆదివాసీ విద్యార్థుల జీవితాలు అగాధంలోకి నెట్టివేయబడ్డాయి. గతంలో ఐటీడీఏలకు వందల కోట్ల రూపాయల ఫండ్స్ వచ్చేవి, కానీ నేడు ఆ పరిస్థితి కనబడడం లేదు. నాటికీ నేటికీ ఇంత వ్యత్యాసం ఎందుకు?! మైదాన ప్రాంత ప్రజలతో పోలిస్తే ఆదివాసీలు ఎంతో వెనుకబడి ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ఆదివాసీలకు సంబంధించిన జీవోలు, చట్టాల అమలుపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆదివాసీల అభివృద్ధి కుంటుపడుతోంది. ఇప్పటికైనా ఫిఫ్త్ షెడ్యూల్ ప్రాంతపు ప్రజాప్రతినిధులు మేల్కొని ఐటీడీఏలకు నిధులు మంజూరు చేయించాలి. ట్రైబల్ అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేయాలి. ఐటీడీఏకు మళ్లీ జవసత్వాలు అందించాలి. ఆదివాసీ చట్టాలకు అనుగుణంగా యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

– మైపతి సంతోష్‌కుమార్
ఏటీఎఫ్ ములుగు జిల్లా అధ్యక్షుడు

జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలను నెలకొల్పాలి

దేశవ్యాప్తంగా ప్రస్తుతం 1,254 కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయి. తెలంగాణలోని కేవీల సంఖ్య 35. ఇందులో అధికశాతం రాజధాని చుట్టుపక్కలే కేంద్రీకృతమై ఉన్నాయి. అయితే 2016 లెక్కల ప్రకారం తెలంగాణలో 31 కేవీలు ఉన్నాయి. అంటే ఈ పదేళ్లలో రాష్ట్రంలో కేవలం 4 కేంద్రీయ విద్యాలయాలు మాత్రమే కొత్తగా ఏర్పాటయ్యాయి. రాష్ట్రంలోని దాదాపు సగం జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలు లేవు. ఉత్తర తెలంగాణలోని నిర్మల్, ఆసిఫాబాద్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాల్లో కేవీలు లేవు. మధ్య తెలంగాణలోని హైదరాబాద్(6), మేడ్చల్(9) జిల్లాల్లో మాత్రం ఇతర జిల్లాల్లో కంటే ఎక్కువ కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయి. దక్షిణ తెలంగాణలోని వనపర్తి, జోగుళాంబ, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోనూ కేవీల ఊసే లేదు. భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, హనమకొండ, జనగాం, మెదక్, వికారాబాద్ జిల్లాల ప్రజలూ కేవీల ఏర్పాటు కోసం ఎదురుచూస్తున్నారు. ఇలా పలు జిల్లాల్లో కేవీలు లేకపోవడం వల్ల అక్కడి విద్యార్థులు ప్రామాణిక సీబీఎస్ఈ విద్యను కోల్పోతున్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు కనీసం ఒక కేవీ స్కూల్ కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి. కేంద్రాన్ని ఒప్పించి రాష్ట్రానికి కేవీలను సాధించే దిశగా అడుగులు వేయాలి. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో డిజిటల్ శాటిలైట్ పాఠశాలలు లేదా ఈ-కేవీల స్థాపనపై దృష్టి పెట్టాలి.

– పారుపల్లి ఆంజనేయులు
విద్యా పరిశోధకులు

ఖరీఫ్ ప్రణాళిక ఏదీ?

కోటిన్నర ఎకరాల సాగు భూమి, 60 లక్షల మంది రైతులు ఉన్న ఒక రాష్ట్రానికి సమగ్ర వ్యవసాయ విధానమే ఇప్పటి వరకూ లేదని మీకు తెలుసా? బహుళ పంటలు పండే నేలలున్న ఒక రాష్ట్రం మోనో క్రాపింగ్ వైపు పరుగులు తీస్తుందనీ; రాష్ట్రానికి అవసరమైన అనేక వ్యవసాయ ఉత్పత్తులను ఇతర దేశాల నుండీ, ఇతర రాష్ట్రాల నుండీ దిగుమతి చేసుకుంటున్నదనీ మీకు తెలుసా? దేశం మొత్తంలో గత ఐదేళ్లుగా సమగ్ర పంటల బీమా పథకం అమలు చేయని ఏకైక రాష్ట్రం, గత నాలుగేళ్లుగా వ్యవసాయ శాఖ వార్షిక ప్రణాళిక కూడా విడుదల చేయని రాష్ట్రం ఏదో మీకు తెలుసా? మొత్తం సాగుదారులలో 36 శాతం కౌలు రైతులే ఉన్న రాష్ట్రం ఏదో మీకు తెలుసా? వీటన్నిటికీ ఒకే జవాబు: తెలంగాణ!

ఈ సారి నైరుతి ఋతుపవనాలు పది రోజుల ముందుగానే రాష్ట్రానికి వచ్చేశాయి. చాలా జిల్లాలలో వానలు కురుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా వ్యవసాయ రంగంపై దృష్టి సారించాల్సిన సందర్భం ఇది. కానీ జరుగుతున్నది గమనిస్తే ప్రభుత్వం, ముఖ్యంగా వ్యవసాయశాఖ పనితీరు అంచనాలకు అనుగుణంగా లేదు.

గత ప్రభుత్వ పాలనా నిర్వాకాల వల్ల రాష్ట్రానికి నిధుల కొరత ఎంతైనా ఉండవచ్చు. కానీ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిస్థితులు బేరీజు వేయకుండా, ప్రాధాన్యతలు నిర్ణయించుకోకుండా ముందుకు సాగుతున్నది. వృద్ధ, ఒంటరి, వితంతు, బీడీ కార్మిక మహిళలకు, రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాల మహిళలకు ఆసరా పెన్షన్లు ఇవ్వడానికి నిధుల కొరత ఎదుర్కొంటున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ అందాల సుందరి ఎంపిక పోటీలను మాత్రం ధూమ్ ధామ్‌గా నిర్వహించింది. ఫలితంగా ఆరోపణలు, విమర్శలు తప్ప ఈ ప్రభుత్వం సాధించిందేమిటి?

2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి సారి ఈ రబీ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సహాయంగా అందిస్తున్న ఎకరానికి రూ.6వేల సహాయం కూడా ఇప్పటికీ అనేకమంది రైతులకు అందనేలేదు. రైతు భరోసా పెట్టుబడి సహాయం కౌలు రైతులకు కూడా అందిస్తామని ఇచ్చిన హామీ అసలు అమలుకు నోచుకోలేదు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఇరవై రోజులు పనిచేసి ఉండాలన్న నిబంధన వల్ల, భూమిలేని వ్యవసాయ కూలీలందరికీ కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందనేలేదు.

రాష్ట్ర ప్రభుత్వం ఈ రబీ సీజన్‌లో కూడా ధాన్యం కొనుగోలు చేస్తున్నా, రైతులు తెచ్చిన ధాన్యానికి కనీస మద్దతు ధర మాత్రమే చెల్లిస్తున్నది తప్ప, రైతులకు హామీ ఇచ్చిన విధంగా సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇప్పటికీ ఒక్కరికీ వేయలేదు. రబీ సీజన్‌లో వరిని ప్రోత్సహించడం మంచిది కాదని రైతు స్వరాజ్య వేదిక, ఇంకా ఇతర నిపుణులు స్పష్టంగా చెప్పినా ప్రభుత్వం ముందుకే వెళ్ళింది. ఫలితంగా ఈ సీజన్‌లో సన్న ధాన్యం సాగు భారీగా పెరిగిపోయింది. ఈ సీజన్‌లోనూ ప్రభుత్వం ధాన్యం సేకరణ చేస్తుంది కానీ, బోనస్ చెల్లించడం లేదు. ఇందుకు కారణం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడమే. ఈ విషయం కూడా మేము ఆ రోజే స్పష్టంగా ప్రకటించాం. వరికి బదులుగా ఇతర పంటలకు బోనస్ చెల్లించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశాం. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. మేము హెచ్చరించిన విధంగానే ఇప్పుడు జరిగింది. వరి సాగు చేసిన రైతులు, భూగర్భ జలాలు ఎండిపోయి, పంటలు ఎండిపోయి నష్టపోయారు. ఇప్పుడు అకాల వర్షాలతో పంటలు తడిచి నష్టపోతున్నారు. బోనస్ కూడా అందడం లేదు.

ఈ సారి నైరుతి ఋతు పవనాలు పది రోజుల ముందుగానే రాష్ట్రానికి వచ్చేశాయి. చాలా జిల్లాలలో వానలు కురుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా వ్యవసాయ రంగంపై దృష్టి సారించాల్సిన సందర్భం ఇది. కానీ జరుగుతున్నది గమనిస్తే ప్రభుత్వం, ముఖ్యంగా వ్యవసాయశాఖ పనితీరు అంచనాలకు అనుగుణంగా లేదు.



గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 ఖరీఫ్ నుండీ రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (PMFBY), కొన్ని పంటలకు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (WBCIS) అమలును నిలిపి వేసింది. ఫలితంగా ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు పరిహారం అందుతుందన్న భరోసా లేకుండా పోయింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన అభయ హస్తం మేనిఫెస్టోలో రాష్ట్రంలో అన్ని పంటలు కవర్ అయ్యేలా సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. పైగా రైతులు చెల్లించాల్సిన పంటల బీమా ప్రీమియం కూడా తానే చెల్లిస్తానని హామీ ఇచ్చింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 2024 ఖరీఫ్, 2024–2025 రబీ సీజన్‌లలో పంటల బీమా పథకాన్ని అమలు చేయలేదు.

ఈ సీజన్‌లో పంటల బీమా పథకం అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని మీడియాలో వార్తలు వచ్చాయి గానీ, పంటల బీమా పథకానికి సంబంధించిన నోటిఫికేషన్ రాష్ట్ర వ్యవసాయశాఖ ఇప్పటి వరకూ విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయశాఖ వెంటనే పంటల బీమా పథకం నోటిఫికేషన్ విడుదల చేయాలి. కౌలు రైతులకు కూడా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి. రైతులు జులై 31 వరకూ పంటల బీమా పథకంలో నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది కనుక, రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులు, పోడు రైతులు, అసైన్డ్ రైతులతో సహా, వాస్తవ సాగుదారుల పేర్లు ఈ ఖరీఫ్ సీజన్‌లో నమోదు చేసి, వారికి పంటల బీమా పథకం వర్తించేలా చేయాల్సిన అవసరం ఉంది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత పదహారు నెలల్లో భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు మూడు సందర్భాలలో ఎకరానికి రూ.10వేల పరిహారం చెల్లించినా, ఆ పరిహారం కూడా వ్యవసాయం చేయని భూ యజమానులకు అందింది తప్ప, సాగు చేసి నష్టపోయిన కౌలు రైతులకు అందలేదు. ఈ అన్యాయాన్ని సరిచేయాలి.

కౌలు రైతుల గుర్తింపుపై ప్రభుత్వంలోనూ బయటా చాలా చర్చలు జరుగుతున్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా కౌలు రైతులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదు. మంత్రులు నిర్వహించిన జిల్లాల ప్రజాభిప్రాయ సేకరణలో కూడా కౌలు రైతులను గుర్తించి వారికి సహాయం చేయాలని ఎక్కువమంది భావించినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో కౌలు రైతుల గుర్తింపుపై తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ మే 12వ తేదీన ప్రత్యేక చర్చా సమావేశం ఏర్పాటు చేసింది. కౌలు రైతులను గుర్తించి, వారికి ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు అందించనంత వరకు తెలంగాణలో రైతు ఆత్మహత్యలు ఆగవు. ప్రభుత్వం వ్యవసాయం కోసం ఖర్చు పెడుతున్న వేలకోట్ల రూపాయలకు సరైన ఫలితం రావాలంటే ఆ పథకాలు వాస్తవంగా సాగు చేస్తున్నవారికి అందాలి.

ఈ ఖరీఫ్ సీజన్ నుండే 2011 భూ అధీకృత సాగుదారుల చట్టం అమలు చేసి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ తప్పక మొదలుపెట్టాలి. 2011 చట్టంలో కొన్ని మార్పులు చేసి మెరుగుపరిచే అవకాశం ఉంది కానీ, దానికి కొన్ని నెలల సమయం కనీసంగా అవసరం అవుతుంది. అప్పటి వరకు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోతే, 2025–26 సంవత్సరం కూడా కౌలు రైతులకు ఎటువంటి మేలు జరగదు. ఉన్న చట్టాన్ని అమలు చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం వెంటనే పూనుకోవాలి. గుర్తింపు కార్డు పొందిన కౌలు రైతులను, భూమి లేని వ్యవసాయ కూలీలను కూడా రైతు బీమా పథకంలో నమోదు చేసి, 2025 ఆగస్టు 15 నుండి వారిని కూడా రైతు బీమా పరిధిలోకి తేవాలి.

▪ కన్నెగంటి రవి
రైతు స్వరాజ్య వేదిక

ఆంధ్రజ్యోతి ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
బుధవారం 4 జూన్ 2025



పున్నేలులో రెవెన్యూ సదస్సులో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

రెవెన్యూ సదస్సులు షురూ

మొదటి రోజు 1,407 దరఖాస్తులు

పున్నేలులో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ సదస్సులు మంగళవారం హనుమకొండ, వరంగల్ జిల్లాలో ప్రారంభమయ్యాయి. హనుమకొండ జిల్లాలో నడికూడ మినహా మిగతా 13మండలాల్లో సదస్సులు జరగ్గా తొలిరోజు మొత్తం 1,407దరఖాస్తులు దాఖలయ్యాయి. నడికూడ మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద ఇది వరకే రెవెన్యూ సదస్సులు జరిగాయి. రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించడం పూర్తయింది. కాగా, వరంగల్ జిల్లాలో 13మండలాలకు పన్నెండింటిలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. పైలట్ ప్రాజెక్టు కింద వర్ధన్నపేట మండలంలో ఇది వరకే రెవెన్యూ సదస్సులు జరిగాయి. 12మండలాల్లో సదస్సులు జరిగాయి. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలో జరిగిన భూభారతి సదస్సులో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో పాటు కలెక్టర్ పి.ప్రావీణ్య పాల్గొన్నారు. సదస్సు నిర్వహించిన తీరును పరిశీలించారు. రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

హనుమకొండ జిల్లాలో మొదటిరోజు భీమదేవరపల్లి మండలం కేంద్రంలో, ధర్మసాగర్ మండలంలోని సోమదేవరపల్లిలో, ఎల్కతుర్తి మండలంలోని బావుపేటలో, హనుమకొండ మండలంలోని బాసిత్‌నగర్‌లో, కమలాపూర్ మండలంలోని మాదన్నపేటలో, వేలేరు మండలంలోని గుండ్లసాగర్‌లో, కాజీపేట మండలంలోని శాయంపేటలో హసన్‌పర్తి మండలంలోని దేవన్నపేటలో, దామెర మండలంలోని దామెరలో ఆత్మకూరు మండలంలోని అగ్రంపాడులో (మిగతా 6లో..)

నేడు సదస్సులు జరిగే గ్రామాలు

హనుమకొండ జిల్లాలో భీమదేవరపల్లి మండలం కొప్పూర్‌లో, ధర్మసాగర్ మండలం జానకీపురంలో, ఎల్కతుర్తి మండలం తిమ్మాపూర్‌లో, హనుమకొండ మండలం వడ్డెపల్లిలో, ఐనవోలు మండలం వనమాలకనపర్తిలో, కమలాపూర్ మండలం జూజునూరులో వేలేరు మండలం మల్లికుదుర్లలో కాజీపేట మండలం సోమిడిలో హసన్‌పర్తి మండలం నాగారంలో, దామెర మండలం సింగరాజుపల్లిలో, ఆత్మకూరు మండలం అక్కంపేటలో, పరకాల మండలం వెంకటాపూర్‌లో, శాయంపేట మండలం హుస్సేన్‌పల్లిలో బుధవారం రెవెన్యూ సదస్సులు జరుగుతాయి.

బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఎక్కువమంది విద్యార్థులు చేర్పించిన పాఠశాలలకు పురస్కారాలను అందచేయనున్నది. బడిబాటలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సభ్యులు, స్వయం సహాయ సంఘాల మహిళలను భాగస్వామ్యం చేసేలా ప్రణాళిక రూపొందించింది. ఈ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశించింది. ఈ మేరకు మార్గదర్శకాలను, బడిబాట షెడ్యూల్‌ను జారీ చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2,603 ప్రభుత్వ బడులున్నాయి. హనుమకొండ జిల్లాలో 453, వరంగల్ జిల్లాలో 519, మహబూబాబాద్ జిల్లాలో 761, జనగామ జిల్లాలో 447, ములుగు జిల్లాలో 318, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 410 స్కూళ్లు ఉన్నాయి.



చదువుల కోవెల పిలుస్తోంది..

బడిబాటకు సర్వం సన్నద్ధం

హనుమకొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విద్యాశాఖాధికారులు కసరత్తు మొదలు పెట్టారు. ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కొనసాగుతుంది. ఈనెల 12వ తేదీన విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానుండటంతో పాఠశాలలను అలంకరించాలని, బడులలో పండుగ వాతావరణం తీసుకురావాలని విద్యాశాఖ భావిస్తోంది. ఇందులో తల్లిదండ్రులను, గ్రామస్తులను భాగస్వామ్యం చేస్తూ స్వాగతం పలకాలని, తదనుగుణంగా పేరెంట్, టీచర్స్ మీటింగ్ (పీటీఎం) నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు

బడిబాట సన్నాహక కార్యక్రమంలో భాగంగా

మిగతా 6వ పేజీలో...

- ఈ నెల 6 నుంచి 19 వరకు నిర్వహణ
- షెడ్యూల్ జారీ చేసిన విద్యాశాఖ
- ర్యాలీలు, కరపత్రాలతో ప్రచారం
- బడి మానేసిన పిల్లలపై ప్రత్యేక దృష్టి
- ఎక్కువ విద్యార్థులు చేరిన స్కూళ్లకు పురస్కారాలు

బడిమానేసిన పిల్లపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు, బడిమానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏటా పాఠశాలలు పునఃప్రారంభం కావడానికి ముందు నిర్వహిస్తున్నారు. బడిఈడు పిల్లలను గుర్తించి వారిని సమీప పాఠశాలల్లో చేర్పించాల్సి ఉంటుంది. ఆయా గ్రామాలు, పట్టణాల్లో ఉండే విద్యార్థులను ప్రైవేటు పాఠశాలల్లో కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం, గుణాత్మక విద్యను అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సమాజ భాగస్వామ్యం, మద్దతుతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో నమోదు చేయించడానికి బడిబాటను ప్రధాన మార్గంగా ఎంచుకున్నారు. బడిబాటలో భాగంగా విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయడం, 5వ తరగతి, 7వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఉన్నత తరగతుల్లో నమోదు చేయిస్తారు. తక్కువ విద్యార్థుల నమోదు ఉన్న పాఠశాలల్లో ప్రత్యే ప్రణాళిక ద్వారా తల్లిదండ్రుల భాగస్వామ్యంతో నమోదు పెంచుతారు. బడిబయటి పిల్లలను గుర్తించి వారి వయసుకు తగిన తరగతిలో నమోదు చేర్పించనున్నారు.

నగరంలో కరోనా కలకలం

- ఎంజీఎం పీజీ వైద్యురాలితోపాటు మరో ఆరుగురికి పాజిటివ్
- ధ్రువీకరించని డీఎంహెచ్‌వో సాంబశివరావు

వరంగల్ మెడికల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎంలో జనరల్ మెడిసిన్ పీజీ వైద్యురాలితోపాటు మరో నలుగురికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. పీజీ వైద్యురాలు దగ్గు, జ్వరంతో బాధపడుతుండగా పరీక్ష నిర్వహించగా కరోనాగా నిర్ధారణ అయింది. వెంటనే ఆమెను హైదరాబాద్‌లోని స్వగృహానికి ఐసోలేషన్ కోసం తరలించినట్లు తెలుస్తోంది. అదే విధంగా ఎంజీఎం సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరుగురికి మంగళవారం కరోనా వ్యాధి నిర్ధారణ అయినట్లు తెలుస్తోంది. వీరు కూడా ప్రస్తుతం ఐసోలేషన్‌లో ఉన్నట్లు సమాచారం. దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతూ ప్రైవేటు వైద్యుడిని సంప్రదించగా నిర్ధారణ అయినట్లు తెలుస్తోంది. నగరంలో మంగళవారం ఒకేరోజు ఏడు పాజిటివ్ కేసులు నమోదుకావడం ఆందోళన వ్యక్తం అవుతోంది. కాగా, ఈ విషయంపై వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావును వివరణ కోరగా కరోనా పాజిటివ్‌లు నమోదు కాలేదని స్పష్టం చేశారు. ఈ తరహా ప్రచారాన్ని నమ్మకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరోనా పట్ల ఎలాంటి ఆందోళన అవసరం లేదని, తాము అప్రమత్తంగా ఉన్నామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే యశస్విని కంటతడి

పెద్దవంగరలో ఉద్వేగ సన్నివేశం 6



పెద్దవంగరలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ సందర్భంగా భావోద్వేగంతో కంటతడి పెడుతున్న యశస్వినిరెడ్డి

డ్రంకెన్ డ్రైవ్ జోరు

- పోలీసుల తనిఖీలకు వెరవని మందు బాబులు
- గత ఐదు నెలల్లో 8,182 కేసుల నమోదు
- రూ.86 లక్షల జరిమానా.. 260 మందికి జైలుశిక్ష..



మట్టెవాడ జూన్ 3, (ఆంధ్రజ్యోతి): జైలు శిక్షతో పాటు జరిమానా విధించినా మందుబాబుల తీరు మారడం లేదు. నగరంలో రోజురోజుకూ డ్రంకెన్ డ్రైవ్ కేసులు పెరుగుతూనే ఉన్నాయి. మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినా, జరిమానాలు, జైలుశిక్ష, సామాజిక సేవ శిక్ష విధించడంతో పాటు మరికొందరికి డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేస్తున్నా.. వాహనాలను సీజ్ చేస్తున్నా వారిలో మార్పు రావడం లేదు. వరంగల్ నగరంలోని ప్రధాన జంక్షన్లలో ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్‌తో పాటు లా అండ్ ఆర్డర్ పోలీస్‌లు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. అయినా కేసులు తగ్గడం లేదు. వరంగల్ ట్రైసిటీస్‌లో జనవరి నుంచి మే చివరి వరకు ట్రాఫిక్ పోలీసులు 8,182 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. 260 మందిని జైలుకు పంపారు. రూ.85,83,769 జరిమానా విధించారు. జనవరిలో 1604, ఫిబ్రవరిలో 1575, మార్చి నెలలో 1627, ఏప్రిల్‌లో 1666, మేలో 1710 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు అయ్యాయి. అయినప్పటికీ వాహనదారుల్లో మార్పు రావడం లేదు.

విస్తృత తనిఖీలు..

పోలీసుల తనిఖీల్లో అత్యధికంగా యువతే పట్టుబడుతున్నారు. సాధారణంగా వ్యక్తి మద్యం తాగిన తర్వాత ఆల్కాహాల్ రక్తంలో కలిసి పోతుంది. బ్రీత్ అనలైజర్ యంత్రానికి ఉన్న పైపులో ఊదితే రక్తంలోని ఆల్కహాల్ స్థాయి నిర్ధారణ అవుతుంది. దాని ప్రకారం పోలీసులు కేసు నమోదు చేస్తారు. స్థాయి తీవ్రత ఆధారంగా కేసు విచారణ సమయంలో కోర్టు జరిమానా, జైలుశిక్ష, సామాజిక సేవ శిక్ష విధిస్తున్నారు. అదే సమయంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో కౌన్సెలింగ్ కూడా నిర్వహిస్తున్నారు. కాగా, కొన్ని సందర్భాల్లో మందుబాబులు పోలీసులపైన తిరగబడుతున్నారు. ఇలాంటి సంఘటనలు రోజు రోజుకూ పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

తాజాగా 14మందికి జరిమానా..

మద్యం తాగి వాహనం నడిపిన కేసుల్లో 14మంది వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ మంగళవారం రూ.18,700 జరిమానా విధించారు. అలాగే మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుపడిన హనుమకొండ అడ్వొకేట్స్ కాలనీకి చెందిన గుగులోతు భద్రుకు రెండు రోజుల జైలుశిక్ష విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఐదుగురు వాహనదారులకు రూ.2500 జరిమాన విధించారు.



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

చోరీల నియంత్రణకు చర్యలు

- దర్యాప్తులో శాస్త్రీయ పద్ధతులను పాటించండి
- పోలీసు అధికారులకు సీపీ సన్‌ప్రీత్ సింగ్ సూచన

6



మార్కెట్ యార్డులో రైతుతో మాట్లాడుతున్న సురేంద్రమోహన్

మార్కెట్లో సీసీ కెమెరాలు

- వే బ్రిడ్జిలు వినియోగించుకునేలా చర్యలు
- రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ సురేంద్రమోహన్

6

ఎన్‌కౌంటర్‌లన్నీ ప్రభుత్వ హత్యలే..

- ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలే మావోయిజానికి మూలం
- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- కగార్ పేరుతో మావోయిస్టులను చంపడం దుర్మార్గం
- పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.లక్ష్మణ్



మాట్లాడుతున్న లక్ష్మణ్

హసన్‌పర్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.లక్ష్మణ్ ఆరోపించారు. చింతగట్టులోని బీజీఆర్‌గార్డెన్స్‌లో మంగళవారం అమరుల బంధు మిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మక్క అధ్యక్షతన గుండెకోట్ అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ షహీద్ స్మృతిసభను నిర్వహించారు. ముందుగా చింతగట్టుకు చెందిన బూర రాకేష్ ఆలియాస్ వివేక్, భూమిక, మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు, సజ్జ వెంకటేశ్వర్‌రావు, సాయిబోగు లలిత, వన్నవాడ విజయలక్ష్మీ చిత్ర పటాలకు పూలమాల వేసి జోహర్లు అర్పించారు. అనంతరం వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలతో యువత మావోయిస్టు బాట పడుతున్నారని అన్నారు. దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం వనరుల దోపిడీకి పాల్పడుతూ కార్పొరేట్ శక్తులకు, బహుళ జాతి కంపెనీలకు వంత పలుకుతున్నారని అన్నారు. మావోయిస్టులు ఆదివాసీ హక్కులను, (మిగతా 6లో..)



టూ-డే క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపికైన ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ జట్టుతో నిర్వాహకులు

అండర్-25 టూ-డే క్రికెట్ లీగ్ జిల్లా జట్టు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో జూన్ నెల 2వారం నుంచి హైదరాబాద్‌లో నిర్వహించనున్న అండర్-25 బాలుర టూ-డే క్రికెట్ లీగ్ పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ జట్టును మంగళవారం ఎంపిక చేసినట్లు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 19 నుంచి జూన్ 2వ తేదీ వరకు హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు మహబూబాబాద్, జనగామ జిల్లాల జట్ల మధ్య రెడ్డిపురం, మొగిలిచర్ల, వంగపల్లి క్రికెట్ క్రీడా మైదానాల్లో అంతర్ జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించామని శ్రీనివాస్ అన్నారు. సుమారు 15 రోజుల పాటు ఆరు జిల్లాల మధ్య ఒక్కో జట్టుకు 5మ్యాచ్‌లు నిర్వహించి, బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 19 మంది క్రీడాకారులను టూ-డే క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపిక చేశామన్నారు. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో టూ-డే క్రికెట్ లీగ్ వారానికి ఒక్కో జిల్లాకు ఒక్కో మ్యాచ్‌ని నిర్వహించనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్, కోచ్‌లు ఎం.డి. అఫ్జల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన జిల్లా జట్టు : బి.వరుణ్ (కెప్టెన్), కె.రోహిత్‌రెడ్డి, ఎం.శివరామ్, ఎన్.రాహుల్, ఎ.లక్ష్మణ్, ఎం.దేవేందర్, పి.రిశ్వంత్, ఎం.రామ్‌చరణ్, ఎస్.ఆదర్శ్, ఎం.రోహిత్, వి.వైష్ణవ్, జె.పార్థిపన్, డి.మనోజ్, బి.మణిదీప్‌సింగ్, ఎం.రాణాచరణ్, నితిన్‌పటేల్, పి.సంతోష్, బి.సతీష్, పూజిత్.

మెడికల్ కాలేజీ హాస్టల్‌లో పాము

పట్టి అడవిలో వదిలిన స్నేక్ క్యాచర్ ఇమామ్



మహబూబాబాద్ మెడికల్ కళాశాలలో నాగుపామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్

మహబూబాబాద్ క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల బాలుర వసతి గృహంలో సోమవారం రాత్రి నాగు పాము కలకలం రేపింది. హాస్టల్ ఆవరణలో నాగు పాము సంచారాన్ని గమనించిన విద్యార్థులు భయంతో పరుగులు తీసి, కళాశాల ప్రిన్సిపాల్ లకావత్ వెంకట్‌కు సమాచారం అందించారు. వెంటనే అటవీశాఖ జిల్లా అధికారికి సమాచారం అందించగా, బీట్ ఆఫీసర్ రవీందర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. బీట్ ఆఫీసర్ సహాయంతో స్నేక్ క్యాచర్ ఇమామ్ నాగుపామును పట్టుకొని, అడవిలో వదిలివేయడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. మెడికల్ కళాశాల హాస్టల్ ప్రాంగణంలో పిచ్చిచెట్లు, చెత్తాచెదారం పేరుకుపోయి పాములు, తేళ్లు హాస్టల్ భవనంలోనికి ప్రవేశించి ఏ క్షణంలో ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని మెడికల్ కళాశాల హాస్టల్ ప్రాంగణంలో చెత్తాచెదారం తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

రాయపర్తి ఎస్సైగా ఎస్.రాజేందర్

వరంగల్ క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వెస్ట్‌జోన్ పరిధిలోని రాయపర్తి ఎస్సైగా సీసీఆర్‌బీలో పనిచేస్తున్న ఎస్.రాజేందర్‌ను నియమిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఇక్కడ ఇంతకాలం విధులు నిర్వర్తించిన శ్రవణ్‌కుమార్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

6న ఎస్సార్‌యూ 3వ స్నాతకోత్సవం

● ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణికి గౌరవ డాక్టరేట్ ● వివరాలను వెల్లడించిన వైస్ చాన్స్‌లర్ దీపక్‌గార్గ్



స్నాతకోత్సవ వివరాలను వెల్లడిస్తున్న ఎస్సార్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్

హసన్‌పర్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం 3వ స్నాతకోత్సవ వేడుకలు జూన్ 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ వెల్లడించారు. మంగళవారం అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. జూన్ 6వ తేదీ శుక్రవారం ఎస్సార్ యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగే 3వ స్నాతకోత్సవ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గౌరవ సలహాదారు (క్యాబినేట్ ర్యాంక్), ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా, రక్షణ పరిశోధన, అభివృద్ధి విభాగం మాజీ కార్యదర్శి, డీఆర్‌డీవో మాజీ చైర్మన్, రక్షణ మంత్రికి మాజీ శాస్త్రీయ సలహాదారుగా విశేష సేవలందించిన ప్రముఖ వ్యక్తి డాక్టర్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మరింత శోభను సంతరింపజేసే భారతీయ సినిమా, ప్రపంచ సంగీతానికి విశేష కృషి చేసిన ప్రఖ్యాత సంగీత స్వరకర్త, గాయకుడు, గేయ రచయిత ఎం.ఎం.కీరవాణికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. తెలంగాణలో టెక్నాలజీ బిజినెస్ ఇంక్యూబేటర్ స్థాపించిన మొట్టమొదటి ప్రైవేటు యూనివర్సిటీ ఎస్సార్ యూనివర్సిటీనేనని అన్నారు. 110కి పైగా స్టార్టప్‌లకు మద్దతు నిచ్చి రూ.51లక్షల వార్షిక ప్లేస్‌మెంట్ ప్యాకేజీని కలిగి ఉందన్నారు. ఈ స్నాతకోత్సవంలో అధికారిక విద్యా ఊరేగింపు, గౌరవ డిగ్రీల ప్రదానం, గ్రాడ్యుయేట్ల పతకాలు, డిగ్రీల అందజేతతో పాటు అనేక వేడుకలు ఉంటాయని తెలిపారు. 3వేల మంది గ్రాడ్యుయేట్ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు, ప్రముఖులు, కుటుంబాలతో సహ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వి.మహేష్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. అర్చనారెడ్డి, కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వరంగల్ ఐటీఐ ప్రవేశాల కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం. చందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి దఫా ప్రవేశాల కోసం ప్రభుత్వ నోటిఫికేషన్ జారీ చేసిందని, 8, 10వ తరగతి ఉత్తీర్ణులై 14 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని ఆయన పేర్కొన్నారు. వెరిఫికేషన్ ఫీజు రూ.100 ఆన్‌లైన్‌లో చెల్లించి http://iti.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన పేర్కొన్నారు. ఈనెల 21లోపు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

6న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 6న ములుగురోడ్‌లోని కార్యాలయంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఫుల్/పార్ట్‌టైమ్ పద్ధతిలో ఏజెంట్లుగా చేయడానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని యువతులకు మాత్రమే జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 10వ తరగతి పాసైన 18 నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన ఆసక్తి ఉన్న యువతులు వారి సర్టిఫికెట్లతో ఈ నెల 6న ములుగురోడ్‌లోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.

గేదెను విక్రయించిన డబ్బులు కొడుకు అడిగాడని..

మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య



సంగెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గేదెను విక్రయించిన డబ్బులు కొడుకు అడిగాడని మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని బిక్కోజీనాయక్‌తండాకు చెందిన మూడు ఈరు(49) గేదెను విక్రయించిన డబ్బులు కుటుంబ అవసరాలకు ఇవ్వాలని ఈరు కుమారుడు వెంకటేశ్ సోమవారం అడిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన ఈరు తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగులమందు తాగాడు. పక్కనే పనులు చేసుకుంటున్న ఈరు బంధువు కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. ఈరును 108 వాహనంలో చికిత్స ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఈరు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదుతో ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈరుకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్లో సీసీ కెమెరాలు

రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ సురేంద్రమోహన్

వరంగల్ వ్యవసాయం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ సురేంద్రమోహన్ మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు తీసుకున్న తరువాత ఇక్కడికి రావడం ఇదే మొదటిసారి కావడంతో మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో సురేఖ, మార్కెట్ కమిటీ కార్యదర్శి గుగులోతు రెడ్డి ఆయనకు ఘన స్వాగతం పలికారు.

అనంతరం ఆయన అధికారులతో కలిసి మార్కెట్లోని అన్ని యార్డులను తిరిగి క్రయవిక్రయాలను పరిశీలించారు. గిట్టుబాటు ధరల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. యార్డులలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. తదుపరి మార్కెట్ ప్రధాన కార్యాలయంలో అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. వారు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడంతో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. మార్కెట్లో అత్యాధునిక ఏఐ టెక్నాలజీతో కూడిన సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, టెండర్లను పిలిచి పనులను అప్పగిస్తామని అన్నారు. అదే విధంగా మార్కెట్లో ఉన్న వే బ్రిడ్జీలను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని, మార్కెట్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్ 2 కార్యదర్శులు రామోజు రాము, అంజిత్‌రావు, రాజేందర్, లక్ష్మినారాయణ, నర్సింగరావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

చోరీల నియంత్రణపై దృష్టి సారించండి..

పోలీసు అధికారులకు సీపీ సన్‌ప్రీత్ సింగ్ సూచన

వరంగల్ క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చోరీల నియంత్రణపై పోలీసు అధికారులు దృష్టి సారించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులకు పిలుపునిచ్చారు. నెలవారీ నేర సమీక్ష సమావేశం మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ సమావేశ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా చోరీ కేసులో నిందితుల అరెస్టు, సొమ్ము రికవరీ, ఆస్తి నేరాలు, పెండింగ్‌లో ఉన్న ఇతర కేసులపై ప్రధానంగా సమీక్ష నిర్వహించి, వాటి పరిష్కారానికి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాటి ఏర్పాటులో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. నేరాలకు సంబంధించిన దర్యాప్తులో అధికారులు టెక్నాలజీ తో పాటు శాస్త్రీయ పద్ధతిని పాటించాలన్నారు. వాహనాలు చోరీ కాకుండా ఉండేందుకు ఇంటి ఆవరణంలోనే వాహనాలు పార్కింగ్ చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాబోయే బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకొని మూగజీవాల రవాణాలపై ప్రత్యేక దృష్టిపెట్టడంతోపాటు దర్గాల వద్ద పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. వరంగల్‌కు ఉన్న కీర్తిప్రతిష్ఠలకు తగ్గట్లుగా పోలీసింగ్ ఉండాలని, ప్రతీ పోలీస్ బేసిక్ పోలీసింగ్‌పై దృష్టిపెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజ మహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, జనగామ ఏఎస్పీ చైతన్య, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని కంటతడి

పెద్దవంగర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరలో మంగళవారం 137 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదవారి సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులకు అందిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలుపునకు కృషి చేయాలన్నారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి భావోద్వేగంతో కంటతడి పెట్టారు. చిన్న వయస్సులో పేదలకు ఇళ్లు అందించే అవకాశం కల్పించిన ప్రజలకు, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. పాలకుర్తి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు.

కేయూ ఎన్జీవోస్, 4వ తరగతి ఉద్యోగుల ఎన్నికలు

కేయూ క్యాంపస్ జూన్ 3, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎన్జీవోస్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ ఎన్నికల నోటిఫికేషన్‌ను వెలువరించారు. జూన్ 9 వరకు పదవులకు నామినేషన్లు స్వీకరిస్తామని, 20న ఎన్నికలు నిర్వహించి, 21న ఫలితాలను వెల్లడిస్తామని షెడ్యూల్ ప్రకటించారు. ఎన్జీవోస్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘాలకు వేర్వేరుగా నామినేషన్లు దాఖలు చేయాలని ప్రకటించారు. ప్రెసిడెంట్-1, వైస్ ప్రెసిడెంట్-1, జనరల్ సెక్రటరీ-1, జాయింట్ సెక్రటరీలు-3 (ఆర్గనైజేషన్-1, ఆర్గనైజేషన్-1 (వుమెన్స్) రిక్రియేషన్-1), ట్రెజరర్-1 పోస్టులకు బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూన్ 9 సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, వెంటనే నామినేషన్ల పరిశీలన చేపట్టిన అర్హులైన అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తామని స్పష్టం చేశారు. జూన్ 13న సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని, అదే రోజు సాయంత్రం 6 గంటలకు ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. జూన్ 20న శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటింగ్ సాగుతుందని తెలిపారు. జూన్ 21న ఉదయం 11 గంటలకు ఎన్నికల కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తామని స్పష్టం చేశారు. కేయూ సెనెట్‌హాల్, వర్సిటీ క్యాంపస్ కళాశాల, సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఖమ్మం యూనివర్సిటీ పీజీ కళాశాల, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికైన కార్యవర్గం రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతుందన్నారు. కాగా వర్సిటీ పరిధిలోని ఎన్జీవోస్ కేటగిరిలో 230 మంది, నాలుగోతరగతి ఉద్యోగులు 80 మంది పనిచేస్తున్నారు. వర్సిటీ క్యాంపస్‌తో పాటు ఖమ్మం, ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల, లా కాలేజ్, సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాల, ఖమ్మం పీజీ కళాశాల, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల, వర్సిటీ కో ఎడ్యుకేషన్, మహిళ ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి.

నేడు రాజగోపురాలకు భూమి పూజ

వేద పాఠశాల భవనానికి శంకుస్థాపన

హాజరుకానున్న మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు

వరంగల్ కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ భద్రకాళి ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా నాలుగు నిర్మాణం కోసం బుధవారం ఉదయం భూమి పూజ చేస్తారు. అంతేగాకుండా వేద పాఠశాల భవనానికి శంకుస్థాపనతో పాటు అర్చక కుటీరం, అన్నదాన సత్రం, దేవస్థానం కార్యాలయం నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తారు. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, అధికారులు పాల్గొంటారని ఈవో శేషు భారతి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ధార్మిక సలహాదారుడు ఆర్.గోవిందహరి, రాష్ట్ర ప్రధాన స్థపతి వల్లీ నాయగం, దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.దుర్గాప్రసాద్, మాడవీధుల నిర్మాణ పనులు, భూమి పూజ జరిగే ప్రాంతాలను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. అనంతరం వారు వల్లభ గణపతిని, భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, ఇంజనీర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఆర్. గోవిందహరి

శాంతి భద్రతలపై అప్రమత్తంగా ఉండాలి

ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ ● మామునూరులో పీస్ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ అంకిత్ కుమార్

మామునూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల విషయంలో పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్ సూచించారు. మంగళవారం మామునూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో అన్ని మతాలకు సంబంధించిన పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. రాబోయే బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ముస్లిం మత పెద్దలకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మామునూరు ఏసీపీ వేంకటేశ్, పరకాల ఏసీపీ సతీష్ బాబు, మామునూరు సీఐ రమేష్, పర్వతగిరి సీఐ.రాజ్‌గోపాల్, ఏనుమాముల సీఐ రాఘవేదర్, గీసుకొండ సీఐ మహేందర్, పరకాల సీఐ క్రాంతికుమార్, శాయంపేట సీఐ రంజిత్, దుగ్గొండి సీఐ రమణ, నెక్కొండ సీఐ శ్రీనివాస్, మామునూరు, పరకాల, నర్సంపేట పోలీసు సబ్ డివిజన్‌ల పరిధిలోని ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రేపటి నుంచి పలు రైళ్లు రద్దు

కాజీపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే లోని బెల్లంపల్లి - రెచ్నీరోడ్ రైల్వే స్టేషన్‌ల మధ్య నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల దృష్ట్యా ఈ నెల 5 నుంచి 20 వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. (17003) కాజీపేట - సిర్పూర్‌కాగజ్ నగర్‌ల మధ్య రామగిరి ప్యాసింజర్ రైలు అప్ అండ్ డౌన్, (17035) కాజీపేట నుంచి బల్లార్ష వైపు నడిచే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్ డౌన్, (12757) సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్ వైపు వెళ్లు కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, అప్‌అండ్ డౌన్, (20101) నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్ డౌన్ , (22533) గోరఖ్ పూర్ నుంచి యశ్వంతాపూర్ వెళ్లు యశ్వంతాపూర్ ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్ డౌన్ రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఢిల్లీ వైపు వెళ్లు మరికొన్ని రైళ్లను దారి మళ్లించి నిజామాబాద్ మీదుగా నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

సమ్మక్క సాగర్ బ్యారేజీలో మరొక్క గేటు ఎత్తివేత



కన్నాయిగూడెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. సోమవారం వరకు బ్యారేజీలోని ఒక గేటు ద్వారా నీటిని దిగువకు వదిలిన అధికారులు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరగడంతో బ్యారేజీలో నీటి నిల్వలు పెరిగాయి. దీంతో మరొక గేటును ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఎగువ నుంచి 5,500 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండడంతో రెండు గేట్ల ద్వారా 6,000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ పూర్తి స్థాయి నీటి మట్టం 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.892 టీఎమ్సీల నీళ్లు నిల్వ ఉన్నాయి. బ్యారేజీ వద్ద 78.10 మీటర్ల నీటి మట్టం నమోదైంది.

'లక్నవరం'లో పడి వ్యక్తి మృతి



సమ్మయ్య (ఫైల్)

గోవిందరావుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు లక్నవరం సరస్సులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుస్సాపూర్ గ్రామానికి చెందిన కాలేని సమ్మయ్య(40) గత కొన్నేళ్లుగా హమాలీ పని చేసుకుం టూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పని ముగించుకుని సమ్మయ్యతోపాటు తోటి కూలీలు సరస్సును చూడడానికి వెళ్లారు. ఈ సమయంలో అందరూ భోజనం చేస్తుండగా సమ్మయ్య కనిపించకుండా పోయాడు. దీంతో అక్కడ ఉన్నవారు సరస్సులో వెతకగా మృతదేహం లభ్యమైంది. ఈవిషయాన్ని వస్రా పోలీసులకు తెలుపగా ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వర్క్ అడ్జెస్ట్‌మెంట్ సరికాదు..

- సర్కారు ఉత్తర్వులపై ఉపాధ్యాయుల గుర్రు
- పాఠశాలలు ప్రారంభం కాకముందే ఎలా చేస్తారని ప్రశ్న

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరిట ప్రభుత్వం గత నెల 28న జారీ చేసిన ఉత్తర్వులు ప్రభుత్వ అనాలోచిత నిర్ణయానికి నిదర్శనమని ఉపాధ్యాయ వర్గాలు విమర్శిస్తున్నాయి. పాఠశాలు ప్రారంభం కాకముందే పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలనే ప్రభుత్వ విధానాలను ఆక్షేపిస్తున్నారు. బడిబాట ప్రారంభం కాకముందే, విద్యార్థుల ప్రవేశాలు పొందకముందే ఉపాధ్యాయులను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ఏ ప్రాతిపదికన చేస్తారని ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది చేసిన సర్దుబాటులో వివిధ పాఠశాలల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇప్పటి వరకు రిలీవ్ చేయలేదని, అలాంటప్పుడు ఇప్పుడు మరోసారి సర్దుబాటు ఎలా చేస్తారని ఉపాధ్యాయ వర్గాలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. 60 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు మాత్రమే ఉండాలనే నిబంధన సరికాదని, దీనివల్ల విద్యార్థులకు విద్యా బోధనలో తీవ్రమైన అన్యాయం జరుగుతుందంటున్నారు. 30 వరకు విద్యార్థులకు ముగ్గురు టీచర్లు, 60 మందికి అయిదుగురు టీచర్లు ఉండాలని, ప్రతీ ప్రాథమిక పాఠశాలకు ఎల్ఎఫ్ఎల్ హెచ్ ఉంటేనే ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు న్యాయం జరుగుతుందని వారు చెబుతున్నారు.

బడిబాట తర్వాత సర్దుబాటు..

ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని ఈ నెల 6 నుంచి 19 వరకు నిర్వహించేందుకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. బడిబాట పూర్తైన తర్వాత ఆయా పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను బట్టి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విద్యార్థులకు బోధన ప్రమాణాలు అందించేందుకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు సూచిస్తున్నారు. గతేడాది సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులను ఈ ఏడాది సైతం డిప్యూటేషన్‌పై అక్కడే కొనసాగిస్తున్నారు. వారిని రిలీవ్ చేయకుండానే మరోమారు ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తే పరోక్షంగా పాఠశాలల మూసివేతకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు ఉపాధ్యాయ వర్గాలు ఆలోచన చేయాల్సి వస్తుందంటున్నారు. బడిబాట కార్యక్రమం ముగిసిన తర్వాత జూన్ చివరన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేస్తే ఆమోదయోగ్యంగా ఉంటుందని వారు అంటున్నారు.

గత ఏడాది ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో వరంగల్ జిల్లాలో 225 మంది, హనుమకొండ జిల్లాలో 122 మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలల్లో పనిచేస్తున్నారని, వారి డిప్యూటేషన్ రద్దు చేశాక, బడిబాట కార్యక్రమం అనంతరం మాత్రమే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.



పల్లెల్లో సాగు సందడి

ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే ప్రవేశించడంతో అన్నదాత కదిలాడు. ఏరువాక పౌర్ణమికి ముందే సాగు పనులు ప్రారంభమయ్యాయి. పత్తి కట్టె తీయడం, హలాలతో దుక్కులు దున్నడం, యంత్రాలు, ఎద్దుల సాయంతో వ్యవసాయ భూములను దున్నుతున్నారు. సేంద్రియ ఎరువులు చల్లుతున్నారు. ఒకపక్క విత్తన శుద్ధి చేస్తూ మరో పక్క విత్తనాలను చకచకా వేస్తున్నారు. పల్లెలు వ్యవసాయ పనులతో కళకళలాడుతున్నాయి. వెంకటాపూర్ మండల కేంద్ర శివారు ఉప్పరచెరువు శివారులో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవ్వగా ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది.

- వెంకటాపూర్(ఆంధ్రజ్యోతి)





వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు



జగదీశ్ తల్లిదండ్రులకు మంత్రి సన్మానం

కృతజ్ఞతలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

ములుగుటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మల్లంపల్లి మండలానికి జేడీ మల్లంపల్లిగా నామకరణం చేయడంపై బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర పంచాయ తీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం మంత్రి సీతక్క మల్లంపల్లిలో జేడీ మల్లంపల్లి మండలం పేరుతో బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు మాజీ జడ్పీచైర్మన్ కుసుమ జగదీశ్ తల్లిదండ్రులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌తోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీచైర్మన్ జగదీశ్ తల్లిదండ్రులను సన్మానిస్తున్న మంత్రి సీతక్క.



కాళేశ్వరాలయం హోదా పెంపు ?

- 6ఏ స్థాయి నుంచి అసిస్టెంట్ కమిషనర్ స్థాయికి...
- త్వరలో ఉత్తర్వులు వస్తాయన్న మంత్రి శ్రీధర్‌బాబు

మహదేవపూర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ కాళేశ్వర ఆలయాన్ని 6ఏ స్థాయి నుంచి అసిస్టెంట్ కమిషనర్ హోదా అధికారి గల టెంపుల్‌గా అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఈ విషయాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం తెలిపారు.ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఆదేశాలు సైతం ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే ఆలయ అప్‌గ్రేడ్ ప్రక్రియను దేవాదాయ శాఖ అధికారులు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ఈ నెల చివరి వరకు ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం జరిగిన సరస్వతి పుష్కరాలకు 12 రోజులకు గాను రూ.3 కోట్ల ఆదాయం సమకూరింది. అంతేగాకుండా ఆలయానికి రోజురోజుకు భక్తుల తాకిడి పెరుగుతోంది. ఇప్పటివరకు కాళేశ్వరం 6ఏ హోదాతో ఉండేది. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హోదా రావడంతో వేములవాడ ఆలయంతో సమానంగా మారనుంది. అప్‌గ్రేడ్‌తో ఆలయ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు కానున్నాయి. అంతేగాకుండా సిబ్బంది సంఖ్య పెరగనుంది. ఆలయంలో ఎలాంటి పొరపాట్లు జారీ చేసినా అసిస్టెంట్ కమిషనర్ హోదా కలిగిన అధికారి వెంటనే సిబ్బంది సస్పెండ్ చేసే అధికారం ఉంటుంది. ప్రతి ఏడాది ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు మంజూరవుతాయి.



వివాహ పత్రికతో పాటు మొక్కను అందిస్తున్న సాయి చంద్, కుటుంబ సభ్యులు

శుభలేఖ.. ఓ మొక్క..

- వినూత్న రీతిలో ఓ యువకుడి వివాహ ఆహ్వానం
- పర్యావరణ పరిరక్షణ కోసం ప్రయత్నం

హనుమకొండ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం ఓ యువకుడు నడుం బిగించాడు. వరంగల్ విద్యానగర్‌కు చెందిన గుండపు సాయి చంద్ అనే యువకుడు తన వివాహానికి సంబంధించిన శుభలేఖతో పాటు మొక్కను అందజేస్తూ వినూత్నరీతిలో ఆహ్వానిస్తున్నాడు. సాయి చంద్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 5న పర్యావరణ దినోత్సవం, తన వివాహం ఉండగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు. ప్లాస్టిక్‌ను అంతమొందించి పర్యావరణాన్ని కాపాడేందుకు తన వివాహానికి సంబంధించిన శుభలేఖలను పంచుతూ మొక్కలను, స్టీల్ వాటర్ బాటిళ్లను పంచుతున్నారు. తన సమీప బంధువైన ప్రముఖ సామాజికవేత్త సుంకరి ప్రశాంత్‌తో కలిసి ఈ వినూత్న కార్యక్రమానికి సాయి చంద్ శ్రీకారం చుట్టారు. వివాహంలో సైతం ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సాయిచంద్ ప్రకటించారు.

అరచేతిలో వాతావరణం

- యాప్‌ల ద్వారా రైతులకు ఉపయోగం
- ప్రజలను అప్రమత్తం చేస్తున్న వాతావరణ శాఖ

వరంగల్ వ్యవసాయం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు అకాల వర్షాలు కోలుకోలేని నష్టాలను తెచ్చిపెడుతాయి. ఏ క్షణాన వర్షం పడుతుందో.. ఏ క్షణాన పిడుగు పడుతుందో.. తెలియని పరిస్థితి. పిడుగు పాటుకు మనుషులు, మూగజీవాలు మృత్యువాత పడ్డ ఘటనలు అనేకం ఉన్నాయి. ఇలాంటి ప్రమాదాలనుంచి రైతులను, ప్రజలను అప్రమత్తం చేసి ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం, వాతావరణ శాఖ మేఘదూత్, దామిని, రెయిన్ అలారం అనే మూడు ప్రత్యేక యాప్‌లను రూపొందించింది. వీటిని స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. ఎక్కడ పిడుగు పడుతుంది.. ఎక్కడ వర్షం పడుతుందనే విషయాలను తెలుసుకోవచ్చు. అంతేకాదు.. రాబోయే ఐదు రోజుల వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయో కూడా ఇది తెలియజేస్తుంది. స్మార్ట్‌ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి యాప్‌లను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. యాప్ డౌన్‌లోడ్‌కు వినియోగదారులు పూర్తి వివరాలను అందించాల్సి ఉంటుంది.

రెయిన్ అలారం

పంటలు పండించి నూర్పిడి చేసి ధాన్యం ఇంటికి చేర్చే వరకు రైతుకు కంటిమీద కునుకుండదు. ధాన్యం సిద్ధం చేసుకున్న తరువాత అకాల వర్షం వల్ల తడిచిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ సమస్యకు రెయిన్ అలారం యాప్ ద్వారా పరిష్కారం లభిస్తుంది. వినియోగదారుడు అందించిన సమాచారం మేరకు సుమారు 20 కిలోమీటర్ల మేర ఎక్కడ వర్షం కురిసే అవకాశం ఉందనే సమాచారం క్షణాల్లో అందిస్తుంది. దీంతో రైతులు అప్రమత్తం అయ్యేందుకు అవకాశం ఉంటుంది.



వాతావరణ పరిస్థితులను తెలిపే మేఘదూత్ యాప్

దామిని..

ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాలు, పిడుగులు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పొలాల వద్దకు వెళ్లిన రైతులు, ప్రయాణాల్లో ఉన్నవారు వర్షం ప్రారంభం కాగానే చెట్ల కిదకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. వర్షం కురిసే సమయంలో చెట్ల కిందకు వెళ్లడం శ్రేయస్కరం కాదని నిపుణులు చెబుతున్నారు. దామిని యాప్ ద్వారా ఐదు నుంచి 20 నిమిషాల్లో 20 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడ పిడుగు పడుతుందో పక్కా సమాచారం అందిస్తుంది. ఇది రైతులకు, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

మేఘదూత్

పంటలకు, రైతులు రసాయన ఎరువులు పిచికారి చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో పిచికారి చేసి ఇంటికి వచ్చిన వెంటనే వర్షం పడుతుంది. దీంతో పిచికారిచేసిన మందుతో పాటు సమయం వృథా అవుతుంది. అందుకోసమే కేంద్ర ప్రభుత్వం వాతావరణ విషయాలను ఎప్పటికప్పుడు ప్రజలు, ముఖ్యంగా రైతులు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా యాప్‌లను రూపొందించింది. ఇందులో భాగంగా మేఘదూత్ యాప్ అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ఎప్పకటిపప్పుడు వాతావరణ విషయాలను వెల్లడిస్తుంది. రాబోయే ఐదు రోజుల్లో వాతావరణంలో మార్పులు, వర్ష సూచన, ఆకాశం మేఘావృతం అవుతుందా..? ఈదురుగాలులు ఎక్కడి నుంచి ఎటు వైపు వీస్తాయనే సమాచారాన్ని అందిస్తుంది.

ఇనుగుర్తి అభివృద్ధికి కృషి

- కార్యాలయాలకు ఒకేచోట శాశ్వత భవనాలు
- సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి

ఇనుగుర్తి (మహబూబాబాద్ జిల్లా), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పాటైన ఇనుగుర్తి మండల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. ఇనుగుర్తిలో మంగళవారం యువజన సంఘం, విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆయనతో కలిసి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇనుగుర్తిలో త్వరలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కాబోతోందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలన్నీ ఒకేచోట ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యేరాంచంద్రునాయక్ మాట్లాడుతూ అంబేద్కర్ సూచించిన బోధించు, సమీకరించు, పోరాడు సూక్తులను ఆచరించాలని కోరారు. ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకనుగునంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన కొనసాగిస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ అంబేద్కర్ ప్రసాదించిన హక్కులతోనే మనం అందరం విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతస్థానాల్లో ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, మాజీ డీజీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అవిలయ్య, జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు, స్థానిక అధ్యక్షుడు పప్పుల వెంకన్న, మాంకాలి సలీంరాం, గోపందాస్ కృష్ణ, దార్ల రాంమూర్తి, గుజ్జునూరి బాబురావు, బేతమల్ల చంద్రయ్య పాల్గొన్నారు.



ఇనుగుర్తిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు

సంపద పెరిగితే ఆకలిచావులు ఎందుకు?

- ప్రజాధనం కార్పొరేట్‌కు కేంద్రం ధారాదత్తం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- నర్మెటలో సీపీఐ జనగామ జిల్లా నాలుగో మహాసభలు



నర్మెటలో మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

నర్మెట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లలో దేశంలో తలసరి ఆదాయం రెట్టింపు అయితే ఆకలి చావులు, రైతు ఆత్మహత్యలు ఎందుకు ఉన్నాయని, ప్రధాని మోదీ పాలనలో సంపద అంతా కార్పొరేట్ శక్తులైన అంబానీ, అదానీల వద్దే కేంద్రీకృతమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం జనగామ జిల్లా నర్మెట మండలకేంద్రంలో సీపీఐ జిల్లా నాల్గవ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి అధ్యక్షత వహించగా కూనంనేని ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయని, కార్పొరేట్ శక్తులకు కేంద్రం ప్రజా సంపదను ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. యాభై లక్షల కోట్లు ఉన్న అప్పు నేడు నూట అరవై కోట్లకు పెరిగిందన్నారు. మోదీ ప్రభుత్వంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిందని, వెనుకబడిన తరగతులకు 42శాతం రిజర్వేషన్‌లు ఆర్థిక, సామాజిక, రాజకీయ ఉద్యోగ కాంట్రాక్టు రంగాల్లో వెంటనే అమలు చేయాలన్నారు. ఆపరేషన్ కగార్ నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని కూనంనేని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి పార్టీ రాజీలేని ప్రజా పోరాటాలు చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో కేంద్రం విఫలమైందన్నారు. మోదీ శంకుస్థాపన చేసిన కోచ్ ఫ్యాక్టరీ ఇంకా అనుమతి రాలేదన్నారు. రాష్ట్రంలో రైతులు రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలన్నారు.

గ్రామంలో భారీ ర్యాలీ..

జిల్లా మహాసభ నేపథ్యంలో నర్మెటలో సీపీఐ భారీ ప్రజా ప్రదర్శన చేపట్టింది. కార్యకర్తలు ఎర్రజెండాలతో ర్యాలీలో పాల్గొనడంతో గ్రామమంతా ఎరుపుమయం అయింది. అనంతరం మహాసభలో వక్తలు ప్రసంగించారు.

కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, చొప్పరి సోమయ్య, కావటి యాదగిరి, జువారి ఎల్లయ్య, బోనగిరి కుమారస్వామి, నీల కనకయ్య పాల్గొన్నారు.

జోరుగా నిషేధిత పత్తి విత్తనాల విక్రయం

- మారుమూల గ్రామాల్లో క్రయ విక్రయాలు
- తనిఖీలు చేపట్టని అధికారులు





చిట్యాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మారుమూల పల్లెల్లో ప్రజలు వ్యవసాయాధారితంతోనే జీవనం గడుపుతుంటారు. అమాయక రైతుల అవసరాలను ఆసరా చేసుకుని నిషేధిత విత్తనాలను అంటగట్టేందుకు దళారులు జోరుగా తిరుగుతున్నారు. నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాల క్రయవిక్రయాలు చిట్యాల, టేకుమట్ల మండలాల్లో జోరందుకున్నాయి. సంబంధిత అధికారులు తనిఖీలు చేయకపోవడంతో రైతుల ఆరోగ్యం పాడవుతుందని తెలియక అధిక ధరలు చెల్లించి బీటీ3 విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు.

గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫమవుతున్నారన్న ఆరోపణలు మెండుగా వినిపిస్తున్నాయి. చిట్యాల మండలంలోని నైన్‌పాక, వరికోల్‌పల్లి, జడల్‌పేట, బావుసింగ్‌పల్లి, ముచినిపర్తి, గుంటూరుపల్లి తదితర గ్రామాల్లో పలువురు దళారులు బీటీ3 విత్తనాలను డంప్ చేసి అమాయక రైతులకు అధిక ధరలకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ప్యాకెట్‌ను రూ.16వందలకు విక్రయిస్తుండగా ఎకరాలకు 2 ప్యాకెట్లు అవసరమవున్నట్లు సమాచారం. వీటితో పాటు బిడివిత్తనాలు సైతం కిలో. రూ.3500 లకు విక్రయిస్తున్నారు.

కలుపు ఖర్చు మిగులుతుందని

బీటీ3 పత్తి విత్తనాలతో ఆరోగ్యానికి హానికరం, భూసారం కోల్పోతుందని పరిశోధనల్లో తేలడంతో రాష్ట్ర ప్రభుత్వం బీటీ-3 విత్తనాల అమ్మకాలను నిషేధించింది. కానీ విత్తనాలు మొలకెత్తిన తర్వాత గడ్డి మందు పిచికారీ చేసినా మొక్కలకు ఎలాంటి ప్రమాదం లేదు. దీంతో కలుపు నివారణ సులభతరమని, కూలీల ఖర్చు తగ్గుతుందని కొంత మంది దళారులు అమాయక రైతులను నమ్మిస్తున్నారు. మిగిలిన రకం విత్తనాలకు గడ్డి మందు పిచికారీ చేస్తే పత్తి మొక్కలు ఎండిపోతాయి. నిషేధిత బీటీ3 పత్తి విత్తనాలతో పాటు నిషేధిత గడ్డిమందు (గ్లైఫోసెట్) ను పలు గ్రామాల్లో గంప్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

తనిఖీలేవి..!

వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభం అయినా సంబంధిత అధికారులు ఇప్పటివరకు తనిఖీలు చేయకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. నిషేధిత బీటీ విత్తనాల క్రయవిక్రయాల సమాచారం తెలిసినా మనకెందులే అని మామూళ్లు తీసుకుంటున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు తనిఖీలు చేసి నిషేధిత బీటీ3 విత్తనాల క్రయవిక్రయాలను అడ్డుకుని, వాటివల్ల కలిగే అనార్థాలపై రైతులకు అవగాహన కల్పించాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నిజాయితీగా పని చేయాలి

పదోన్నతి పొందిన ఏఎస్సైలకు సీపీ పిలుపు

వరంగల్ క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నిజాయితీగా పనిచేసి పోలీసులపై ప్రజలకు నమ్మకం కలిగేలా వ్యవహరించాలని పదోన్నతి పొందిన ఏఎస్సైలకు సీపీ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. ఏఎస్సైల నుంచి ఎస్సైలుగా పదోన్నతి పొందిన జనార్దన్, నారాయణ, సీతారాములు ముగ్గురు కలిసి మంగళవారం సీపీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి పాల్గొన్నారు.



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సైలుగా పదోన్నతి పొందిన ఏఎస్సైలు



విభాగాధిపతులుగా నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

ఆర్ట్స్ కళాశాలలో పలు విభాగాధిపతుల నియామకం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పలు విభాగాలకు విభాగాధిపతులను నియమిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆమె మంగళవారం వివిధ విభాగాలకు అధిపతులకు నియమించబడ్డ వారికి నియామకపత్రాలు అందజేశారు. తెలుగు విభాగాధిపతిగా డాక్టర్ సీహెచ్.ప్రవీణ్, పాలనశాస్త్రం అధిపతిగా డాక్టర్ సుచరితపాల్‌లకు నియామక పత్రాలు అందజేశారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, అధ్యాపకులు పాల్గొన్నారు. అంతకు ముందు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, జాక్ ఆధ్వర్యంలో నిరసన

హనుమకొండ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ అదాలత్ సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాక్ కన్వీనర్ చందా మల్లయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అమరవీరుల స్థూపాలు కావని, అవి బీసీ, ఎస్సీ, ఎస్టీ, అమరవీరుల స్థూపాలుగా, వాటిపై తెల్లని పెయింట్‌తో రాస్తున్నట్లు తెలిపారు. ఉద్యమ సమయంలో మరణించింది బీసీ, ఎస్సీ, ఎస్టీలేనని, అగ్రకులాల వారు ఎవరూ లేరని అన్నారు. కాగా, నిరసన చేస్తున్న జాక్ నాయకులను సుబేదారి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా జాక్ కోఆర్డినేటర్ పొదిల సాయిబాబా, మేకల సుమన్, సురేష్, సలీం, రవీందర్, సునీల్, యేసొబు మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇతర మతాలను గౌరవిస్తూ పండుగలు జరుపుకోవాలి

వరంగల్ క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇతర మతాలను గౌరవించుకుంటూ పండుగలను జరుపుకోవాలని సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా సూచించారు. వివిధ మతాలకు చెందిన మతపెద్దలతో మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. సోదరభావంతో పండుగల వేళ అన్నిమతాల వారు పరస్పరం సహకరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, నందిరాంనాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి రాజనీతిశాస్త్ర విభాగంలో తరగతులు

కేయూ క్యాంపస్ జూన్ 3, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్లకు జూన్ 4 నుంచి 10వ తేదీ వరకు వారం పాటు రీసెర్చ్ మెథాడలజీపై అవగాహన తరగతులను నిర్వహిస్తున్నట్లు రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ తెలిపారు. ఈమేరకు మంగళవారం రాజనీతిశాస్త్ర విభాగంలో బీవోఎస్ స్టడీస్ ఛైర్మన్ డాక్టర్ జి.కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వేడపల్లి నాగరాజులతో కలిసి సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ మాట్లాడుతూ.. రాజనీతిశాస్త్ర విభాగంలో జూన్ 6 నుంచి 10 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పరిశోధన పద్ధతులపై అవగాహన తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు. రాజనీతిశాస్త్ర విభాగ పరిశోధకులతో పాటు ఇతర సామాజిక శాస్త్రాల పరిశోధకులు తరగతులకు హాజరుకావాలని తెలిపారు. 90శాతం హాజరు కల్గిన అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందచేస్తామన్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా మనోహర్ బాధ్యతలు

కేయూ క్యాంపస్ జూన్ 3, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్ళపల్లి మనోహర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కాంట్రాక్టు అధ్యాపకుడు డాక్టర్ ఏటీబీపీ ప్రసాద్ నుంచి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తాళ్ళపల్లి మనోహర్‌కు ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం స్కాలర్లు భూక్య వంశీకృష్ణ, సుమన్ నమిలే, మహ్మద్ పాషా, చీమల బుచ్చయ్య, మిట్టగడుపుల అన్వేష్‌లు కలిసి పుష్పగుచ్ఛం అందచేసి, శాలువతో సన్మానించారు.

కేంద్ర గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

కేయూ క్యాంపస్ జూన్ 3, (ఆం ధ్రజ్యోతి): హనుమకొండలోని కేం ద్ర గ్రంథాయాలనికి అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు, జాతీయ యువజన అవార్డు గ్రహీత మం డల పరుశురాములు ఉచితంగా పుస్తకాలను బహూకరించారు. ఈ మేరకు మంగళవారం హనుమ కొండలోని కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్‌కు తన చాంబర్‌లో సుమారు 200 పుస్తకాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పురుషోత్తం, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి ఎస్సైగా ఎస్.రాజేందర్

వరంగల్ క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వెస్ట్‌జోన్ పరిధిలోని రాయపర్తి ఎస్సైగా సీసీఆర్‌బీలో పనిచేస్తున్న ఎస్.రాజేందర్‌ను నియమిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఇక్కడ ఇంతకాలం విధులు నిర్వర్తించిన శ్రవణ్‌కుమార్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎంజీఎంలో తనిఖీలు

వరంగల్ మెడికల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రిలో సెంట్రల్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ హిమానాయక్, సీడీఎస్‌సీఓ హైదరాబాద్ జోన్ జె.కిరణ్ కుమార్‌లు మంగళవారం ఎంజీఎం బ్లడ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. బ్లడ్ సెంటర్ వైద్యులు, సిబ్బంది, డ్రగ్స్ కాస్మోటిక్ చట్టం 1940 ప్రకారం తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ఇటీవల వచ్చిన ఆరోపణల మేరకు ఈ తనిఖీ చేపట్టామన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డు వస్తోందని..

ప్రియుడితో కలిసి కూతురును చితకబాదిన తల్లి

మొగుళ్లపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉంటోందని, ప్రియుడితో కలిసి కూతురిపై ఓ తల్లి దాడికి పాల్పడింది. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ప్రకారం... మేదరమట్ల గ్రామానికి చెందిన ఓ వివాహితకు భర్త, ఇద్దరు పిల్లలు వున్నారు. ఐదేళ్ల క్రితం ఆమె భర్త చనిపోయాడు. ఆ తర్వాత అదే గ్రామానికి చెందిన కొడారి కుమారస్వామి అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. సదరు వివాహితకు ఇద్దరు కూతుళ్ల ఉండగా, పెద్ద కూతురు అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. చిన్న కూతురు తల్లితోనే ఉంటుంది. అయితే ఆమె ఇంటి వద్ద ఉండటం తల్లికి నచ్చలేదు. ఆమె తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉంటోందన్న కోపంతో రెండు రోజుల క్రితం ప్రియుడు కొడారి కుమారస్వామితో కలిసి చితకబాదింది. ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించారు. శరీరంపై దెబ్బలతో ఆమె తీవ్ర అస్వస్థతకు లోనైంది. ఈ విషయం తెలియడంతో బాధితురాలి అక్క వచ్చి ఆరా తీయగా.. చెల్లెలు జరిగిందంతా చెప్పింది. దీంతో బాధితురాలి అక్క మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై ఎస్సై అశోక్‌ను వివరణ కోరగా.. ఫిర్యాదు అందిందని, కొడారి కుమారస్వామితో పాటు బాధితురాలి తల్లిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సమస్యాత్మక రోడ్లన్నీ మరమ్మతులు చేస్తున్నాం..

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

రాంనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సమస్యాత్మక రోడ్లకు మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అంతర్గత రోడ్డు త్వరతగిన పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టామని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం 53, 54 డివిజన్‌లలోని విజయగణపతి కాలనీ, మహాత్మనగర్, హన్మంత్‌రావు నగర్, సగర కాలనీలో రూ.1.05కోట్లతో నిర్మించబోయే సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల అభివృద్ధి, పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే, 54వ డివిజన్ కార్పొరేటర్ గుంటి రజిత శ్రీనవాస్, సోదా కిరణ్, నాయకులు రహీమున్నీసా బేగం, ఎర్ర మహేందర్, ఎం.డి. సత్తార్, స్థానికులు పమ్మి రమేశ్, అలువాల ఎల్లేశ్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

పరిశుభ్రతలో ఆదర్శకాలనీ నగరానికి ఆదర్శం

రాంనగర్, (ఆంధ్రజ్యోతి): ఆదర్శకాలనీ పరిశుభ్రతలో నగరానికి ఆదర్శమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. నివాసయోగ్యమైన, స్థిరమైన, కార్యాచరణకు అనుకూలమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం 53 డివిజన్‌లో ఆదర్శకాలనీ కమిటీ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కిరణ్, కాలనీ కమిటీ అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు, కోశాధికారి నరసింహస్వామి, సభ్యుడు పున్నం శ్రీను, సంజీవరెడ్డి, తిరుపతి రెడ్డి, జగదీశ్వర్, యగేందర్, వెంకట్రాంనర్సయ్య, రమణయ్య, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బడీడు పిల్లలను ప్రభు త్వ బడుల్లో చేర్పించాలని డీఈవో ఎం.జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడిబాట జాత కార్యక్రమాన్ని మంగళవారం డీఈవో కార్యాలయంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉచితమైన నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఏర్పాటు చేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తోందన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులందరూ విద్యార్థుల ప్రవేశాలను పెంచాలన్నారు. యూటీఎఫ్ చేపట్టిన కార్యక్రమం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్‌కుమార్, కుమార్, సుజన్‌ప్రసాదరావు, దామోదర్, అన్నాదేవి, రవూఫ్, శ్రీనివాస్, రమేష్, కుమారస్వామి, రవీందర్, కరుణాకర్, రేణుక, సత్యనారాయణ, శ్రీనివాస్, హరిప్రసాద్, సంపత్, అరవింద్‌కుమార్, మల్సూర్, సీతారాం, నరసింహారావు, రాజిరెడ్డి, కుమారస్వామి, శంకర్, రఘురామయ్య, చంద్రశేఖర్, శివప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ బడిబాట జాతను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఈవో జ్ఞానేశ్వర్

గుంతల రోడ్లతో ప్రమాదాలు

హనుమకొండలో కురిసిన వర్షం

హనుమకొండ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ నగరంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. నగరంలోని రోడ్లన్నీ వరద నీటితో జలమయ్యాయి. హనుమకొండ బస్టాండ్ ప్రాంగణంలోకి వరద నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. నగరంలోని పలు కాలనీలలో సరైన డ్రెయినేజీలు లేకపోవడంతో వర్షానికి మురుగు నీరు రోడ్లపైకి చేరి రోడ్లన్నీ అధ్వాన్నంగా మారాయి. వర్షానికి రోడ్డుపై ఉన్న గుంతల్లో వరదనీరు చేరడంతో హనుమకొండలోని గ్రంథాలయం సమీపంలో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడినట్లు ప్రయాణికులు తెలిపారు. పలు కాలనీలలో రోడ్లు గుంతలు పడి కంకర తేలి ఉండడంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి దాపురించిందని ప్రయాణికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు గుంతలు పడిన రోడ్లను బాగుచేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టి పూడికమట్టితో నిండిన కాలువలకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



హనుమకొండ బస్టాండ్ సమీపంలో రోడ్డుపై చేరిన డ్రెయినేజీ నీటిలో ప్రయాణిస్తున్న వాహనదారులు

పేదవారి ఆత్మగౌరవ ప్రతీక సొంత ఇల్లు

- పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పేదవారి ఆత్మగౌరవ ప్రతీక సొంత ఇల్లు అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాస్ రోడ్డు కేఎల్ఎన్ ఫంక్షన్ హాలులో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీలకతీతంగా లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. పేద ప్రజలకు గూడు, నీడ కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. నిర్ణీత సమయంలో ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం ఇండ్లు నిర్మించుకొని సహాయం పొందాలన్నారు. ఇందిరమ్మ ఇం టి లబ్ధిదారులకు నాలుగు దశలలో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని 400 చదరపు అడుగుల నుం చి 600చదరపు అడుగులలోపు ఇంటి నిర్మాణం చేసుకోవాలన్నారు. 4దశల్లో గ్రీన్‌చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే డయల్ యువర్ ఎమ్మెల్యే 80961 07107 నెంబర్‌కి ఫోన్‌చేసి మీ సమస్య తెలిపితే పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. హనుమకొండ జడ్పీ సీఈఓ విద్యాలత, హౌసింగ్ పీడీ దరావత్ రవీంద్రనాయక్, ఎంపీడీవో కర్ణాకర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి అడ్లూరి అనురాధ, హౌసింగ్ డీఈ భూక్య సిద్ధార్థనాయక్, హౌసింగ్ ఏఈ నరేందర్ రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి, మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ పల్లె దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కాజీపేట ప్రభుత్వ ఐటీఐలో 2025-26 విద్యాసంవత్సరానికి మొదటి విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ పి. వెంకటేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానికల్, డ్రాఫ్ట్ మ్యాన్ సివిల్, ఫిట్టర్, డ్రస్ మేకింగ్, స్టెనోగ్రాఫర్ ట్రేడ్‌లలో ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. పదో తరగతి మార్కులు, రూల్ ఆన్ రిజర్వేషన్ ప్రాతిపదకన ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తికల అభ్యర్థులు ఈనెల 21తేదీలోపు htpp://iti telan gana.govవెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొ



వెంకటేశ్వర్‌రావును అభినందిస్తున్న సన్నిహితులు

వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడికి అభినందనలు

న్యూశాయంపేట, జూన్3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వ రంగల్ జిల్లా వెలమ సంక్షే మ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన నడిపెల్లి వెంకటేశ్వర్‌రావును మంగళవారం పలువురు అభినందించారు. వెలమ కులస్థులు, బంధువులు, స్నేహితులు, పెద్ద సంఖ్యలో వెంకటేశ్వరరావుకు ఇంటికి తరలివచ్చి పూలబొకే అందించి శాలువాలు కప్పి అభినందించారు. ఈ నెల 8వ తేదీన హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వెలమసంక్షేమ సంఘం భవనంలో నూతనకార్యవర్గం ప్రమాణస్వీకారంచేయనున్నారు.

నేడు వడ్డెపల్లి హైస్కూల్‌లో రెవెన్యూ సదస్సు

వడ్డెపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఉదయం 9 గంటలకు రైతు సదస్సును ఏర్పాటు చేసినట్లు గ్రేటర్ వరంగల్ 60వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎనుకొంటి పున్నం చందర్ తెలిపారు. హనుమకొండ తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఇతర రెవెన్యూ అధికారులు హాజరయ్యే ఈ రెవెన్యూ సదస్సులో వడ్డెపల్లికి చెందిన రైతులు పాల్గొని తమ భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని ఆయన పేర్కొన్నారు. సదస్సుకు హాజరయ్యే రైతులు పాస్ పుస్తకాలతోపాటు రిజిస్ట్రేషన్ దస్తావేజులతో హాజరు కావాలని కోరారు.

ఘనంగా హరీష్‌రావు జన్మదిన వేడుకలు

హనుమకొండ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర నేత, మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీర్ హరీష్ రావు జన్మదినం సందర్భంగా మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ శ్రేణులు వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ ఛైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కుడా మాజీ ఛైర్మన్ మర్రి యాదవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేకు కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగరావు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, ఉడతల సారంగపాణి, పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, సీనియర్ నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, నయీమొద్దీన్, నార్లగిరి రమేష్, సల్వాజి రవీందర్‌రావు, బుద్దె వెంకన్న, దూలం వెంకన్న, విజయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు ఖలీల్, కోటిలింగం, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ మంత్రి హరీష్‌రావు జన్మదిన వేడుకలలో పాల్గొన్న నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి

డంపింగ్ యార్డును ఎత్తివేయాలి

మడికొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మడికొండ, రాంపూర్ శివారులోని డంపింగ్ యార్డును తక్షణమే ఎత్తివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ బృందం క్షేత్రస్థాయిలో డంపింగ్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న విషవాయువులు ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయని ఈవిషయమై బాధితులు అనేక పర్యాయాలు అధికారులు, ప్రజా ప్రతినిధులను కలిసి తమ ఆవేదనను తెలిపి డంప్ యార్డును ఎత్తివేసి తమ ప్రాణాలను కాపాడాలని మొరపెట్టుకున్నా కనికరించే వారు లేరని విమర్శించారు. డంపింగ్ యార్డు తరలించకపోతే ప్రజల సమస్యల పరిష్కారమే ఎజెండాగా పని చేసే సీపీఐ ఆధ్వర్యంలో డంపింగ్ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఎన్.ఎ.స్టాలిన్, జిల్లా నాయకులు మునిగాల భిక్షపతి, మాలోత్ శంకర్, ఎదునూరి వెంకట్రాజం, కొట్టె వెంకటేష్, లక్ష్మీ, వేల్పుల సారంగపాణి, మాచర్ల స్వరూప, ఎర్రబెల రమేష్ కాగితాల రాములు పాల్గొన్నారు.

బట్ట సంచుల పంపిణీ

హనుమకొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 53వ డివిజన్ ఆదర్శ కాలనీలో బట్ట సంచులను పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ శోభా కిర ణ్ చేతుల మీదుగా సుమారు 80మంది పారిశుధ్య కార్మికులకు ఈ సం చులను అందచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం ప్రతి నిధి తేరాలయుగేందర్, ఆదర్శకాలనీ ప్రెసిడెంట్ పరికిపండ్ల వేణు, ఎంహెచ్ వో రాజారెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ప్లైవుడ్ సెంటర్‌లో చోరీ

రూ.40 వేల నగదు, రూ.40 వేల వస్తువుల చోరీ

హసన్‌పర్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధి చింతగట్టు క్యాంపు హనుమాన్ ప్లైవుడ్ సెంటర్‌లో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు బాధితుడు కృష్ణాది రాజేష్ తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో షాపు తెరిచేందుకు రావడంతో విషయం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. గుర్తు తెలియని దొంగ షాపు వెనకాల ఉన్న కిటికీ చువ్వలు తొలగించి షాపులోకి చొరబడి కౌంటర్‌లో ఉన్న నగదు రూ.40వేలతో పాటు సీసీ టీవీ కెమెరాల కంప్యూటర్ పరికరాలను దొంగిలించినట్లు బాధితుడు రాజేష్ తెలిపాడు. ఈ విషయం 100 డయల్‌కు ఫోన్ చేసి సమాచారం అందించగా కేయూ ఎస్సై బొజ్జ రవిందర్ నేతృత్వంలో పోలీసు క్లూస్ టీం ఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ రవిందర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా చోరీ జరిగిన విషయంపై కేసు నమోదు చేసుకొని ఆరా తీస్తున్నట్లు తెలిపారు.



కౌంటర్ నుంచి నగదు చోరీ అయిన దృశ్యం



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న రెజోనెన్స్ యజమాన్యం

ఐఐటీ ప్రవేశాల్లో అగ్రగామి రెజోనెన్స్

రాంనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో వరంగల్ రెజోనెన్స్ విద్యార్థులు అద్భుతమైన ర్యాంకులు సాధించి ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ ప్రవేశానికి మార్గం సుగమం చేసుకున్నారని రెజోనెన్స్ ఛైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. ఎలాంటి ఫౌండేషన్ కోర్సు లేకుండా తమ విద్యార్థులైన పి.శశికౌషిక్ 401 ర్యాంకు, బి.సాహితి 642, సౌమ్య 659, అనిరుధ్ 714, శరణ్ 750, హృదయ్ 810, సిద్ధు 883, ఎం.చరణ్‌తేజ్ 854, బి.ఉమేశ్ చంద్ర 941 ర్యాంకులు సాధించారన్నారు. 1000లోపు ర్యాంకుల 9మంది, 2000లోపు ర్యాంకులు 61 మంది సాధించారన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ రాజిరెడ్డితోపాటు డైరెక్టర్ లెక్కల మహేందర్‌రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సీఏఓ లెక్కల రమ్య అభినందించారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

వడ్డెపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభు త్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీని గ్రామ, డివిజన్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ (టీపీసీ) సేవాదళ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొచ్చు చందర్ అన్నారు. టీపీసీ సేవాదళ్ హనుమకొండ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన చందర్ మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదని తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుల సహకారం, సూచనలతో పార్టీని బలోపేతం చేస్తానని చందర్ చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు చిన్నాల గోనాద్, పాలకుర్తి శ్రీనివాస్, నిట్టే బాలరాజు, తాళ్లపల్లి రాజు, పున్నంచందర్ పాల్గొన్నారు.

వానల్లో వయ్యారంగా...





చిత్తడిలో నేల మీద జీరాడే దుస్తులు ధరించలేం! కాబట్టి ప్రత్యేకించి వాన రోజుల్లో కురచ గౌన్లకే ప్రాధాన్యం ఇస్తూ ఉంటారు అమ్మాయిలు. అలాంటి కొన్ని చిట్టి పొట్టి గౌన్ల మీద ఓ లుక్కేద్దామా?

మోకాలి పొడవు గౌన్లు ధరించడానికి సౌకర్యంగా ఉండడంతో పాటు చూడముచ్చటగా కనిపిస్తాయి. పూలు, లతల డిజైన్లు, జామెట్రిక్ డిజైన్లు... ఇలా భిన్నమైన డిజైన్లతో, భిన్నమైన వస్త్రాలతో రూపొందే షార్ట్ గౌన్స్‌కు అనువైన కాలమిది. అయితే వీటిని ధరించేటప్పుడు కొన్ని అంశాలు దృష్టిలో పెట్టుకోవాలి. అవేంటంటే...

- కాటన్, లినెన్, జార్జెట్, స్పన్... ఇలా గౌన్లు ఎన్నో రకాల వస్త్రాలతో తయారవుతూ ఉంటాయి. అయితే ఒడ్డు పొడవుల ఆధారంగా ఎవరికి వారు ఈ గౌన్లను ఎంచుకోవాలి. నాజూకుగా ఉన్న మహిళలు కాటన్, లినెన్ గౌన్లను ఎంచుకోవచ్చు. బొద్దుగా ఉండేవారికి స్పన్, జార్జెట్ గౌన్లు బాగుంటాయి
- బ్లంట్ హీల్స్, పెన్సిల్ హీల్స్. వీటిలో ఏ జోళ్లు ధరించినా గౌన్లకు చక్కగా మ్యాచ్ అవుతాయి. అయితే ఇది వానాకాలం కాబట్టి తోలుతో తయారైన జోళ్లకు బదులుగా ఇతరత్రా మెటీరియల్స్‌తో తయారైన వాటినే ఎంచుకోవాలి.
- ఈ గౌన్లతో కృత్రిమ ఆభరణాలు, జర్మన్ సిల్వర్ ఆభరణాలు ధరించవచ్చు. ఈ ఆభరణాలు వీలైనంత సింపుల్‌గా ఉండేలా చూసుకోవాలి
- ఇక మిగతా యాక్సెసరీస్ విషయానికొస్తే పర్సులకు బదులుగా స్లింగ్ బ్యాగ్స్ గౌన్లకు చక్కగా నప్పుతాయి. చేతులకు బ్యాంగిల్స్‌కు బదులుగా పెద్ద డయల్ కలిగిన వాచీలను ఎంచుకోవాలి.

ధనురాసనం వేద్దామా..?

వేసవిలో ఏండ వేడివల్ల అలసటగా నీరసంగా అనిపిస్తూ ఉంటుంది. వీటిని నివారించి ఉత్సాహంగా ఉండాలంటే... ప్రతిరోజూ యోగా చేస్తే సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ యోగాలో ముఖ్యమైన భంగిమ 'ధనురాసనం'. దీని గురించి తెలుసుకుందాం.



ధనురాసనం ఇలా వేయాలి

- ముందుగా నేలపై బోర్లా పడుకోవాలి. మోకాళ్ల నుంచి కాళ్లను పైకి ఎత్తాలి. చేతులను వెనక్కి చాచి కాలి మడమలను పట్టుకోవాలి. మెడను నిటారుగా ఉంచాలి. గుండె నిండా గాలిని పీల్చి పదిహేను సెకండ్లు అలాగే ఉండి తరవాత గాలిని మెల్లగా విడవాలి.

ప్రయోజనాలు

- ప్రతిరోజూ ధనురాసనం వేయడం వల్ల కండరాలు, కీళ్లు బలోపేతమవుతాయి. శరీరం అన్ని వైపులకూ సులువుగా వంగుతుంది.
- ఈ ఆసనం వేసేటప్పుడు పొత్తి కడుపు కండరాల మీద ఒత్తిడి పడడం వల్ల అవి దృఢంగా తయారవుతాయి. కడుపు ఉబ్బరం తగ్గుతుంది. జీర్ణాశయం చురుకుగా పనిచేసి అజీర్ణ సమస్యలను తగ్గిస్తుంది.
- వెనక్కి వంగడం వల్ల వెన్నెముక బలపడుతుంది. నడుము వంగకుండా ఉంటుంది. నిటారుగా నిలబడి నడిచే సామర్థ్యం పెరుగుతుంది.
- తరచూ ఈ ఆసనం వేస్తూ ఉంటే ఊపిరితిత్తుల పని తీరు మెరుగుపడుతుంది. శరీరంలో ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. దీంతో అలసట, నీరసం, శ్వాస సంబంధిత సమస్యలు తగ్గుతాయి.
- ధనురాసనం వేసే క్రమంలో రెండు కాళ్లు పైకి లేపడం వల్ల శరీరమంతటా రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. దీంతో గుండె, మెదడు ఆరోగ్యంగా పనిచేస్తాయి.
- కార్యాలయాల్లో ఎక్కువసేపు కూర్చుని పనిచేసేవారు ప్రతిరోజూ ఈ ఆసనం వేస్తూ ఉంటే భుజాలు, మెడ, తల నొప్పులు సహా ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి.
- దీర్ఘంగా శ్వాస పీల్చడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి.

కరాటే సిస్టర్స్

అమృతారెడ్డి, ఘనసంతోషిణిరెడ్డి...

ఈ అక్కాచెల్లెళ్లు రికార్డులకు పెట్టింది పేరు. బద్దలు కొట్టడంలో కాదు... సరికొత్తవి సృష్టించడంలో. ఒకటా రెండా... కరాటేలో వీరు సంచలనాలకు మారుపేరు. ఇటీవలే 121 ఆత్మరక్షణ మెళకువలను కేవలం 9.36 నిమిషాల్లో ప్రదర్శించి మరో ప్రపంచ రికార్డు నెలకొల్పారు. అంతర్జాతీయ క్రీడాకారులుగానూ సత్తా చాటుతున్నారు. రెండేళ్ల వయసులోనే మొదలైన తమ కరాటే జర్నీ గురించి అమృతారెడ్డి 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.



"మనం రోజూ చూస్తున్నాం... ఎక్కడో అక్కడ మహిళల మీద నిత్యం ఎన్నో అఘాయిత్యాలు జరుగుతున్నాయి. వీటి నుంచి తమను తాము రక్షించుకొనేలా ఆడపిల్లలు దృఢంగా మారాలి. అందుకు కరాటేలాంటి మార్షల్ ఆర్ట్స్ ఎంతో దోహదపడతాయి. కరాటే నేర్చుకొంటే ఆత్మరక్షణ మెళకువలు తెలుస్తాయి. దానివల్ల ఆత్మవిశ్వాసం, శరీర దారుఢ్యం పెరుగుతాయి. ఈ రెండూ తోడుంటే ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైనా ధైర్యంగా ఎదిరించగలుగుతాం. ఇవన్నీ ఆలోచించే నాకు, మా చెల్లి ఘనసంతోషిణికి మా నాన్న గోపాల్ రెడ్డి చిన్న వయసులోనే కరాటే శిక్షణ ప్రారంభించారు. నేను రెండేళ్లప్పుడు మొదలుపెడితే... చెల్లి తన మూడో ఏట ఇందులోకి వచ్చింది. అప్పటి నుంచి నిర్విరామంగా మా శిక్షణ సాగుతూనే ఉంది. మా నాన్నావాళ్లది కరీంనగర్. మేం పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లో. నాన్నకు ఇక్కడ కరాటే అకాడమీ ఉంది. నాకు ఒక తమ్ముడు. వాడు కూడా కరాటే నేర్చుకొంటున్నాడు. మా అమ్మ మాధవి గృహిణి. తను మినహా ఇంట్లో అందరం కరాటేలో ఉన్నాం. అమ్మ మా అందరికీ కావల్సినవన్నీ అందించి, ఎంతో ప్రోత్సహిస్తుంది.

నాన్న స్ఫూర్తితో...

ఊహ తెలియకముందే మేం కరాటే అభ్యాసం మొదలుపెట్టాం. కానీ పెరిగేకొద్దీ దానిపై మాకు ఇష్టం ఎక్కువైంది. మాకు స్ఫూర్తి మా నాన్నే. ఆయన 1994 నుంచి వందల మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. ఒకే ఏడాదిలో వివిధ రంగాలకు చెందిన లక్ష మంది మహిళలకు ఉచితంగా ఆత్మరక్షణ మెళకువలు నేర్పి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. మాలో ఆత్మస్థైర్యం నింపి, ప్రపంచ స్థాయిలో నిలబెట్టాలనేది ఆయన కోరిక. నాన్న మాకు గురువు మాత్రమే కాదు... మార్గదర్శి కూడా.

అన్నీ రికార్డులే...

ప్రస్తుతం నేను బీకాం సెకండ్ ఇయర్ చదువుతున్నాను. చెల్లి బీకాం ఫస్ట్ ఇయర్. తమ్ముడు టెన్త్. మేము చదువుకొంటూనే కరాటే అభ్యాసం కూడా కొనసాగిస్తున్నాం. నేనూ, మా చెల్లి కలిసి చాలా కొత్త రికార్డులు సృష్టించాం. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏటా ఏదో ఒక రికార్డు ప్రదర్శన ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఒక్కో ఏడాది ఒక్కో థీమ్. ఒక ఏడాది 365 టైల్స్‌ను 365 సెకన్లలో పగులగొట్టాను. మరోసారి మేకులపై పడుకున్నా నా మీద గ్రైనేట్ రాయి పెడితే... మాస్టర్ దాన్ని పగులకొడతారు. ఒక్కో రాయి 150 నుంచి 220 కిలోల బరువు ఉంటుంది. అలా 36 రాళ్లు 3 నిమిషాల్లో బ్రేక్ చేయాలనేది మా ప్రయత్నం. కానీ రెండు సెకన్ల ముందే పూర్తయింది. తరువాత నేను, మా చెల్లి కలిసి ఒక ఫీట్ చేశాం. నా కింద, మీద మేకులు ఉంటాయి. నాపైనున్న మేకుల మీద చెల్లి పడుకుంటుంది. తనపై 60 నాపరాళ్లు ఒక్కొక్కటే పెట్టి బ్రేక్ చేయాలి. 3.05 నిమిషాల్లో సాధించాం. చెల్లి 85 సిరామిక్ టైల్స్‌ను 84 సెకన్లలో పంచ్‌తో పగులగొట్టింది. వీటిల్లో 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, సూపర్ కిడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'తో పాటు కొన్ని గిన్నిస్ రికార్డులు కూడా ఉన్నాయి. ఇవన్నీ అంతకముందు ఎవరూ చేయని ఫీట్స్.

నాదీ అదే కల...

అక్కలాగానే నాదీ అదే కల... ఒలింపిక్స్‌లో పాల్గొనాలి. సివిల్స్ ర్యాంకు సాధించి దేశానికి సేవ చేయాలి. అందుకే ఇటీవల మేం సాధించిన రికార్డును 'ఆపరేషన్ సిందూర్'కు అంకితం చేశాం. 2014లో, అంటే నాకు నాలుగున్నర ఏళ్లప్పుడు నాటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి నుంచి బహుముఖ ప్రజ్ఞగల బాలికగా 'బాలసూర్య' అవార్డు అందుకున్నాను. దాన్ని చూసినప్పుడు నా మనసు ఆనందంతో ఉప్పొంగుతుంది. స్ఫూర్తి రగులుతుంది. మరికొన్ని అవార్డులు కూడా తీసుకున్నాను. అలాగే ఐదేళ్లప్పుడు 39 నిమిషాల్లో 3,315సార్లు నెక్ రొటేట్ చేసి కొత్త రికార్డు నెలకొల్పాను. దీంతోపాటు మహిళా సాధికారత కోసం నావంతు బాధ్యతగా సాధ్యమైనంతమందికి కరాటే నేర్పించాలనేది నా సంకల్పం.

- ఘనసంతోషిణి



మరో ఘనత...

ఇటీవల మేం మరో రికార్డు సృష్టించాం. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 121 ఆత్మరక్షణ మెళకువల (సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్)ను 9.36 నిమిషాల్లో ప్రదర్శించాం. మేం అనుకున్నది 11 నిమిషాల్లో పూర్తి చేయాలని. కానీ దాదాపు ఒకటిన్నర నిమిషం ముందే పూర్తి చేయగలిగాం. కరాటేలోని ఒక్కో చాప్టర్‌లో 11 టెక్నిక్స్ ఉంటాయి. అలా 11 చాప్టర్స్‌లో 11 చొప్పున మొత్తం 121 ఆత్మరక్షణ మెళకువలను ఎంచుకున్నాం. మాలాగా అందరు అమ్మాయిల్లో ఆత్మస్థైర్యం నింపాలనేది ఈ ఫీట్ ఉద్దేశం. 'ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్', 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో ఇది నమోదైంది.

అంతర్జాతీయ క్రీడల్లోనూ...

నేను అంతర్జాతీయ కరాటే క్రీడాకారిణి కూడా. ఇటీవల మలేషియా, సింగపూర్‌లో జరిగిన టోర్నీల్లో పాల్గొన్నాను. అలాగే 'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్' గేమ్స్‌లోనూ పోటీపడ్డాను. ఎన్నో పతకాలు గెలిచాను. మా చెల్లి కూడా జాతీయ స్థాయి క్రీడాకారిణి. ఇప్పుడిప్పుడే అంతర్జాతీయ టోర్నీలకు వెళుతోంది. తను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మక 'బాలసూర్య' ప్రభుత్వ అవార్డు అందుకుంది.

ఒలింపిక్స్... సివిల్స్...

ప్రస్తుతం నా లక్ష్యం ఒలింపిక్స్‌లో పతకం. అన్ని క్రీడల్లానే 'అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ' (ఐఓసీ)కి అనుబంధంగా 'ప్రపంచ కరాటే సమాఖ్య' (డబ్ల్యూకేఎఫ్) ఉంది. సమాఖ్య టోర్నీల్లో విజయాలు సాధించినవారికి మాత్రమే ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. ఆ పోటీలకు వెళ్లాలంటే ఇరవై ఏళ్లు నిండి ఉండాలి. వయసు పరంగా ఇప్పుడే నేను అర్హత సంపాదించాను. వాటిల్లో మంచి ప్రదర్శన కనబరిచి దేశం తరుపున ఒలింపిక్స్ ఆడాలన్నదే నా సంకల్పం. రెండేళ్లుగా నేను కరాటేలో శిక్షణ కూడా ఇస్తున్నా. సాధ్యమైనంత మంది మహిళలకు ఆత్మరక్షణ మెలకువలు నేర్పించి, వారిని శక్తిమంతులుగా చేయాలనే లక్ష్యంతోనే శిక్షణ ప్రారంభించాను. సివిల్స్‌లో ర్యాంకు సాధించి దేశానికి సేవ చేయాలనేది నా కల. నా కలలు, లక్ష్యాలు నెరవేర్చుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాను."

సహనం అవసరం...

కరాటేకు ప్రధానంగా కావల్సింది సహనం. ఎలాగైనా నేర్చుకోవాలనే ఒక బలమైన సంకల్పం. లేదంటే ప్రయత్నం మధ్యలోనే ఆగిపోతుంది. సహనం అనుభవంతో వస్తుంది. నేర్చుకొనే క్రమంలో శారీరక దారుఢ్యం మెరుగవుతుంది. కరాటేలో వైట్ బెల్ట్ నుంచి బ్లాక్ బెల్ట్ వరకు 12 లెవెల్స్ ఉంటాయి. ప్రస్తుతం నేను, చెల్లి ఆఖరి లెవెల్ చేస్తున్నాం. ఇది పూర్తయితే మమ్మల్ని 'బ్లాక్ బెల్ట్ డాన్' అంటారు. ఆత్మరక్షణ కోసం అయితే రోజుకు గంట సాధన సరిపోతుంది. మేమైతే ఆరేడు గంటలు సాధన చేస్తున్నాం. నేర్చుకొంటూ... నేర్పిస్తున్నాం. శిక్షణ తీసుకొనేవారే కాదు, యువత అంతా జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి. జంక్‌ఫుడ్ వల్ల హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. అమ్మాయిలకు చెప్పేదేంటంటే... ప్రతిఒక్కరూ కచ్చితంగా కరాటే నేర్చుకోండి. దానివల్ల మీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఫిట్‌నెస్ మెరుగవుతుంది. మనలో భయాలను పోగొడుతుంది. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొని, ఆత్మస్థైర్యంతో మనల్ని మనం రక్షించుకోగలుగుతాం. వేరొకరి సాయం కోసం ఎదురుచూడక్కర్లేదు. నా బలం అదే... ఆత్మవిశ్వాసం."

• హనుమా

అల్లం తాజాగా..!

మనం తరచూ అల్లాన్ని ఉపయోగిస్తూ ఉంటాం. అల్లం తాజాగా ఉంటేనే వంటకాల రుచి పెరుగుతుంది. అలాగే శరీరానికి ఆరోగ్యం చేకూరుతుంది. బజారు నుంచి కొని తెచ్చిన తరవాత సరైన పద్ధతిలో నిల్వ చేయకపోతే అల్లం త్వరగా చెడిపోతుంది. అలాకాకుండా అల్లాన్ని నిల్వ చేసే విధానాల గురించి తెలుసుకుందాం...



- అల్లాన్ని నిల్వ చేసేముందు దాన్ని నీళ్లతో శుభ్రంగా కడిగి నీడలో ఆరబెట్టాలి. తేమ ఎక్కువగా లేకుండా పొడిగా ఉండేలా చూసుకోవాలి.
- శుభ్రంగా, పొడిగా ఉన్న అల్లాన్ని ఒక కాగితంలో చుట్టి గాలి చొరబడని డబ్బాలో ఉంచి ఫ్రిజ్‌లో పెడితే నెల రోజుల పాటు నిల్వ ఉంటుంది. అదే గాలి ఆడేలా ఒక ప్లాస్టిక్ బుట్టలో పెడితే పది రోజులు వాడుకోవడానికి వీలుగా ఉంటుంది.
- పేపర్ టవల్‌ను నీళ్లతో కొద్దిగా తడపాలి. దానితో అల్లాన్ని చుట్టి ప్లాస్టిక్ కవర్‌లో ఉంచి ఫ్రిజ్‌లో పెడితే అల్లం తేమతో తాజాగా ఉంటుంది.
- అల్లాన్ని తడి మట్టితో కప్పి ఉంచితే ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. మట్టి తడారిపోకుండా రెండు రోజులకు ఓసారి నీళ్లు చల్లుతూ ఉండాలి. పూర్వం ఈ పద్ధతినే అనుసరించేవారు.
- అల్లాన్ని చిన్న ముక్కలుగా తరిగి లేదంటే తురుముకుని జిప్‌లాక్ కవర్‌లో వేసి ఫ్రీజర్లో ఉంచితే ఆర్నెల్లు తాజాగా ఉంటుంది.
- తొక్కతీసి సన్నని ముక్కలుగా తరిగి ఎండలో ఆరబెట్టాలి. తేమ లేకుండా ఎండిన అల్లం ముక్కలను ఒక డబ్బాలో భద్రపరచుకుంటే ఏడాది పాటు వాడుకోవచ్చు.
- అల్లాన్ని సన్నగా తురిమి అందులో కొద్దిగా ఉప్పు, పసుపు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గాజు సీసాలో నింపి గట్టిగా మూత బిగించి ఫ్రిజ్‌లో పెడితే నెల రోజులు తాజాగా ఉంటుంది.
- అల్లాన్ని పెద్ద మొత్తంలో నిల్వ చేయాల్సి వచ్చినప్పుడు దాన్ని ఒక గాజు సీసాలో వేసి పైన తగినంత వెనిగర్ లేదా తేనె వేసి ఉంచితే చాలు. దీనివల్ల అల్లం తాజాగా ఉండడమే కాకుండా దానిలోని ఔషధ గుణాలు పెరుగుతాయి.

చిన్న వయసులో పెద్ద మనసు

స్ఫూర్తి

దాచుకున్న డబ్బుతో పిల్లలు బొమ్మలు, చాక్లెట్లు కొనుక్కుంటారు. కానీ మేఘాలయకు చెందిన ఏడేళ్ల ఆభా నోంగ్రమ్, పొదుపు చేసిన డబ్బుతో క్షయ రోగుల కోసం పోషకాహార కిట్లను సేకరించడం మొదలుపెట్టింది. చిన్న వయసుతో పెద్ద మనసుతో ఆలోచించిన ఆ పాప కథనమిది.



క్షయ వ్యాధిని సమూలంగా తరిమికొట్టాలనే లక్ష్యంతో అలుపెరగని పోరాటానికి పూనుకున్న దేశం మనది. ఎన్ని ఆరోగ్య సేవలను అందించినా, ఎన్ని అవగాహనా కార్యక్రమాలు చేపట్టినా ఈ వ్యాధి ఇప్పటికీ ప్రజల ఆరోగ్యాలను కుదేలు చేస్తూనే ఉంది. సమర్థమైన మందులు ఉన్నప్పటికీ, తగిన పోషకాహారం కరవవడంతో ఈ వ్యాధి, ఏళ్ల తరబడి వేధిస్తూ, రోగులను మరణానికి చేరువ చేస్తోంది. ఈ విషయాన్ని గ్రహించిన రెండో తరగతి చదువుతున్న ఆభా, వ్యాధి నుంచి కోలుకోవడానికి తోడ్పడే పోషకాహారాన్ని క్షయ రోగులకు అందించాలనుకుంది. ఈ సంకల్పంతో తల్లితండ్రులు, బంధువులు ఇచ్చే జేబు డబ్బును పొదుపు చేసి, క్షయ రోగులకు పంచడం కోసం న్యూట్రిషన్ కిట్లను కొనుగోలు చేయడం మొదలుపెట్టింది.

ముఖ్యమంత్రి దృష్టిని ఆకర్షించి...

ఏదో ఒకనాటికి క్షయ రోగులను ప్రత్యక్షంగా కలుస్తాననే ఆశతో పోషకాహార మద్దతును అందించడంతో పాటు, క్షయ వ్యాధి వ్యతిరేక పోరాటంలో తన వంతుగా సహాయపడుతోంది ఆభా. ఈ పాప ప్రయత్నం మేఘాలయ ముఖ్యమంత్రి కొన్రాడ్ కె. సంగ్మాను కూడా ఆకర్షించింది. సంగ్మా, ఆభా కథను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడమే కాకుండా ఈ పాపను ఒక రోల్ మోడల్‌గా అభివర్ణించారు. "మేఘాలయకు చెందిన యువ క్షయ హీరోను కలవండి. ఏడేళ్లకే ఆభా నంగ్రమ్, తన జేబు డబ్బుతో న్యూట్రిషనల్ ప్యాక్‌లతో క్షయ రోగులకు సహాయపడుతోంది" అంటూ సామాజిక మాధ్యమాల్లో ఆభా మీద ప్రశంసలు కురిపించారు. రెండో తరగతి విద్యార్థిని ఆభా, మారథాన్ విజేత, తైక్వాండో ఛాంపియన్ కూడా! ఈ పాప తైక్వాండోలో రాష్ట్ర స్థాయిలో రజత పతకాన్ని సాధించింది. ఐదేళ్ల వయసుకే మారథాన్‌లో గెలుపొందింది.

వేల మంది ప్రతిన పూని...

దేశ వ్యాప్తంగా 2,54,000 మంది నిక్షయ్ మిత్రలు ఉన్నారు. వీరిలో ఆభాతో సహా మరో 314 మంది మేఘాలయలోనే ఉన్నారు. వీళ్లందరూ క్షయ రోగుల మద్దతుకు సమిష్టిగా ప్రతిజ్ఞ పూనారు. క్షయ వ్యాధి పట్ల సమాజంలో నెలకొని ఉన్న అపోహలు, భయాలు తొలగి, క్షయ రహిత భారత దేశం దిశగా సాగించే పోరాటంలో సమాజ భాగస్వామ్యం ప్రాముఖ్యతను వీళ్లందరూ చాటుతూ ఉండడం విశేషం.

బొద్దింకలను వదిలించుకోండి ఇలా...



ఒక్కోసారి ఇంట్లో బొద్దింకలు విపరీతంగా పెరిగిపోతూ ఉంటాయి. రాత్రి కాగానే ఇల్లంతా పాకుతూ ఆహారపదార్థాల మీద కూడా చేరుతూ ఉంటాయి. బజారు నుంచి తెచ్చిన రసాయనిక మందులు పిచికారీ చేసినప్పటికీ ఈ సమస్య పూర్తిగా తీరదు. అలాకాకుండా మన ఇంట్లో దొరికే వస్తువులతో చిన్న చిట్కాలు పాటించి ఈ బొద్దింకల బెడద నుంచి తప్పించుకోవచ్చు.

- ఒక బకెట్ నీళ్లలో రెండు చెంచాల బోరాక్స్ పౌడర్, రెండు చెంచాల బేకింగ్ సోడా, మూడు చెంచాల పంచదార వేసి బాగా కలపాలి. ఈ నీళ్లను స్ప్రే బాటిల్‌లో పోసి రాత్రిపూట బొద్దింకలు ఎక్కువగా తిరిగే వంటగది, డైనింగ్ టేబుల్, బాత్‌రూమ్‌ల దగ్గర పిచికారీ చేయాలి. తెల్లారిన తరవాత ఈ ప్రదేశాలను తడిగుడ్డతో తుడిచి శుభ్రం చేసుకోవాలి. ఇలా నాలుగు రోజులు చేస్తే బొద్దింకల సమస్య తగ్గుతుంది.
- ఒక గిన్నెలో రెండు చెంచాల బోరిక్ యాసిడ్, మూడు చెంచాల మైదా పిండి వేసి బాగా కలపాలి. ఇందులో కొన్ని నీళ్ల చుక్కలు చల్లుతూ గట్టిగా కలిపి చిన్న ఉండలు చేయాలి. వీటిని గాలికి ఆరబెట్టాలి. ఈ ఉండలను బొద్దింకలు ఎక్కువగా తిరిగే చోట మూలల్లో ఉంచాలి. రెండు రోజుల్లో ఇంట్లో ఉన్న బొద్దింకలన్నీ చనిపోతాయి. ఇంట్లో చిన్న పిల్లలు ఉన్నవారు.... ఈ చిట్కాను పాటించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల దాల్చిన చెక్క పొడి, ఒక చెంచా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ పొడిని వంటగది అరల్లో కొద్దిగా చల్లితే బొద్దింకలు బయటికి వెళ్లిపోతాయి.
- బొద్దింకలు తిరిగే చోటా కొద్దిగా హెయిర్‌స్ప్రే చల్లినా ఫలితం ఉంటుంది. పడకగది, పిల్లలు చదువుకునే గది మూలల్లో రెండు లవంగాలు లేదంటే బిరియానీ ఆకు ముక్కలు ఉంచితే బొద్దింకలు లోపలికి రావు.

ఇక చెన్నై పెట్రోలియం..
పెట్రోల్ పంపులు

రూ.400 కోట్ల పెట్టుబడి

తొలుత తమిళనాడులో ఏర్పాటు

చెన్నై: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) అనుబంధ సంస్థ చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (సీపీసీఎల్) రిటైల్ ఇంధన విక్రయ విభాగంలోకి అడుగుపెడుతోంది. వ్యాపార విస్తరణలో భాగంగా.. పెట్రోల్, డీజిల్ విక్రయాల కోసం సొంతంగా రిటైల్ పంపులు ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హెచ్ శంకర్ వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ కోసం వచ్చే రెండు మూడేళ్లలో రూ.400 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన చెప్పారు. సంస్థ డైమండ్ జూబ్లీ సందర్భంగా ఈ ఏడాదే తొలి పెట్రోల్ పంపును ప్రారంభించాలని చూస్తున్నట్లు ఆయన తెలిపారు. పెట్రోల్ పంపుల ఏర్పాటుకు సీపీసీఎల్ ఇప్పటికే కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు పొందింది. తొలుత ఈ పంపులను తమిళనాడులో ప్రారంభించి ఆ తర్వాత దేశవ్యాప్తంగా విస్తరించాలని చూస్తున్నట్లు పేర్కొన్నారు.

ముంబైలో టెస్లా భారీ గిడ్డంగి

ముంబై: విద్యుత్ కార్ల తయారీలోని టెస్లా అనుబంధ సంస్థ టెస్లా ఇండియా మోటార్ అండ్ ఎనర్జీ ముంబైలోని లోధా లాజిస్టిక్స్ పార్కులో 24,565 చదరపు అడుగుల విస్తీర్ణం గల గిడ్డంగి స్థలాన్ని లీజుకు తీసుకుంది. దీని నెలవారీ అద్దె రూ.37.53 లక్షలని డేటా అనలిటిక్స్ సంస్థ సీఆర్ఈ మ్యాట్రిక్స్ తెలిపింది. ఏటా 5%అద్దె పెంపు అంగీకారంతో టెస్లా ఈ స్థలాన్ని 5ఏళ్ల కాలానికి లీజుకు తీసుకున్నట్టు తెలిపింది.



పసిడి ర్యాలీకి బ్రేక్?

15% వరకు తగ్గనున్న ధర
క్వాంటమ్ ఎంఎఫ్ అంచనా

న్యూఢిల్లీ: పసిడి ర్యాలీకి బ్రేక్ పడే సూచనలు కనిపిస్తున్నాయి. వచ్చే రెండు నెలల్లో డాలర్లపరంగా పసిడి ధర 12 నుంచి 15 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని క్వాంటమ్ మ్యూచువల్ ఫండ్ తన నెలవారీ నివేదికలో తెలిపింది. మంగళవారం అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి పసిడి ధర 3,350 డాలర్ల వద్ద ట్రేడైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రికార్డు స్థాయిలో నమోదైన 3,500 డాలర్లతో పోలిస్తే ఇది 150 డాలర్లు తక్కువ. భారత మార్కెట్లోనూ ఏప్రిల్‌లో రూ.లక్ష ఎగువన ట్రేడైన 10 గ్రాముల మేలిమి బంగారం ప్రస్తుతం రూ.లక్ష దిగువన ట్రేడవుతోంది. అయితే మధ్య, దీర్ఘకాలిక పెట్టుబడులకు మాత్రం బంగారం ఇప్పటికీ ఆకర్షణీయంగానే కనిపిస్తోందని క్వాంటమ్ ఎంఎఫ్ తన నివేదికలో తెలిపింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మధ్య, దీర్ఘకాలిక లాభాల కోసం చూసే మదుపరులు తమ పెట్టుబడుల్లో ఎంతో కొంత పసిడిలో మదుపు చేయడం మంచిదని సూచించింది.

ధర పతనానికి కారణాలు

- ప్రధాన కరెన్సీలతో పుంజుకుంటున్న డాలర్ మారకం రేటు
- అమెరికా-చైనా సుంకాల యుద్ధం ముగుస్తుందనే అంచనాలు
- కొనసాగుతున్న లాభాల స్వీకరణ అమ్మకాలు

విద్యాలక్ష్మి పథకంపై వడ్డీ 0.20% తగ్గింపు

పీఎన్‌బీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) విద్యాలక్ష్మి పేరిట అందిస్తున్న విద్యా రుణాలపై వడ్డీ రేటును 0.20 శాతం మేరకు తగ్గించింది. ఈ తగ్గింపుతో ఈ పథకంపై కనీస వడ్డీ 7.5 శాతానికి తగ్గుతుంది. విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలన్న తమ కట్టుబాటుకు ఇది నిదర్శనమని పీఎన్‌బీ తెలిపింది. దేశంలో అత్యున్నత నాణ్యత గల విద్యను అందిస్తున్న 860 విద్యా సంస్థల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఇది అందుబాటులో ఉంటుంది.

భారత్‌లో పన్నుల భారం ఎక్కువ

ఎయిర్‌పోర్టు చార్జీలూ ఎక్కువే
ఐఏటీఏ చీఫ్ విల్లీ వాల్ష్



న్యూఢిల్లీ: భారత విమానయాన రంగంపై ప్రభుత్వం విధిస్తున్న పన్నులపై ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) ఆందోళన వ్యక్తం చేసింది. పన్నుల నిర్వచనంలోనూ స్పష్టత లేకుండా పోతోందని ఐఏటీఏ వార్షిక సదస్సుకు హాజరైన ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ తెలిపారు. ఈ విషయంలో స్పష్టత ఏర్పడితే తప్ప భారత్‌లో విమానయాన రంగం తన శక్తికి తగ్గట్టు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందే అవకాశం లేదని స్పష్టం చేశారు. భారత విమానాశ్రయాల్లో వసూలు చేస్తున్న చార్జీలపైనా వాల్ష్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలో మరే దేశంలోనూ భారత ఎయిర్‌పోర్టుల్లో ఉన్నన్ని చార్జీలు లేవన్నారు. ఈ చార్జీలు విమానయాన సంస్థలకు భారం కాని స్థాయిలో ఉండాలన్నారు. ఇన్ని సమస్యలు ఉన్నా భారత్‌లో విమానయాన రంగం వేగంగా విస్తరిస్తోందన్నారు. ఈ విషయంలో భారత్ త్వరలోనే చైనాను మించిపోతుందని వాల్ష్ స్పష్టం చేశారు.

అద్భుత అవకాశాలు: వర్జిన్ అట్లాంటిక్

విమానయానానికి సంబంధించి భారత్ అద్భుత అవకాశాల గని అని బ్రిటన్ కేంద్రంగా పనిచేసే వర్జిన్ అట్లాంటిక్ విమానయాన సంస్థ తెలిపింది. భారత-బ్రిటన్ ఎఫ్‌టీఏ నేపథ్యంలో సరుకు రవాణ కోసం భారత్‌కు మరిన్ని విమాన సర్వీసు ప్రారంభించబోతున్నట్టు ఆ సంస్థ సీఈఓ షాయ్ వీస్ చెప్పారు. అమెరికా తర్వాత ప్రస్తుతం భారత్ తమకు అతిపెద్ద మార్కెట్ అన్నారు.

భారత్ నుంచి ప్రస్తుతం ఏటా తమ విమానాల ద్వారా 10 లక్షల మంది ప్రయాణిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. తన సాంకేతిక వ్యవస్థలను ఏఐ ఆధారిత సొల్యూషన్స్‌తో ఆధునీకరించేందుకు వర్జిన్ అట్లాంటిక్ సంస్థ టీసీఎస్‌తో ఐఏటీఏ సదస్సు సందర్భంగా ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్య ఒప్పందం ఏడేళ్ల పాటు అమల్లో ఉంటుంది.

మార్కెట్లోకి టాటా హారియర్ ఈవీ

ప్రారంభ ధర రూ.21.49 లక్షలు



ముంబై: టాటా మోటార్స్. మార్కెట్లోకి హారియర్ ఈవీని తీసుకువచ్చింది. ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఒకసారి చార్జింగ్‌తో 500 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. హారియర్ ఈవీ ప్రారంభ ధర రూ.21.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్). జూలై 2వ తేదీ నుంచి దీని బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. నెలకి 25,000 వాహనాలు అమ్ముడుపోతున్న ప్రీమియం ఎస్‌యూవీ విభాగంలో కస్టమర్లను ఆకర్షించేందుకు ఇది సహాయకారి అవుతుందని ఈ కారు విడుదల సందర్భంగా టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ శైలేష్ చంద్ర అన్నారు. హారియర్ ఈవీతో ఆఫ్ రోడ్ ప్రయాణాలపై ఆసక్తి గల కొత్త శ్రేణి కస్టమర్లను తాము ఆకర్షించ వచ్చని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇది ఆల్ వీల్ డ్రైవ్, 504 నానోమీటర్ల టార్క్‌తో అందుబాటులోకి వస్తోందని ఆయన అన్నారు. హారియర్.ఈవీ 75 కిలోవాట్ ఆప్షన్ సహా రెండు బ్యాటరీ ప్యాక్‌లతో అందుబాటులో ఉంటుంది. ఈ బ్యాటరీ ప్యాక్‌లకు జీవితకాల వారెంటీ ఇస్తున్నట్టు కంపెనీ తెలిపింది. ఆటో పార్క్ అసిస్ట్, 6 టెరైన్ మోడ్, 55 కనెక్టెడ్ ఫీచర్లు హారియర్.ఈవీ ప్రత్యేకతలు. కేవలం 6.3 సెకన్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని వెల్లడించింది.

వలసలపై ఉద్యోగుల ఆసక్తి

కొత్త బాధ్యతల కోసం పరుగులు

మైఖెల్ పేజ్ ఇండియా

న్యూఢిల్లీ: మన దేశంలోనూ ఉద్యోగుల అభిరుచులు మారిపోతున్నాయి. గతంలోలా ఉన్న ఉద్యోగాన్నే పట్టుకుని వేలాడేందుకు పెద్దగా ఇష్టపడడం లేదు. మంచి, కొత్త బాధ్యతలు, ఉద్యోగాల నిర్వహణలో వెసులుబాటు కోసం చూస్తున్నారు. పని చేస్తున్న కంపెనీల్లో ఈ అవకాశాలు లేకపోతే అందుకు అవకాశాలు కల్పించే కంపెనీలకు మారిపోవడానికి ఏ మాత్రం వెనకాడడం లేదు. మైఖెల్ పేజ్ ఇండియా అండ్ సింగపూర్ సంస్థ ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. దేశవ్యాప్తంగా దాదాపు 3,000 మంది వృత్తి నిపుణులను సర్వే చేసి ఈ నివేదికను రూపొందించింది. దీంతో ఈ సంవత్సరం 62 శాతం మంది నిపుణులు, ఉన్న కంపెనీల్లోనే జీతాలు పెంచుకుంటే, 37 శాతం మంది ప్రమోషన్లు సంపాదించుకోగలిగారు. ప్రస్తుత ఉద్యోగుల్లో ఎక్కువ మంది ఉద్యోగ భద్రత కంటే ప్రమోషన్లు, జీతాలు, పనిలో వెసులుబాటుకు ప్రాధాన్యత ఇస్తున్నారని మైఖెల్ పేజ్ ఇండియా సంస్థ సీనియర్ ఎండీ నిలయ్ ఖండేల్‌వాల్ చెప్పారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,060 ▲	90,800 ▲	1,11,100 ▲
విజయవాడ	1,00,300 ▲	94,000 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	99,910 ▲	90,800 ▲	1,11,100 ▲
రాజమండ్రి	99,050 ▲	90,800 ▲	1,03,200 ▲
ప్రొద్దుటూరు	97,000 ▲	89,240 ▲	1,00,500 ▲
ముంబై	96,867 ▲	88,730 ▲	1,00,460 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	109
వరంగల్	105	గుంటూరు	112
కరీంనగర్	105	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	100
కర్నూలు	105	నెల్లూరు	105
విశాఖపట్నం	101	అనంతపురం	105
గోదావరి	109		

81,000 దిగువకు సెన్సెక్స్

మూడో రోజూ నష్టాల బాటలోనే..

ముంబై: విదేశీ నిధుల తరలింపు, పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ అస్థిరతల నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్ వరుసగా మూడో రోజు కూడా నష్టాలతో ముగిసింది. ఎనర్జీ, ఫైనాన్స్, ఐటీ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకారానికి పాల్పడ్డారు. మంగళవారం రోజంతా ఆటుపోట్లతో సాగిన ట్రేడింగ్‌లో సెన్సెక్స్ మరో 636.24 పాయింట్లు నష్టపోయి 80,737.51 వద్ద స్థిరపడగా నిఫ్టీ 174.10 పాయింట్ల నష్టంతో 24,542.50 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 798.66 పాయింట్ల మేరకు దిగజారి కనిష్ఠ స్థాయి 80,575.09ని తాకింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.52%, స్మాల్‌క్యాప్ సూచీ 0.07% నష్టపోయాయి. కమోడిటీస్, రియల్టీ మినహా విభాగాల వారీ సూచీలన్నీ నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ షేర్లలో మహీంద్రా అండ్ మహీంద్రా మినహా మిగతా 29 షేర్లు నష్టాల్లోనే ముగిశాయి.

నష్టాల్లో అదానీ షేర్లు: అదానీ గ్రూప్‌పై మరోసారి ఆరోపణలు చెలరేగిన నేపథ్యంలో ఆ గ్రూప్ షేర్లు నష్టాల బాట పట్టాయి. అదానీ పోర్ట్స్ 2.42%, ఎన్‌డీటీవీ 2.25%, అదానీ ఎనర్జీ 2.18%, అదానీ పవర్ 2.02% నష్టపోయాయి. నష్టాలతో ముగిసిన ఇతర షేర్లలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ (1.89%), అదానీ టోటల్ గ్యాస్ (1.62%), అదానీ గ్రీన్ (.158%), సంఘీ ఇండస్ట్రీస్ (1.16%), అంబుజా సిమెంట్ (.088%), ఏసీసీ (0.22%), ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ (0.06%) ఉన్నాయి.

6 ఐపీఓలకు సెబీ అనుమతి: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధ సంస్థ అయిన హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సహా 6 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలు జారీ చేయడానికి సెబీ అనుమతి ఇచ్చింది. ఈ అనుమతి పొందిన ఇతర కంపెనీల్లో విక్రమ్ సోలార్, డోర్ఫ్-కెటాల్ కెమికల్స్, ఏ-వన్ స్టీల్స్ ఇండియా, శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్, శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్ ఉన్నాయి. ఈ ఆరు కంపెనీలు కలిసి రూ.20,000 కోట్లు సమీకరించనున్నాయి.


- అపోలో మైక్రోసిస్టమ్స్. ప్రిఫరెన్షియల్ షేర్లు, వారంటీల జారీ ద్వారా రూ.416 కోట్లు సమీకరించినట్లు ప్రకటించింది. ప్రమోటర్ గ్రూప్, ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్, నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదిత్య కుమార్ హల్వాసియాలకు వీటిని జారీ చేయటం ద్వారా ఈ మొత్తాలను సమీకరించినట్లు తెలిపింది.

అమెరికా బీటీఏపై జర జాగ్రత్త

మన సాగుకు రక్షణ తప్పనిసరి: నీతి ఆయోగ్

న్యూఢిల్లీ: డొనాల్డ్ ట్రంప్ సుంకాల నేపథ్యంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కోసం అమెరికాతో జరుగుతున్న చర్చల్లో అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వాన్ని నీతి ఆయోగ్ కోరింది. దీనికి సంబంధించి తన సూచనలతో ఒక పత్రాన్ని విడుదల చేసింది. మన రైతాంగ జీవనోపాధికి కీలకమైన ఉత్పత్తులకు దిగుమతుల నుంచి రక్షణ తప్పనిసరి అని స్పష్టం చేసింది. లేకపోతే దేశంలో వీటి ధరల స్థిరీకరణ కూడా కష్టమవుతుందని హెచ్చరించింది. అయితే అదే సమయంలో మన దేశంలో కొరతగా ఉన్న వంటనూనెలు, నూనె గింజలు, పెద్దగా సాగు చేయని బాదం, పిస్తా, అక్రోట్ వంటి అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను జీరో లేదా తక్కువ దిగుమతి సుంకాలతో అనుమతించ వచ్చని సూచించింది. అమెరికా పౌల్ట్రీ ఉత్పత్తులను మాత్రం జీరో డ్యూటీతో అనుమతించ వద్దని కోరింది. సుంకేతర అడ్డంకుల (నాన్ టారిఫ్ బ్యారియర్స్) ద్వారానైనా ఈ దిగుమతులను అడ్డుకోవాలని నీతి ఆయోగ్ సూచించింది.

రాజాసాబ్ వచ్చేది అప్పుడే



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా హారర్ థ్రిల్లర్ 'రాజాసాబ్'. ఈ సినిమా అప్‌డేట్స్ కోసం కొంతకాలంగా వేయి కళ్లతో ఎదురుచూస్తున్న అభిమానులకు తియ్యటి కబురందించారు మేకర్స్. సినిమా డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ప్రకటిస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే ఈ నెల 16న టీజర్‌ను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. "మీ అందరికీ ప్రామిస్ చేసినట్లే మీరు చూడాలనుకుంటున్న విధంగా ప్రభాస్‌ను వెండితెరపై చూస్తారు. ఆ రోజు అభిమానులకు పండగే. మీలో జోష్ నింపేందుకు మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి" అని పేర్కొన్నారు. కాలిపోతున్న డబ్బుల కట్టల ముందు నిల్చున్న ప్రభాస్ స్టిల్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్ కథానాయికలు.

మంచి చిత్రాన్ని అందించారు

ఇళయరాజా



ఇటీవలె విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతున్న చిత్రం 'షష్ఠిపూర్తి'. ఇళయరాజా సంగీతం అందించి సినిమా విజయంలో కీలక పాత్ర పోషించారు. మంగళవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా 'షష్ఠిపూర్తి' టీమ్ ఆయనను చెన్నైలో కలిసి శుభాకాంక్షలు తెలిపింది. డా.రాజేంద్రప్రసాద్ ఇళయరాజాకు పుష్పాభిషేకం చేశారు. ఇలాంటి మంచి సందేశం ఉన్న సినిమాను ప్రేక్షకులకు అందించినందుకు చిత్రబృందాన్ని అభినందించారు ఇళయరాజా. కాగా, రాజేంద్రప్రసాద్, రూపేశ్, అర్చన, ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని పవన్‌ప్రభ తెరకెక్కించారు.


తొలి ప్రేమే తోపు కాదే!



కిరణ్ అబ్బవరం, శ్రీగౌరి ప్రియ జంటగా రూపుదిద్దుకుంటున్న చిత్రానికి 'చెన్నై లవ్‌స్టోరీ' అనే టైటిల్ ఖరారు చేశారు. రవి నంబూరి దర్శకత్వంలో సాయిరాజేశ్, ఎస్కేఎన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్, గ్లింప్స్‌ని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా విడుదల చేశారు. 'తొలి ప్రేమేం తోపు కాదు.. ఫస్ట్ లవ్ ఫెయిలైతే బెస్ట్ లవ్ ఎక్కడో మొదలవుతుంది' అని చెబుతూ సాగిన గ్లింప్స్ ఆకట్టుకుంటోంది. అంతం వరకూ అనంతమై సాగే ఈ జీవితంలో తొలి ప్రేమ ఒక మజిలీ మాత్రమే అనీ, అదే తుది కాదనే కాన్సెప్ట్‌ను ఈ గ్లింప్స్ ద్వారా మేకర్స్ అందంగా తెలియజేశారు. ఈ గ్లింప్స్‌కు 'తొలి ప్రేమే తోపు కాదే తోపు కాదే..' అంటూ సంగీత దర్శకుడు మణిశర్మ బీజీఎం కంపోజ్ చేశారు.

ఆ నలుగురే కారణం

ప్రతాని రామకృష్ణ గౌడ్



తెలుగు చిత్ర పరిశ్రమలో మొదలైన థియేటర్ల సమస్యకు ఇండస్ట్రీలోని నలుగురు వ్యక్తులే కారణమని, వారే తమ స్వార్థంతో థియేటర్స్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను నాశనం చేస్తున్నారని టీఫ్‌సీసీ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆరోపించారు. టీఫ్‌సీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'గద్దర్ అవార్డుల్లో తెలంగాణ కళాకారులకు, సాంకేతిక నిపుణులకు అన్యాయం జరిగింది. నేను 1992లో ఇండస్ట్రీకి వచ్చాను. 2002 వరకు థియేటర్లలో పర్సంటేజీ విధానం ఉండేది. ఆ తర్వాత కొందరు తమ స్వార్థంతో రెంట్ సిస్టమ్ మొదలు పెట్టారు. ఏపీలో థియేటర్ల వ్యవస్థ ప్రక్షాళనకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీసుకుంటున్న చర్యలను అభినందిస్తున్నాం' అని అన్నారు.

థగ్‌లైఫ్.. కమల్‌హాసన్ పారితోషికం ఎంత?



చెన్నైలో జరిగిన 'థగ్‌లైఫ్' ఆడియో వేడుకలో కన్నడ భాష గురించి కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు.. ఆ తర్వాత కర్ణాటకలో జరిగిన పరిణామాల గురించి తెలిసిందే. దీంతో ఈ సినిమాను ప్రస్తుతానికి కర్ణాటకలో విడుదల చేయకూడదని నిర్ణయించుకున్నారు హీరో, చిత్ర నిర్మాతల్లో ఒకరైన కమల్‌హాసన్. ఈ విషయాన్ని ఆయన హైకోర్టుకు తెలిపారు. అయితే ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో క్రేజ్ ఏ మాత్రం తగ్గట్లేదు. 'నాయకుడు' సినిమా తర్వాత 38 ఏళ్లకు కమల్ హాసన్, మణిరత్నం కలయికలో తెరకెక్కిన చిత్రం కావడంతో అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ సినిమా ఏ స్థాయిలో ఉండబోతోందో హింట్ ఇచ్చాయి. దీంతో సినిమాను తొలిరోజే చూడడానికి సిద్ధమవుతున్నారు సినీ ప్రియులు. అడ్వాన్స్ బుకింగ్స్‌లో జోరు చూపిస్తోందీ చిత్రం. ఆన్‌లైన్‌లో టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. ఈ జోరు చూస్తుంటే ఈ ఏడాదిలో ఇంత వరకూ వచ్చిన సినిమాల కంటే 'థగ్‌లైఫ్' అత్యధిక ఓపెనింగ్స్‌ను తెచ్చుకునే అవకాశాలు ఉన్నాయంటున్నారు ట్రేడ్ పండితులు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన బడ్జెట్, నటీనటుల పారితోషికాల వివరాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

బడ్జెట్.. నటీనటుల పారితోషికాలు

కమల్‌హాసన్, మణిరత్నం సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్ర బడ్జెట్ దాదాపు రూ.300 కోట్లు అని తెలుస్తోంది. ఈ చిత్రానికి వారిద్దరూ ప్రత్యేకంగా పారితోషికాలు తీసుకోలేదు. ఈ సినిమా విడుదల తర్వాత వచ్చిన లాభాల్లో వాటాను పంచుకోనున్నారు. శింబు రూ.40 కోట్ల పారితోషికాన్ని అందుకున్నారని తెలిసింది. త్రిష రూ.12 కోట్లు తీసుకున్నారని సమాచారం. ఇది ఇంతకు ముందు ఆమె నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రం కంటే మూడింతలు ఎక్కువని టాక్. అలాగే, ఇందులో కీలక పాత్రలు పోషించిన జోజు జార్జ్, అశోక్ సెల్వన్, అభిరామి కూడా మంచి మొత్తాన్నే అందుకున్నారట. ఈ గ్యాంగ్‌స్టర్ థ్రిల్లర్ ఈ గురువారం ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ ద్వారా సుధాకర్ రెడ్డి విడుదల చేస్తున్నారు.

అవయవ మార్పిడుల పెంపు

» ట్రాన్స్‌ప్లాంటేషన్లపై సర్కార్ నిర్ణయం

» మూడు పెద్దాస్పత్రుల్లో ప్రత్యేక విభాగాలు

» నిమ్స్, గాంధీ, ఉస్మానియాల్లో ఏర్పాటు

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెద్దాస్పత్రుల్లో అవయవ మార్పిడులను పెంచాలని సర్కారు భావిస్తోంది. ఇందుకోసం సర్కారు దవాఖానాల్లో ప్రత్యేక అవయవ మార్పిడి విభాగ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. హైదరాబాద్‌లోని నిమ్స్, గాంధీ, ఉస్మానియా దవాఖానాల్లో వీటిని ఏర్పాటు చేయనుంది. తొలుత ప్రత్యేక అవయవ మార్పిడి సర్జరీ విభాగాన్ని ఏర్పాటు చేసి, విభాగాధిపతిని నియమించనున్నారు. ఆ తర్వాత వాటిలో కనీసం ఐదారు పోస్టుగ్రాడ్యుయేట్ సీట్ల కోసం జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ)కి దరఖాస్తు చేయనున్నారు. దాంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జన్ల సంఖ్య పెరగనుంది. సర్కారు దవాఖానాల్లో అవయవ మార్పిడి ఎలా పెంచాలన్న అంశంపై ఇటీవలే రాష్ట్ర వైద్య అధికారుల బృందం గుజరాత్‌లోని గట్స్ (గుజరాత్ యూనివర్సిటీ ఆఫ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సైన్సెస్)ను సందర్శించింది. అక్కడ అవయవ మార్పిడి, అలైడ్ సైన్సెస్, పీజీ సీట్లపై అధ్యయనం చేసింది. ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదించింది. రాష్ట్రంలోనూ స్పెషల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీ విభాగాన్ని ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖకు సిఫారసు చేసింది. ఈ మేరకు ఆ మూడు పెద్దాస్పత్రుల్లో అవయవ మార్పిడి విభాగాలను ఏర్పాటు చేయనున్నారు.

అనుకున్న స్థాయిలో జరగని మార్పిడులు

ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవయవ మార్పిడుల సంఖ్య అనుకున్న స్థాయిలో జరగడం లేదు.



ఒక్క నిమ్స్‌లో మాత్రమే కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు ఏటా 125 నుంచి 135 వరకు జరుగుతున్నాయి. మిగతా ఆస్పత్రుల్లో నామమాత్రంగానే ఈ సంఖ్య ఉంటోంది. అదే సమయంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో పెద్ద సంఖ్యలో అవయవ మార్పిడులు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు, ఇతర ఘటనల్లో క్షతగాత్రులై ఆస్పత్రుల్లో చేరి.. చికిత్స చేసినా కోలుకోని కేసుల సంఖ్య కూడా సర్కారు దవాఖానాల్లోనే ఎక్కువగా ఉంటోంది. ఇటువంటి కేసులు ప్రైవేటుకు వస్తే.. ప్రమాదానికి గురైన బాధితుల కుటుంబ సభ్యులతో చర్చించి, వారి అనుమతితో బ్రెయిన్ డెడ్ డిక్లేర్ చేస్తున్నారు. అనంతరం అవయవాలు తీసి అవసరమైన వారికి మార్పిడి చేస్తున్నారు. బ్రెయిన్ డెడ్ డిక్లేర్ చేసిన కేసుల్లో ఒక అవయవం 'జీవన్‌దాన్'కు వెళితే.. మిగతా అవయవాలు సంబంధిత ఆస్పత్రులకే చెందుతున్నాయి. ఆ ఆస్పత్రి తరఫున అవయవ మార్పిడి కోసం జీవన్‌దాన్‌లో రిజిస్టర్ చేసుకున్న వారికి కేటాయిస్తున్నారు. వాస్తవానికి ప్రమాద కేసులు తొలుత ప్రభుత్వ ఆస్పత్రులకే ఎక్కువగా వస్తుంటాయని, ఆ తర్వాత ప్రైవేటుకు వెళ్తుంటాయని ఓ వైద్యాధికారి తెలిపారు. సర్కారీ ఆస్పత్రుల్లో కూడా బ్రెయిన్ డెడ్ డిక్లరేషన్ చేస్తే.. అటువంటి కేసులతో వచ్చే ఆవయవాలన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆవయవ మార్పిడి కోసం జీవన్‌దాన్‌లో రిజిస్టర్ చేసుకున్న వారికి దక్కుతాయని నిపుణులు చెబుతున్నారు.

ప్రైవేటులో రూ.10-15 లక్షలు..

అవయవ మార్పిడి చేయించుకోవాలంటే ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.లక్షల్లో ఖర్చు అవుతోంది. ఉదాహరణకు కిడ్నీ మార్పిడి లాంటి వాటికైతే హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో వాటి స్థాయిని బట్టి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చవుతోంది. అదే నిమ్స్‌లో అయితే ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేస్తున్నారు. ప్రైవేటులో ఖర్చు తట్టుకోలేని మధ్యతరగతి, నిరుపేదలు సర్కారీ దవాఖానాల్లోనే జీవన్‌దాన్‌లో రిజిస్టర్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం జీవన్‌దాన్‌లో అవయవాల కోసం మొత్తం 16,569 మంది రిజిస్టర్ చేసుకున్నారు. అందులో ఒక్క కిడ్నీ కోసమే 8,044 మంది, కాలేయం కోసం 7,521 మంది రిజిస్టర్ చేసుకోగా, మిగతా వాటిలో గుండె, ఊపిరితిత్తులు, నేత్ర, క్లోమం (పాన్‌క్రియాస్) కోసం దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణలో 2013 నుంచి నేటి వరకు మొత్తం 5,323 అవయవ మార్పిడులు జరిగాయి.

ఏమిటీ గట్స్

గుజరాత్ యూనివర్సిటీ ఆఫ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సైన్సెస్ (గట్స్) కేవలం అవయవమార్పిడి కోసమే ఏర్పాటైన సంస్థ. ప్రపంచంలోనే తొలిసారి అవయవ మార్పిడి, అలైడ్ సైన్సెస్‌కు సంబంధించి ఏర్పాటైంది. ఇంకా చెప్పాలంటే నెఫ్రాలజీలో వినూత్నమైన పరిశోధనలు, వైద్యవిద్య, పరిశోధనల సమాహారమే ఈ గట్స్. ప్రధానంగా ట్రాన్స్‌ప్లాంటేషన్ సైన్సెస్‌లో అయా రకాల కోర్సులను ఈ యూనివర్సిటీ ఆఫర్ చేస్తోంది.

ట్రిపుల్ ఆర్‌లో భూమి పోతోందని..

గుండెపోటుతో రైతు మృతి

మొదటిసారి నోటీసులు ఇచ్చినప్పుడు తల్లి..

ఇప్పుడు తండ్రిని పోగొట్టుకున్న పిల్లలు

మర్కుక్/నర్సాపూర్/శివ్వంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఆర్ రహదారి నిర్మాణంలో భూమిపోతోందన్న ఆవేదనతో ఓ రైతు గుండెపోటుతో మృతి చెందారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం నరసన్నపేటలో మంగళవారం ఈ ఘటన జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎంబరి భిక్షపతి అనే రైతుకు ట్రిపుల్ ఆర్ నిర్మాణంలో భూమిపోతోందంటూ రెండు రోజుల కింద ఆర్డీవో కార్యాలయం నుంచి నోటీసులు అందాయి. దీనితో మనోవేదనకు గురైన భిక్షపతి మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. భూసేకరణకు సంబంధించి తొలిసారి నోటీసులు ఇచ్చిన సమయంలోనే భిక్షపతి భార్య గుండెపోటుతో మరణించారని స్థానికులు, బంధువులు చెబుతున్నారు. సుమారు రూ.2 కోట్ల విలువ చేసే భూమికి కేవలం రూ.6 లక్షల పరిహారం ఇస్తామంటే ఎలాగని ప్రశ్నించారు. తల్లిదండ్రులను కోల్పోయి ఇద్దరు పిల్లలు నిత్య (9) దీపిక (11) అనాథలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. భిక్షపతిది ప్రభుత్వ హత్యేనంటూ గ్రామస్థులు, బంధువులు ధర్నా చేశారు.

భూమికి పరిహారం రాలేదంటూ..

'కుటుంబ పోషణ,ఇతర అవసరాల కోసం రూ.20లక్షల వరకు అప్పు అయింది. ట్రిపుల్ ఆర్ రోడ్డు కింద పోయిన భూమికిచ్చే పరిహారంతో అప్పులు తీర్చుదామనుకుంటే ఆ డబ్బులు రావడం లేదు. మా మూడెకరాల భూమి ఆక్రమణకు గురైంది. అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదు. అప్పు తీర్చేమార్గం కనిపించక పురుగుల మందు తాగుతున్నా..' అంటూ మెదక్ జిల్లా కొత్తపేటలో కంచన్‌పల్లి చంద్రశేఖర్ అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేశారు. స్పందించిన స్థానికులు ఆయనను ఆస్పత్రికి తరలించారు.

రెవెన్యూ అధికారుల పల్లె బాట

పుష్కర కాలం తర్వాత గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

భూభారతి అమలులో భాగంగా 621 మండలాల్లో సభలు

జూన్ 20 వరకు ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఆగస్టు 15 నాటికి పరిష్కారం చూపేలా చర్యలు

హైదరాబాద్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పుష్కర కాలం తర్వాత రాష్ట్రంలో రెవెన్యూ అధికారులు మళ్లీ గ్రామాల బాట పట్టారు. భూభారతి చట్టం అమలులో భాగంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ భూసమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఉమ్మడి ఏపీలో 2012-13లో అప్పటి ప్రభుత్వ హయాంలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. 2014లో తెలంగాణ ఏర్పాటైన తర్వాత రెవెన్యూ అధికారులు గ్రామాలకు వెళ్లి సదస్సులు నిర్వహించింది లేదు. 'ధరణి' అమలులోకి తెచ్చిన సమయంలో 2022లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రతిపాదించినా అది కార్యరూపం దాల్చలేదు. 2017లో భూరికార్డుల ప్రక్షాళన పేరుతో 1బి రికార్డులో ఉన్న హక్కుదారులకు నోటీసులు ఇచ్చి వివరణ కోరారే తప్ప భూసమస్యలకు పరిష్కారం చూపేలా సదస్సులు పెట్టలేదు. ఇప్పుడు భూభారతి చట్టంఅమల్లో భాగంగా మళ్లీ ఇన్నేళ్లకు రెవెన్యూ అధికారులు గ్రామాల బాట పట్టారు. రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలో 621 మండలాలు ఉన్నాయి. 10,954 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఈ సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 32 మండలాల పరిధిలో ప్రయోగాత్మకంగా రెవెన్యూ సదస్సు లు నిర్వహించారు. మిగిలిన మండలాల్లో జూన్ 20 తేదీ వరకు సదస్సులు నిర్వహించి ప్రజలు నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

కేటగిరీ వారీగా దరఖాస్తుల స్వీకరణ

రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో న్యాయపరమైన చిక్కులు ఉన్న వాటిని మినహాయించి మిగిలిన భూవివాదాలకు ఆగస్టు 15 నాటికి పరిష్కారం చూపాలని ప్రభుత్వం అనుకుంది. దానికి అనుగుణంగానే ప్రస్తుతం కేటగిరీల వారీగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 76 కేటగిరీలుగా సమస్యలను విభజించారు. ధరణి అమలులోకి వచ్చిన సమయంలో సిద్దిపేట జిల్లా ములుగులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి కలెక్టర్, ఇతర రెవెన్యూ సిబ్బంది 15 రోజుల పాటు భూ సమస్యలపై అధ్యయనం చేశారు. సుమారు 270 సమస్యలు దృష్టికి రాగా అందులో 70 సమస్యలకు ధరణిలో పరిష్కార మార్గాలు లేవని గుర్తించారు. అలాంటి ఇబ్బందికి తావులేకుండా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ భూభారతి ద్వారా పరిష్కారం చూపాలని ప్రభుత్వం రెవెన్యూ అధికారులకు దిశానిర్దేశం చేస్తోంది. అయితే సాంకేతికంగా జటిలంగా ఉన్న భూసమస్యలను ఎలా పరిష్కరిస్తారో చూడాల్సి ఉంది. ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో సాదాబైనామా దరఖాస్తులు అధికంగా వస్తున్నాయి. వీటిపై న్యాయపరమైన చిక్కులు ఉన్నాయి. కోర్టు అనుమతించిన తర్వాత.. పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల దరఖాస్తుల్లో ఎన్నింటిని పరిష్కరిస్తారో చూడాల్సి ఉంది. కాగా, రెవెన్యూ సమస్యల పరిష్కారంపై 2008లో ప్రభుత్వం రెండు ఉత్తర్వులు ఇచ్చింది. వాటి ప్రకారం.. తమ దృష్టికి వచ్చిన భూసమస్యల్లో 50 శాతం సమస్యలను తహసీల్దార్ స్థాయి అధికారి క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించాలి. ఆర్డీవో స్థాయి అధికారి 25 శాతం సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయికి వెళ్లాలి. ఇప్పుడు ఇదే విధానం అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

కుల దూషణ, ఊరి బహిష్కరణ కేసులో..

15 మంది గ్రామస్థులు, వీడీసీ సభ్యులకు జైలు

» ఐదేళ్ల శిక్ష, రూ.5వేల జరిమానా విధించిన కోర్టు

నిజామాబాద్ లీగల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కులం పేరిట దూషించడంతో పాటు గ్రామ బహిష్కరణ చేసిన కేసులో నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం కొలిప్యాక్ గ్రామానికి చెందిన 15 మందికి ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం, పౌర హక్కుల పరిరక్షణ చట్టాల ప్రకారం జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ రెండో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. కొలిప్యాక్ గ్రామానికి చెందిన ఆరోళ్ల రుక్మవ్వ 2020 ఏప్రిల్ 22న లాక్‌డౌన్ సమయంలో భర్త, కుమారుడు, కూలీలతో కలిసి గ్రామ శివారులోని తన పొలంలోకి వెళ్లింది. అక్కడి నుంచి ట్రాక్టర్‌లో గడ్డి వేసుకొని ఇంటికి వచ్చే సమయంలో గ్రామస్థులైన మేకల బబ్లూ, మేకల భవానితో వివాదం జరిగింది. దీంతో గ్రామాభివృద్ధి సంఘం నాయకుడు తిరుపతి, ఇతర పెద్దలు పంచాయితీ నిర్వహించి రుక్మవ్వకు జరిమానా విధించారు. దీంతో ఆమె జక్రాన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిజామాబాద్ అసిస్టెంట్ సీపీ శ్రీనివాస్ కుమార్ విచారణ నిర్వహించి.. కోర్టులో చార్జ్‌షీట్ సమర్పించారు. విచారణలో భాగంగా 15 మంది సాక్షుల వాంగ్మూలాన్ని నమోదు చేసిన కోర్టు.. 15 మంది గ్రామస్థులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యుల(వీడీసీ)పై పలు రకాల ఆరోపణలు రుజువైనట్టు నిర్ధారించింది. వారిలో కొందరికి కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా.. మరికొందరికి మూడేళ్ల జైలు శిక్ష విధించింది.



ఉప్పొంగిన దేశభక్తి

ఐపీఎల్ ముగింపోత్సవంలో దేశభక్తి, జాతీయ భావం వెల్లువెత్తింది. 'సబ్‌సే ఆగే హోంగే హిందుస్థానీ', దుష్మన్‌కే చక్కే చుడాదే, హమ్ ఇండియావాలే' లాంటి పాటలతో స్టేడియం మొత్తం హుషారెత్తింది. సైన్యానికి సెల్యూట్ 'భారత భద్రతా దళాలకు ధన్యవాదాలు' లాంటి సందేశాలు స్టేడియంలోని డిజిటల్ బోర్డులపై ప్రముఖంగా డిస్‌ప్లే చేశారు. ప్రముఖ సింగర్ శంకర్ మహదేవన్, అతడి కుమారులు సిద్ధార్థ్, శివం తమ పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. లక్ష్య సినిమా సాంగ్స్‌తోపాటు రహమాన్ పాడిన 'వందే మాతరం'తో జోష్‌ను తారస్థాయికి తీసుకెళ్లారు. 'సబ్‌సే ఆగే హోంగే హిందుస్థానీ'తో కార్యక్రమాన్ని ముగించారు.

విరాట్.. విరాట్..



ఫైనల్ మ్యాచ్ కోసం స్టేడియానికి ఫ్యాన్స్ పోటెత్తారు. రికార్డు స్థాయిలో **90,871** మంది హాజరయ్యారు. స్టాండ్స్‌లో ఎక్కువగా బెంగళూరు జెర్సీలే కనిపించాయి. మ్యాచ్ ఆద్యంతం స్టేడియం మొత్తం విరాట్.. విరాట్.. విరాట్.. అన్న నినాదాలతో మార్మోగిపోయింది. ఈ మ్యాచ్‌కు బెంగళూరు జట్టు మాజీ స్టార్లు క్రిస్ గేల్, డివిల్లీర్స్ కూడా హాజరై ఆర్సీబీకి మద్దతుపలికారు. జట్టు గెలిచిన అనంతరం గేల్, డివిల్లీర్స్.. విరాట్ కోహ్లీని హత్తుకున్నారు.

1 ఐపీఎల్‌లో ఒకే జట్టుపై ఎక్కువ పరుగులు (పంజాబ్‌పై 1159) చేసిన బ్యాటర్‌గా విరాట్



ప్రైజ్‌మనీ
బెంగళూరుకు - రూ. 20 కోట్లు
పంజాబ్‌కు- రూ. 12.5 కోట్లు

'ఈ సాల కప్ నమ్దే..' అవును.. ప్రతీ సీజన్‌ను ఇదే నినాదంతో హోరెత్తించే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు చివరకు సాధించింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 18 ఏళ్ల నిరీక్షణకు తెర దించుతూ ఈసారి కప్ కొట్టామంటూ బెంగళూరు ఫ్యాన్స్ దిక్కులు పిక్కటిల్లేలా సంబరాలు చేసుకున్నారు. ఐపీఎల్ మొదలు నుంచీ టైటిల్ కోసం చకోర పక్షిలా ఎదురుచూస్తున్న విరాట్ కోహ్లీ ఈ అద్భుత విజయంతో భావోద్వేగాన్ని ఆపుకోలేక కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ ఫైనల్లో తమ బ్యాటర్లు పెద్దగా రాణించకపోయినా.. బౌలర్లు మాత్రం దుమ్మురేపడంతో ఆర్‌సీబీ తొలి టైటిల్‌తో మురిసిపోయింది. అటు క్వాలిఫయర్-2లో కనిపించిన పంజాబ్ పరాక్రమం అసలైన మ్యాచ్‌లో లోపించింది. కెప్టెన్ శ్రేయాస్ కేవలం సింగిల్ రన్‌కే పరిమితం కావడం దెబ్బతీసింది. ఆఖరి ఓవర్‌లో శశాంక్ బ్యాట్ ఝుళిపించినా.. 'సిక్సర్' దూరంలోనే కింగ్స్‌కు టైటిల్ అందకుండా పోయింది.

కోహ్లీ గ్యాంగ్ కొట్టేసింది

బెంగళూరుకు తొలి టైటిల్

అదరగొట్టిన బౌలర్లు
ఐపీఎల్ ఫైనల్లో పంజాబ్ ఓటమి

అహ్మదాబాద్: ఐపీఎల్ 18వ సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కొత్త చాంపియన్‌గా నిలిచింది. మంగళవారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఫైనల్లో ఆర్‌సీబీ ఆరు పరుగుల తేడాతో నెగ్గింది. తద్వారా ఇన్నాళ్లూ ఊరిస్తున్న కప్పు కలను నెరవేర్చుకుంది. మరోవైపు క్రితంసారి కోల్‌కతాను విజేతగా నిలిపిన కెప్టెన్ శ్రేయాస్ ఈసారి చివరి మెట్టుపై బోల్తా పడ్డాడు. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 9 వికెట్లకు 190 పరుగులు చేసింది. విరాట్ (35 బంతుల్లో 3 ఫోర్లతో 43) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అర్ష్‌దీప్, జేమిసన్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 184 పరుగులు చేసి ఓడింది. శశాంక్ సింగ్ (30 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సర్లతో 61 నాటౌట్) పోరాడగా, ఇన్‌గ్లిస్ (23 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 39) ఫర్వాలేదనిపించాడు. క్రునాల్, భువనేశ్వర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా క్రునాల్ పాండ్యా నిలిచాడు.

చేరువుగా వచ్చినా..: ఓ మాదిరి ఛేదనలో పంజాబ్ ఆరంభం కూడా ధాటిగా ఏమీ సాగలేదు. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి ఒత్తిడికి లోనైంది. కానీ ఆఖర్లో శశాంక్ మెరుపులు మెరిపించినా స్వల్ప తేడాతో ఓటమి పాలైంది. ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్ (26), ప్రియాన్ష్ (24) బౌండరీల జోరుకు తొలి రెండు ఓవర్లలో 23 పరుగులతో మెరుపు ఆరంభమే దక్కింది. హాజెల్‌వుడ్ బరిలోకి దిగడంతో కష్టాలు ఆరంభమయ్యాయి. అతడి ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో ప్రియాన్ష్ రెండు ఫోర్లు బాదినా.. బౌండరీ లైన్ దగ్గర సాల్ట్ సమయస్ఫూర్తితో వ్యవహరించి క్యాచ్ పట్టేశాడు. తొలి వికెట్‌కు వీరు 43 పరుగులు జోడించారు. ఎనిమిదో ఓవర్‌లో ఇన్‌గ్లిస్, ప్రభ్ చెరో సిక్సర్‌తో 15 రన్స్ వచ్చాయి. కానీ 9,10 ఓవర్లలో పంజాబ్‌కు గట్టి ఝలక్ తగిలింది. ముందుగా స్పిన్నర్ క్రునాల్.. ప్రభ్‌సిమ్రన్‌ను అవుట్ చేయగా, ఇక అత్యంత ప్రమాదకర కెప్టెన్ శ్రేయాస్ (1)ను షెఫర్డ్ పెవిలియన్‌కు చేర్చడం మలుపు తిప్పింది. దీంతో నరేంద్ర మోదీ స్టేడియంలో హోరు ఆకాశాన్నంటింది. ఇక మ్యాచ్ మనదే అనే భావన ఆర్‌సీబీ ఫ్యాన్స్‌తో పాటు ఆటగాళ్లలోనూ కనిపించింది. అయితే పంజాబ్ మాత్రం క్రీజులో చక్కగా కుదురుకున్న ఇన్‌గ్లిస్‌పై ఆశలు పెట్టుకుంది. దీనికి తగ్గట్టుగానే అతడు క్రునాల్, షెఫర్డ్ ఓవర్లలో సిక్స్‌లతో ఆకట్టుకున్నాడు. అయితే ఈ సంబరం కూడా ఎక్కువ సేపు లేకుండా 13వ ఓవర్‌లో అతడిని క్రునాల్ అవుట్ చేశాడు. ఈ దశలో శశాంక్, నేహల్ (15) జోడీ ఐదో వికెట్‌కు 38 పరుగులు జోడించింది. 17వ ఓవర్‌లో నేహల్‌తోపాటు వచ్చీ రాగానే సిక్సర్ బాదిన స్టొయినిస్ (6)ను భువనేశ్వర్ పెవిలియన్‌కు చేర్చడంతో ఇక పంజాబ్ చేసేదేమీ లేకపోయింది. 6 బంతుల్లో 29 పరుగులు చేయాల్సి రాగా.. 6,4,6,6తో శశాంక్ 22 పరుగులతో ఓటమి తేడాను మాత్రమే తగ్గించగలిగాడు.

కట్టడి చేశారు..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ ఇన్నింగ్స్‌లో పెద్దగా మెరుపులు కనిపించలేదు. విరాట్ టాప్ స్కోరర్‌గా నిలిచినా అతడి ఆటలో వేగం లోపించింది. మిడిలార్డర్‌లో రజత్, జితేశ్, లివింగ్‌స్టోన్ ఎదురుదాడి ప్రయత్నం కాసేపే అయ్యింది. పంజాబ్ బౌలర్ల విజృంభణకు డెత్ ఓవర్లలో 45 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన ఆర్‌సీబీ స్కోరు 200లోపే ముగిసింది. తొలి ఓవర్‌లోనే 6,4 బాదిన ఓపెనర్ సాల్ట్ (16) రెండో ఓవర్‌లో శ్రేయాస్ సూపర్ క్యాచ్‌కు వెనుదిరిగాడు. ఆ తర్వాత పవర్‌ప్లేలో మయాంక్ (24) వేగం చూపడంతో స్కోరు 55/1తో నిలిచింది. చాహల్ తన తొలి ఓవర్‌లోనే మయాంక్‌ను అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 38 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే ఆర్‌సీబీ తొలి పది ఓవర్లలో 18 డాట్ బాల్స్ ఆడగా, విరాట్ బ్యాట్ నుంచి రెండు ఫోర్లు మాత్రమే రావడం గమనార్హం. ఉన్నకాసేపు కెప్టెన్ రజత్ పటీదార్ (26) రెండు సిక్సర్లతో వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. 11వ ఓవర్‌లో అతడిని జేమిసన్ ఎల్బీ చేయడంతో మూడో వికెట్‌కు 40 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం చాహల్, వైశాక్ కట్టడి చేయడంతో ఆర్‌సీబీ రన్స్ కోసం ఇబ్బందిపడింది. చివరకు 14వ ఓవర్‌లో లివింగ్‌స్టోన్ 6, విరాట్ 4తో 14 రన్స్ సమకూరాయి. అయితే సహజశైలిలో భారీషాట్లు ఆడలేకపోయిన కోహ్లీ పుల్‌షాట్ ఆడే ప్రయత్నంలో అజ్మతుల్లాకు రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. ఈ దశలో వచ్చిన జితేశ్ 16వ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో ఆకట్టుకున్నాడు. తర్వాతి ఓవర్‌లో 2 సిక్సర్లతో అదుర్స్ అనిపించాడు. జేమిసన్ ఈ ఓవర్‌లో 23 పరుగులిచ్చుకున్నా లివింగ్‌స్టోన్ (25) వికెట్ తీయగలిగాడు. ఈ జోడీ మధ్య ఐదో వికెట్‌కు 12 బంతుల్లోనే 36 పరుగులు జత చేరాయి. అటు చక్కటి టచ్‌లో కనిపించిన జితేశ్‌ను పేసర్ వైశాక్ బౌల్డ్ చేయగా.. 19వ ఓవర్‌లో షెఫర్డ్ 4,6తో 14 రన్స్ అందించాడు. గతంలో చెన్నైపై అతడి హిట్టింగ్‌ను చూసిన ఫ్యాన్స్.. ఈసారి కూడా భారీస్కోరు చేస్తాడని భావించారు. అయితే అర్ష్‌దీప్ ఆఖరి ఓవర్‌లో 3 పరుగులే ఇచ్చి షెఫర్డ్ (17), క్రునాల్ (4), భువనేశ్వర్ (1)ల వికెట్లతో వహ్వా.. అనిపించాడు.



విరాట్.. ఏడ్చేశాడు

ఆధునిక క్రికెట్‌లో అత్యున్నత ఆటగాడైనా తన కెరీర్‌లో ఇప్పటి దాకా ఐపీఎల్ టైటిల్ లేని లోటు విరాట్ కోహ్లీని వేధిస్తూనే వచ్చింది. అందుకే సుదీర్ఘ విరామం తర్వాత చాంపియన్‌గా నిలిచామనే వాస్తవాన్ని కోహ్లీ కూడా కాసేపు నమ్మలేకపోయాడేమో.. ఆఖరి ఓవర్‌లో రెండో బంతి ముగియగానే భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయాడు. అప్పటికి 4 బంతుల్లో 29 రన్స్ అవసరమవడంతో ఆర్‌సీబీ గెలుపు ఖాయమైంది. దీంతో విరాట్ తన ముఖాన్ని రెండు చేతుల్లో దాచుకుంటూ కన్నీటిపర్యంతమయ్యాడు. మైదానంలోకి వచ్చిన భార్య అనుష్కను కౌగిలించుకుని చాలా సేపు అలాగే ఉండిపోయాడు.

18 తమ అభిమాన క్రికెటర్ కోహ్లీ జెర్సీ నెంబర్ 18 కావడం.. అటు అతనికి ఐపీఎల్ టైటిల్ కూడా 18వ సీజన్‌లోనే దక్కడం ఆర్‌సీబీ అభిమానులకు మరింత ఆనందాన్నిస్తోంది.




క్రునాల్

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

కల నిజమాయె!

ఒకటా..రెండా..ఏకంగా 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ.. ఏబీ డివిల్లీర్స్, క్రిస్ గేల్, డుప్లెసి, రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, కలిస్, జహీర్ ఖాన్ వంటి సూపర్‌స్టార్లు ప్రాతినిధ్యం వహించిన జట్టది. కానీ నేటివరకు బెంగళూరు జట్టుకు టైటిల్ అందని ద్రాక్షే అయ్యింది. ప్రతి ఏడాదీ 'ఈ సాల కప్ నమ్దే' అంటూ ఊదరగొట్టడం.. కీలక సమయాల్లో బోల్తా కొట్టి తీవ్ర నిరాశలో కూరుకుపోవడం ఏళ్లుగా ఆటగాళ్లతోపాటు ఆర్‌సీబీ ఫ్యాన్స్‌కూ అలవాటైపోయింది. ఐపీఎల్‌లో ఆర్సీబీ రికార్డు చూస్తే....మూడుసార్లు (2009, 2011, 2016) తుది మెట్టుపై బోల్తా.. రెండుసార్లు (2015, 2022) క్వాలిఫయర్-2లో చుక్కెదురు..మరో మూడుసార్లు (2020, 2021, 2024) ఎలిమినేటర్లలో ఎదురు దెబ్బలుతిని నిష్క్రమించింది. మరీ ముఖ్యంగా 2016లో అద్భుత ఫామ్‌లో ఉన్న నాటి సారథి విరాట్ కోహ్లీ నాలుగు సెంచరీలు సహా మొత్తం 973 పరుగులతో అదరగొట్టినా..ఆ జట్టుకు ట్రోఫీ అందుకోలేకపోయింది. ఆ సీజన్‌లో బెంగళూరు అభిమానుల బాధ వర్ణనాతీతం! ఎట్టకేలకు ఆర్‌సీబీ చిరకాల స్వప్నం సాకారమైంది. 'మెగా ట్రోఫీ'ని ఆ జట్టు 18వ సీజన్‌లో ఒడిసిపట్టింది. తమ అభిమాన ఆటగాడు విరాట్ కోహ్లీ ఇటీవల టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించడంతో తీవ్ర వేదనలో ఉన్న అతడి అభిమానులను ఆర్‌సీబీ జట్టు ఐపీఎల్ ఫైనల్ విజయం ఆనంద డోలికల్లో ముంచెత్తింది.

స్పష్టమైన ప్రణాళికతో..

ఈ సీజన్‌లో టైటిల్ అందుకోవడాన్ని ఏకైక లక్ష్యంగా ఆర్‌సీబీ నిర్దేశించుకుంది. ఈ క్రమంలో జట్టును సమూలంగా ప్రక్షాళన చేయాలని వ్యూహకర్తలు నిర్ణయించారు. ఆ మేరకు పక్కా ప్రణాళికతో వేలంలోకి దిగారు. రిటైన్ చేసుకున్న కోహ్లీ, రజత్ పటీదార్, యశ్ దయాల్ అంచనాలను అందుకొని జట్టు విజయాలలో తమ వంతు పాత్ర పోషించారు. వికెట్ కీపర్, బ్యాటర్ ఫిల్ సాల్ట్, కోహ్లీ మెరుపు ఆరంభాలివ్వగా....దేవదత్ పడిక్కళ్, రజత్ పటీదార్, లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ మిడిలార్డర్‌లో చెలరేగారు. ఆల్‌రౌండర్లు టిమ్ డేవిడ్, రొమారియో షెఫర్డ్ లోయరార్డర్‌లో దంచికొట్టారు. ఇక ఆర్‌సీబీ బౌలింగ్ విభాగం గురించి ఎంత చెప్పినా తక్కువే. ముఖ్యంగా ఆస్ట్రేలియా పేసర్ జోష్ హాజెల్‌వుడ్ వికెట్ల వేట కొనసాగించగా..భువనేశ్వర్ కుమార్, యశ్ దయాల్ అండగా నిలిచారు. స్పిన్నర్లు క్రునాల్ పాండ్యా, సుయాష్ శర్మ ప్రత్యర్థులను పూర్తిగా కట్టడి చేశారు. ఇలా ప్రతి ఆటగాడు తమ బాధ్యతను అత్యంత సమర్థంగా నిర్వర్తించారు. మొత్తంగా సమష్టితత్వం ప్రధాన ఆయుధంగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు తన చిరకాల స్వప్నాన్ని సాకారం చేసుకుంది.

స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (సి) శ్రేయాస్ (బి) జేమిసన్ 16, విరాట్ కోహ్లీ (సి అండ్ బి) ఒమర్జాయ్ 43, మయాంక్ అగర్వాల్ (సి) అర్ష్‌దీప్ (బి) చాహల్ 24, పటీదార్ (ఎల్బీ) జేమిసన్ 26, లివింగ్‌స్టోన్ (ఎల్బీ) జేమిసన్ 25, జితేశ్ (బి) వైశాక్ 24, షెఫర్డ్ (ఎల్బీ) అర్ష్‌దీప్ 17, క్రునాల్ పాండ్యా (సి) శ్రేయాస్ (బి) అర్ష్‌దీప్ 4, భువనేశ్వర్ (సి) ప్రియాన్ష్ (బి) అర్ష్‌దీప్ 1, యశ్ దయాల్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 190/9; వికెట్ల పతనం:** 1-18, 2-56, 3-96, 4-131, 5-167, 6-171, 7-188, 9-189, 9-190; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-40-3, జేమిసన్ 4-0-48-3, ఒమర్జాయ్ 4-0-35-1, వైశాక్ 4-0-30-1, చాహల్ 4-0-37-1.

పంజాబ్: ప్రియాన్ష్ (సి) సాల్ట్ (బి) హాజెల్‌వుడ్ 24, ప్రభ్‌సిమ్రన్ (సి) భువనేశ్వర్ (బి) క్రునాల్ 26, ఇన్‌గ్లిస్ (సి) లివింగ్‌స్టోన్ (బి) క్రునాల్ 39, శ్రేయాస్ (సి) జితేశ్ (బి) షెఫర్డ్ 1, నేహల్ (సి) క్రునాల్ (బి) భువనేశ్వర్ 15, శశాంక్ సింగ్ (నాటౌట్) 61, స్టొయినిస్ (సి) యశ్ (బి) భువనేశ్వర్ 6, ఒమర్జాయ్ (సి/సబ్) భండగె (బి) యశ్ దయాల్ 1, జేమిసన్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు 11; మొత్తం: 20 ఓవర్లలో 184/7; వికెట్ల పతనం:** 1-43, 2-72, 3-79, 4-98, 5-136, 6-142, 7-145; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-38-2, యశ్ దయాల్ 3-0-18-1, హాజెల్‌వుడ్ 4-0-54-1, క్రునాల్ 4-0-17-2, సుయాశ్ 2-0-19-0, షెఫర్డ్ 3-0-30-1.

ఈ సీజన్ హీరోలు

1 అరంగేట్ర సీజన్‌లో ఎక్కువ పరుగులు (475) చేసిన అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా ప్రియాన్ష్ ఆర్య

ఆరెంజ్ క్యాప్: సాయి సుదర్శన్
(15 మ్యాచ్‌ల్లో 759 పరుగులు, గుజరాత్)
పర్పుల్ క్యాప్: ప్రసిద్ధ్ కృష్ణ
(15 మ్యాచ్‌ల్లో 25 వికెట్లు, గుజరాత్)
అత్యంత విలువైన ఆటగాడు-సూర్యకుమార్
ఉత్తమ వర్ధమాన ఆటగాడు- సాయి సుదర్శన్
ఫెయిర్ ప్లే- చెన్నై సూపర్ కింగ్స్
ఉత్తమ పిచ్ అవార్డు- ఢిల్లీ క్యాపిటల్స్

ఒలింపిక్స్‌లో క్రికెట్.. భారత్ వల్లే!

బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్


మ్యాచ్‌లో రిషి సునాక్ ఆనందం

అహ్మదాబాద్: వందేళ్ల తర్వాత ఒలింపిక్స్‌లో మళ్లీ క్రికెట్‌ను చేర్చడానికి భారతే కారణమని బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ కొనియాడారు. క్రికెట్ వీరాభిమాని అయిన సునాక్.. ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌ని తిలకించేందుకు ఇక్కడికి వచ్చారు. భారత్‌ను ప్రభావితమైన శక్తిగా తయారు చేయడంలో ఐపీఎల్, బీసీసీఐ పాత్ర ఎంతో ఉందని ఆయన ప్రశంసించారు. 1900 తర్వాత.. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కింది. '21వ శతాబ్దాన్ని భారత్ ఎలా ప్రభావితం చేయగలదనడానికి ఇవి సంకేతాలు. వందేళ్ల తర్వాత తొలిసారి విశ్వక్రీడల్లో క్రికెట్‌కు చోటు దక్కిందంటే.. అది ఇండియా వల్లే'నని సునాక్ అన్నారు. ఇక, ఐపీఎల్‌లో 'ఈ సాల కప్ నమ్దే' అంటూ బెంగళూరుకు సునాక్ మద్దతు ప్రకటించారు.

సెంట్రల్ కాంట్రాక్ట్‌కు మళ్లీ నో చెప్పిన కేన్ విలియమ్సన్

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్‌ను ఆ దేశ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ మరోసారి తిరస్కరించాడు. ఫ్రాంచైజీ క్రికెట్‌పై దృష్టిసారించిన విలియమ్సన్ గతేడాది కూడా సెంట్రల్ కాంట్రాక్ట్ వద్దనుకొన్నాడు. కానీ, గత సంవత్సరం తరహాలోనే క్యాజువల్ కాంట్రాక్ట్‌పై అతడు సంతకం చేసే అవకాశాలున్నాయి. బోర్డు విడుదల చేసిన 20 మంది సెంట్రల్ కాంట్రాక్ట్ ప్లేయర్ల జాబితాలో కాన్వే, అలెన్, సీఫెర్ట్, ఫెర్గూసన్ పేర్లు కూడా లేవు. వీరంతా ప్రపంచవ్యాప్తంగా ఉన్న టీ20 లీగ్‌లు ఆడుతున్న వారే. కాగా, మిడిల్‌సెక్స్ తరఫున కౌంటీలు ఆడుతున్న విలియమ్సన్.. ఆ తర్వాత 'ద హండ్రెడ్'లో బరిలోకి దిగనున్నాడు.

ఒకుహారపై సింధు గెలుపు

● సాత్విక్ జోడీ ముందంజ
● ప్రణయ్, లక్ష్య అవుట్

ఇండోనేసియా ఓపెన్



జకార్తా: ఇండోనేసియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పీవీ సింధు, డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి శుభారంభం చేశారు. కాగా, వెటరన్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్, మరో స్టార్ ఆటగాడు లక్ష్య సేన్ మాత్రం ఆరంభంలోనే ఇంటిబాట పట్టారు. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో సింధు 22-20, 21-23, 21-15తో చిరకాల ప్రత్యర్థి, జపాన్ స్టార్ నొజొమి ఒకుహారపై పోరాడి గెలిచింది. సింధు రెండోరౌండ్లో ఆరోసీడ్ పోర్న్‌పవీ చోచువాంగ్ (థాయ్‌లాండ్)తో తలపడనుంది. డబుల్స్ మొదటి రౌండ్లో సాత్విక్/చిరాగ్ జోడీ 18-21, 21-18, 21-14తో స్థానిక ద్వయం లియో రోలీ కర్నాండో/మౌలానాను ఓడించి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించింది. ఇక లక్ష్య సేన్ 11-21, 22-20, 15-21తో ప్రపంచ రెండో ర్యాంకర్ షి యు కి (చైనా) చేతిలో, ప్రణయ్ 17-21, 18-21తో స్థానిక షట్లర్ ఫర్హాన్ చేతిలో ఓటమి పాలయ్యారు.

నీరజ్ క్లాసిక్ ఈవెంట్ 5న..

బెంగళూరు: 'నీరజ్ చోప్రా క్లాసిక్' మొట్టమొదటి అంతర్జాతీయ జావెలిన్ త్రో ఈవెంట్ వచ్చే నెల 5న బెంగళూరులో జరగనుంది. ఒలింపిక్ స్వర్ణ పతక విజేత, భారత స్టార్ నీరజ్ చోప్రా ఆధ్వర్యంలో జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ సహకారంతో అతని పేరుతోనే ఈ ఆరంభ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ టోర్నీ గతనెల 24న జరగాల్సి ఉంది. అయితే, భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈవెంట్‌ను అప్పట్లో వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఏడుగురు, భారత్ నుంచి ఐదుగురితో కలిపి మొత్తం 12 మంది జావెలిన్ త్రోయర్లు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.

సెమీస్‌కు సబలెంక, స్వియటెక్

జెంగ్, స్విటోలినా అవుట్ ● ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: మహిళల డిఫెండింగ్ చాంపియన్ స్వియటెక్, టాప్ సీడ్ సబలెంక ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లారు. మంగళవారం ఇక్కడ జరిగిన సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో ఐదోసీడ్ స్వియటెక్ (పోలెండ్) 6-1, 7-5తో ఉక్రెయిన్ స్టార్, 13వ సీడ్ స్విటోలినాను చిత్తుచేసింది. కెరీర్‌లో ఆరో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై గురిపెట్టిన 24 ఏళ్ల స్వియటెక్‌కు ఈ వేదికపై వరుసగా ఇది 26వ విజయం. స్వియటెక్ తన కెరీర్‌లో నెగ్గిన మొత్తం ఐదు గ్రాండ్‌స్లామ్స్‌లో నాలుగు ఇక్కడే అందుకోవడం విశేషం. క్లేకోర్టులో తిరుగులేని ఆటతీరుతో అదరగొడుతున్న స్వియటెక్ గురువారం జరిగే సెమీఫైనల్లో వరల్డ్ నెంబర్‌వన్ సబలెంకతో అమీతుమీ తేల్చుకోనుంది. మరో క్వార్టర్‌ఫైనల్లో సబలెంక (బెలారస్) 7-6 (3), 6-3తో చైనాకు చెందిన 8వ సీడ్ కిన్వెన్ జెంగ్‌ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో 8వ సీడ్ లోరెంజో ముసెట్టి (ఇటలీ) 6-2, 4-6, 7-5, 6-2తో అమెరికాకు చెందిన 15వ సీడ్ ఫ్రాన్సెస్ టియాఫోపై గెలిచి సెమీఫైనల్‌కు చేరాడు.


సబలెంక


స్వియటెక్

లెక్క సరిచేసిన గుకేష్

● నార్వే చెస్‌లో అర్జున్‌పై గెలుపు

స్టావెంజర్ (నార్వే): సహచరుడు అర్జున్ ఇరిగేసిపై బదులు తీర్చుకొన్న వరల్డ్ చాంపియన్ గుకేష్.. నార్వే చెస్ టోర్నీలో ద్వితీయ స్థానానికి ఎగబాకాడు. 6వ రౌండ్‌లో కార్ల్‌సన్‌పై గెలుపుతో బలంగా పుంజుకొన్న గుకేష్.. 7వ రౌండ్‌లో అర్జున్‌పై గెలిచాడు. తెల్లపావులతో ఆడిన గుకేష్ 92 ఎత్తుల్లో అర్జున్ ఆట కట్టించాడు. 2వ రౌండ్‌లో అర్జున్ చేతిలో గుకేష్ ఓడిన సంగతి తెలిసిందే. వరుసగా రెండో క్లాసిక్ గేమ్‌లో నెగ్గిన గుకేష్.. మొత్తం 7 రౌండ్ల నుంచి 11.5 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. కరువానా 12.5 పాయింట్లతో టాప్‌లో ఉండగా.. కార్ల్‌సన్ 11 పాయింట్లతో మూడో స్థానంలో, అర్జున్ 7.5 పాయింట్లతో ఆరో స్థానంలో కొనసాగుతున్నారు. మహిళల ఏడో రౌండ్‌లో ముజిచెక్‌తో క్లాసిక్ గేమ్‌ను డ్రా చేసుకొన్న హంపి.. ఆర్మగెడాన్‌లో ఓటమి పాలైంది. కాగా, లీ టింగ్జీ చేతిలో వైశాలి క్లాసిక్ గేమ్‌లోనే ఓడింది. 7 రౌండ్ల నుంచి హంపి 10.5 పాయింట్లతో మూడో స్థానంలో, వైశాలి 8 పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నారు.

2 విడతల్లో చేనేత అభయహస్తం

» 40 వేల మంది కార్మికులకు ప్రయోజనం

» తెలంగాణ చేనేత వస్త్రాలకు ప్రత్యేక లోగో: మంత్రి తుమ్మల



హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చేనేత కార్మికుల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ చేనేత అభయ హస్తం' పథకం రెండు (ఏప్రిల్ నుంచి సెప్టెంబర్, అక్టోబర్ నుంచి మార్చి వరకు) విడతల్లో అమలు చేస్తామని చేనేత కార్మికశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు 'తెలంగాణ చేనేత అభయహస్తం' పథకం మార్గదర్శకాలను జారీ చేశామన్నారు. వేతన ప్రోత్సాహం కింద ఏటా రూ.18 వేలు, అనుబంధ కార్మికులకు రూ.6,000 చెల్లిస్తామని మంత్రి తుమ్మల చెప్పారు. ఒక్కో విడతలో చేనేత కార్మికుడికి రూ.9,000, అనుబంధ కార్మికుడికి రూ.3,000 సంబంధిత లబ్ధిదారుడి ఖాతాలో జమ చేస్తామని పేర్కొన్నారు. ఈ పథకంతో సుమారు 40 వేల మంది చేనేత, అనుబంధ కార్మికులు లబ్ధి పొందుతారని తుమ్మల వెల్లడించారు. ఇక రాష్ట్ర చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలకు ప్రత్యేకంగా 'యూనిక్ లోగో' జత చేస్తామని, తద్వారా ఆ వస్త్రాల నాణ్యతా ప్రమాణాలు, నేత కార్మికుడి వివరాలు తెలుసుకోవచ్చునని తెలిపారు. 18 ఏళ్లు నిండడంతోపాటు జియో ట్యాగ్ చేసిన మరమగ్గాలపై పని చేసే కార్మికులతోపాటు ప్రీలూమ్, ప్రిపరేటరీ (డైయింగ్, టైయింగ్, డిజైనింగ్, వార్పింగ్, వైడింగ్, సైజింగ్) అనుబంధ పనులు చేసే వారితోపాటు చేనేత వృత్తితో వార్షికాదాయం 50 శాతం పొందుతున్న వారిని ఈ పథకానికి అర్హులుగా గుర్తించామన్నారు.

ప్లాస్టిక్ రహిత రాష్ట్రం కోసం కృషి చేయాలి:సురేఖ



హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణను ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎవరూ ప్లాస్టిక్ వాడొద్దని, పర్యావరణానికి నష్టం కలిగించొద్దని కోరారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) రూపొందించిన 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం' థీమ్ పోస్టర్‌ను మంత్రి సురేఖ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పర్యావరణం, వన్యప్రాణులు, మానవ ఆరోగ్యంపై ప్లాస్టిక్ కాలుష్యం వల్ల కలిగే హానికరమైన ప్రభావాల గురించి అవగాహన పెంచడమే లక్ష్యంగా పోస్టర్లు రూపొందించారని తెలిపారు.

కొత్త పరిశ్రమలు తెస్తాం.. యువతకు ఉపాధి కల్పిస్తాం

» ఎవర్జైంట్ టెక్నాలజీస్ గ్లోబల్ వాల్యూ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



ఎవర్జైంట్ టెక్నాలజీస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు తీసుకొచ్చి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్, నానక్‌రామ్‌గూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటు చేసిన అమెరికాకు చెందిన ఎవర్జైంట్ టెక్నాలజీస్ గ్లోబల్ వాల్యూ సెంటర్‌ను మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో కార్యాలయాన్ని ప్రారంభించిన ఎవర్జైంట్ టెక్నాలజీస్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎవర్జైంట్ టెక్నాలజీస్ గ్లోబల్ వాల్యూ సెంటర్ ద్వారా ప్రస్తుతం 600 మందికి ఉద్యోగాలు లభిస్తున్నాయని, రాబోయే రోజుల్లో ఆ సంఖ్య వెయ్యికి చేరుతుందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఏడాదిన్నర వ్యవధిలో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్వాంటమ్ కంప్యూటింగ్‌కు తెలంగాణను హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. హైదరాబాద్‌ను ఏఐ రాజధానిగా మార్చాలనే సంకల్పంతోనే ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల్లో ఏఐ సిటీని అభివృద్ధి చేయబోతునామన్నారు. యువతలో నైపుణ్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఆవిష్కరణలకు హబ్‌గా తెలంగాణను మార్చేందుకు కొత్త ఆలోచనలతో ముందుకు వచ్చే యువతకు ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి భవానీ శ్రీ, ఐటీ సలహాదారు సాయికృష్ణ, ఎవర్జైంట్ టెక్నాలజీస్ ఫౌండర్, సీఈవో విజయ్ సజ్జ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదగాలి

» అత్యధిక మార్కులు సాధించిన బీసీ గురుకులాల విద్యార్థులను సన్మానించిన మంత్రి పొన్నం

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదిగి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని మంత్రి పొన్నంప్రభాకర్ అన్నారు. బీసీ గురుకులాలు, హాస్టళ్లలో చదివి 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం బేగంపేట్ ఐఏఎస్ ఆఫీసర్స్ క్లబ్‌లో మంత్రి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మాజ్యోతిరావు పూలే గురుకులాల విద్యార్థుల్లో మరింత ప్రతిభ పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం నుంచి అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని, విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు.

ప్రజావాణి ద్వారా.. అందిన 4 లక్షల పీఎఫ్ డబ్బు

బేగంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సీఎం ప్రజావాణి చొరవతో పాల ప్రవీణ్ అనే వ్యక్తి కుటుంబానికి రూ.4 లక్షల ప్రావిడెంట్ ఫండ్ అందింది. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన సీఎం ప్రజావాణికి అతడి తల్లిదండ్రులు పాల నాగేశ్వరరావు, రామలక్ష్మి వచ్చి ఈ విషయాన్ని తెలిపారు. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టకు చెందిన పాల ప్రవీణ్ ప్రైవేటు సంస్థలో పనిచేస్తుండగా ఐదేళ్ల క్రితం ప్రమాదవశాత్తు చనిపోయారు. అప్పటి నుంచి అతడి తల్లిదండ్రులు పీఎఫ్ డబ్బు కోసం అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. దాంతో మూడు నెలల క్రితం సీఎం ప్రజావాణికి వచ్చి సమస్యను వివరిస్తూ వినతి పత్రం ఇచ్చారు. ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దేవరాజన్ అధ్వర్యంలో అధికారులు రంగంలోకి దిగి ప్రైవేట్ సంస్థ, పీఎఫ్ అధికారులతో మాట్లాడి ప్రవీణ్‌కు రావాల్సిన 4 లక్షల పీఎఫ్ డబ్బును తల్లిదండ్రులకు ఇప్పించారు. దీంతో వారు మంగళవారం ప్రజావాణికి వచ్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యలకు ధన్యవాదాలు తెలిపారు.

జూరాలకు కొనసాగుతున్న వరద

ధరూరు/దోమలపెంట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు వరద నిలకడగా కొనసాగుతోంది. ఎగువన ఆల్మటి జలాశయంలో 54.49 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, ఆ దిగువన ఉన్న నారాయణపూర్ జలాశయంలో 27.82 టీఎంసీల నీరు ఉంది. జూరాలలో 317.920 మీటర్లలో 4.747 టీఎంసీల నీరు ఉండగా ప్రాజెక్టులో 17 వేల క్యూసెక్కుల వరద వస్తోంది, జూరాల నుంచి 17,885 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టులోకి 6,685 క్యూసెక్కుల నీరు చేరుతోంది. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గాను, 833.20 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం 53 టీఎంసీల నీరుంది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 3,982 క్యూసెక్కుల ఔట్ ఫ్లో కొనసాగుతోందని డ్యాం అధికారులు పేర్కొన్నారు.

ఉద్యోగుల డిమాండ్లకు పచ్చజెండా!



(మొదటిపేజీ తరువాయి)

జరగనుంది. కాగా, ఉద్యోగులు కోరుతున్న ఐదు డీఏలలో ఒక డీఏపై ప్రభుత్వం సానుకూలంగా ఉండగా.. రెండో డీఏ ఇచ్చే విషయంపై చర్చ జరగనుంది. దీంతోపాటు పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నట్లు రూ.11 వేల కోట్లను గ్రీన్ చానల్ ద్వారా ఒక్కో విడతలో ఎంత చెల్లించాలనే దానిపైనా స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. నెలకు రూ.1000 కోట్ల చొప్పున చెల్లిస్తారా? లేక విడతల వారీగా ప్రాధాన్య క్రమంలో చెల్లింపులు ఉంటాయా? అనే అంశాలపై క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇక ఉద్యోగుల సాధారణ బదిలీలు ఏటా చేయడానికి ప్రభుత్వం సుముఖంగానే ఉంది.

ఆర్థికేతర డిమాండ్లపై నిర్ణయం!

ఉద్యోగుల ఆర్థికేతర డిమాండ్లలో 44 డిమాండ్లను అధికారుల కమిటీ నివేదికలో ప్రధానంగా ప్రస్తావించగా.. అందులో దాదాపు అన్ని డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. పదవీ విరమణ వయసు పెంపు వంటి అంశాలపైనా క్యాబినెట్‌లో చర్చ జరిగే అవకాశం ఉంది. అయితే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచితే నిరుద్యోగుల్లో ఆందోళన రేకెత్తుతుందని, మరోవైపు పదోన్నతులు అందక నష్టపోయే ఉద్యోగుల్లోనూ అసంతృప్తి పెరుగుతుందనే వాదన కూడా తెరపైకి వచ్చింది. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఆర్థిక శాఖలో స్పెషల్ సెక్రటరీ క్యాడర్ పోస్టును కొత్తగా మంజూరు చేసే విషయంపైనా క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. ఇక ఉద్యోగుల కొత్త ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) రూపకల్పనపై ప్రభుత్వం వైద్యశాఖ నుంచే లెక్కలు, ఖర్చులు, వివరాలు సేకరించింది. ఇంకా ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపలేదు. వారి ప్రతిపాదనలేంటో తెలుసుకోలేదు. గతంలో ఉద్యోగ సంఘాలు తమ కాంట్రిబ్యూషన్ కింద 1 శాతం ఇస్తామని సర్కారుకు లేఖలు రాశాయి. ఈ నేపథ్యంలో దీనిపై క్యాబినెట్‌లో చర్చించి ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది.

వ్యవ'సాయం' పైనా చర్చ..

క్యాబినెట్ భేటీలో వ్యవసాయానికి సంబంధించి ప్రధానంగా ఖరీఫ్ సీజన్‌లో అందించే రైతు భరోసాకు అవసరమైన నిధులపై స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. వానాకాలం సీజన్‌లో 1.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో ఆ మొత్తానికి కలిపి దాదాపు రూ.8400 కోట్ల వరకు నిధులు అవసరమని ప్రాథమికంగా అధికారులు తేల్చారు. మరోవైపు ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఇప్పటివరకు నాలుగు నుంచి ఐదు ఎకరాల వరకు కలిపి రూ.5 వేల కోట్లు మాత్రమే అందించారు. మరో రూ.2800 కోట్ల వరకు పెండింగ్ ఉంది. ఈ రెండు అంశాలపై కీలకంగా చర్చ జరిగే అవకాశం ఉంది. కాగా, రైతు బీమా కోసం రూ.1440 కోట్లకు పైగా అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది రైతు బీమా కోసం ఎల్ఐసీకి రూ.1443 కోట్లు చెల్లించారు. అయితే ఈసారి బీమా పరిధిలోకి వచ్చే రైతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనాలు వేస్తున్న క్రమంలో బీమా కోసం నిధుల కేటాయింపు పెరిగే అవకాశం ఉంది. ఈ బీమా నిధులను ఆగస్టు 14 నాటికి ఎల్ఐసీకి చెల్లించాల్సి ఉంటుంది. ఫసల్ బీమా అంశంపైనా క్యాబినెట్‌లో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. రాష్ట్రంలో రైతులు పండించే పంటలకు బీమా లేదు. దాంతో రైతులు చెల్లించే బీమా వాటాను కూడా తామే చెల్లిస్తూ కొత్త బీమా పథకాన్ని అమలు చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం రూ.3 వేల కోట్ల వరకు నిధులు అవసరమని అంచనా కూడా వేశారు. దీనిపైనా నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. వడ్లకు ఇచ్చే బోనస్ విషయంలోనూ చర్చించనున్నారు. ఈ ఏడాది యాసంగిలో కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి దాదాపు రూ.1000 కోట్ల వరకు బోనస్ చెల్లించాల్సి ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారుల నివేదికల్లో పేర్కొన్నారు.

యువ వికాసం ఎలా..!

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులను స్వీకరించగా దాదాపు 16.23 లక్షలు వచ్చాయి. వీటన్నింటిని నాలుగు కేటగిరీలుగా విభజించి వాటి ప్రకారం ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించారు. కానీ, పథకం కింద ఎక్కువ దరఖాస్తులు రావడం, అర్హులను గుర్తించే ప్రక్రియలో జాప్యం జరగడంతో ముందుగా నిర్దేశించుకున్న జూన్ 2న పథకాన్ని ప్రారంభించలేకపోయారు. ఈ పథకానికి నిధుల సర్దుబాటు, ప్రారంభంపైనా క్యాబినెట్ భేటీ చర్చ జరగనుంది. దీంతోపాటు కాళేశ్వరంపై ఎన్‌డీఎస్ఏ ఇచ్చిన నివేదికపైనా చర్చ జరగనున్నట్లు తెలిసింది. ఇప్పటికే మంత్రులకు సీఎం ఇచ్చిన విందులో, ఆదివారం జరిగిన మంత్రుల సమావేశంలోనూ ఈ అంశంపై చర్చ జరిగినట్లు సమాచారం. మరోవైపు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావును విచారణకు హాజరు కావాలని కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇచ్చింది. ఎన్‌డీఎస్ఏ ఇచ్చిన నివేదిక, విజిలెన్స్ కమిషన్ నివేదికపై, నిర్మాణ సంస్థపై తీవ్ర ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఈ అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

ఇందిరమ్మ ఇళ్లు.. హ్యామ్ రోడ్లు

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా 44 వేల ఇళ్లకు పైగా మంజూరు చేసింది. రెండో విడత కింద 2.10 లక్షల మంది లబ్ధిదారులను గుర్తించారు. ఇందుకు అవసరమైన నిధుల చెల్లింపు, నిధుల సమీకరణపై చర్చ జరగనుంది. మరోవైపు రాష్ట్రంలోని పంచాయతీరాజ్, రోడ్లు, భవనాల శాఖ పరిధిలో కలిపి దాదాపు 30 వేల కిలోమీటర్ల రహదారులను హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్) విధానంలో అభివృద్ధి చేయాలని గతంలోనే నిర్ణయించారు. ఈ మేరకు ఈ రెండు శాఖలు మొదటి దశలో ఎన్ని వేల కిలోమీటర్లను అభివృద్ధి చేయాలనే దానిపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు అవసరమైన నిధుల సమీకరణపైనా చర్చ జరగనుంది. ఈ అంశంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం అధికారులతో సమీక్షించారు. హ్యామ్ విధానంలో ఫేజ్-1లో 5,190 కిలోమీటర్ల రహదారులకు సంబంధించిన సమగ్ర అంచనాలు, వాటి అమలు విధానాలను అధికారులు మంత్రికి వివరించారు.

డిప్యూటీ సీఎం నుంచి ఉద్యోగ సంఘాలకు పిలుపు



ఉద్యోగ సంఘాలతో చర్చించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నుంచి జేఏసీ ప్రతినిధులకు మంగళవారం సమాచారం వెళ్లినట్లు తెలిసింది. ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం బుధవారం సమావేశం అవుతున్నందున ఆ సమావేశానికి 40 మంది ఉద్యోగ సంఘాల ప్రతినిధుల జాబితాను పంపాలని కోరినట్లు సమాచారం. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. క్యాబినెట్ సమావేశానికి ఒక రోజు ముందు ఉద్యోగులతో భట్టి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఉద్యోగుల్లో చర్చనీయాంశం అయింది.

కోర్ అర్బన్ రీజియన్‌కు ప్రత్యేక పాలసీ

» చెరువులు, నాలాలు, రోడ్ల విస్తరణ అభివృద్ధికి రూపకల్పన

» అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

» వర్షాకాల సన్నద్ధతపై సమీక్ష

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కోర్ అర్బన్ రీజియన్ ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పాలసీని తీసుకురానుంది. ఇదే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులకు కీలక సూచనలు చేశారు. మంగళవారం వర్షాకాల సన్నద్ధతతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ అభివృద్ధిపై అధికారులతో సీఎం రేవంత్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని చెరువులు, నాలాలు, రోడ్ల విస్తరణ సహా అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక పాలసీని రూపొందించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఇక వర్షాకాల సన్నద్ధత నేపథ్యంలో అత్యవసర బృందాలను 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నగరంలో ఇప్పటికే గుర్తించిన 141 వాటర్ లాగింగ్ పాయింట్లకు సంబంధించి అక్కడ జరుగుతున్న పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. హార్వెస్టింగ్ వెల్స్‌లోకి చేరే వర్షపు నీటిని పంపులతో బయటకు పంపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ శాఖ సూచనలకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాలు, వరదలకు సంబంధించి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షణ చేసేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాలు పడినప్పుడు హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్ఎంసీ విభాగాలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నగరంలో అసంపూర్తిగా ఉన్న నాలాల పూడికతీత పనులను వీలైనంత త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కోర్ అర్బన్ రీజియన్‌లోనూ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం రేవంత్ సూచించారు.

మంత్రితో ముఖాముఖి నేడు మళ్లీ ప్రారంభం

గాంధీభవన్‌లో వినతులు తీసుకోనున్న పొన్నం

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గాంధీ భవన్‌లో మంత్రితో ముఖాముఖి కార్యక్రమం మళ్లీ ప్రారంభం కానుంది. బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మంత్రి పొన్నం ప్రభాకర్, పార్టీ నేతలు.. ప్రజలు, కార్యకర్తల నుంచి వినతిపత్రాలు స్వీకరించనున్నారు. టీపీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొద్ది రోజులు సజావుగానే సాగినా ఆ తర్వాత అటకెక్కింది. మధ్యలో రెండుసార్లు ప్రారంభించినా.. వివిధ కారణాలతో నిలిపేశారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పట్టుదలతో మళ్లీ మంత్రితో ముఖాముఖి కార్యక్రమం పట్టాలెక్కింది.

హౌసింగ్ బోర్డు స్థలాల వేలం!

» హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో ఉన్నవన్నీ

» రూ.500-600 కోట్ల ఆదాయం అంచనా

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న ఓపెన్ ప్లాట్లను వేలం వేయాలని సర్కారు నిర్ణయించింది. దీంతో హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో బోర్డు పరిధిలో ఉన్న ప్లాట్లన్నింటినీ వేలం వేసేందుకు రంగం సిద్ధమైంది. వేలం ద్వారా రూ.500 - 600 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బోర్డు పరిధిలో ఉన్న ఓపెన్ ప్లాట్ల వివరాలతో ఇప్పటికే నివేదికలను రూపొందించారు. అదే విధంగా ఆయా ప్లాట్ల వేలానికి సంబంధించి కూడా ప్రాథమికంగా కొన్ని ధరలను నిర్దేశించుకున్నారు. ఇప్పటికే మహబూబ్‌నగర్, కూకట్‌పల్లిలోని ప్లాట్ల వేలానికి ప్రకటనలు ఇవ్వగా, త్వరలో వాటికి వేలం నిర్వహించనున్నారు. మిగిలిన వాటికి ఈ నెలాఖరులోపు ప్రకటనలు ఇచ్చి.. ఆగస్టు-సెప్టెంబరు నాటికి వేలం ప్రక్రియను ముగించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిసింది. కాగా, కూకట్‌పల్లిలో 18 వరకు ప్లాట్లుండగా.. వీటి వేలంతో దాదాపు రూ.150 కోట్ల వరకు ఆదాయం రావచ్చని అంచనా వేస్తున్నారు. మరోవైపు వికారాబాద్ జిల్లా పరిధిలో పరిగి, రంగారెడ్డి జిల్లాలోని గచ్చిబౌలి, లక్ష్మీదేవిపల్లి, రావిర్యాల, గద్వాల, వరంగల్ జిల్లాల్లో ఉన్న ప్లాట్ల వేలానికి సంబంధించి త్వరలోనే ప్రకటనలు ఇచ్చేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

వేలం ఆదాయం.. ఇందిరమ్మ ఇళ్లకు..

గృహ నిర్మాణ శాఖకు అనుబంధంగా ఉన్న హౌసింగ్ బోర్డు పరిధిలోని ఓపెన్ ప్లాట్లు, రాజీవ్ స్వగృహ పరిధిలో ఉన్న అపార్ట్‌మెంట్లలోని ప్లాట్లు, అసంపూర్తిగా ఉన్న టవర్లు, ఓపెన్ ప్లాట్ల వేలంతో వచ్చే ఆదాయాన్ని ఇందిరమ్మ ఇళ్ల పథకానికి వినియోగించాలని సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు దాదాపు రూ.22వేల కోట్ల వరకు అవసరమవుతోందని అంచనా..

9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో.. అదనపు సిబ్బంది నియామకం

కంది, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్లాట్ బుకింగ్ విధానం వల్ల పనిభారం పెరిగిన సబ్ రిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రభుత్వం అదనపు సిబ్బందిని నియమించింది. రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ కోసం ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై పనిభారాన్ని గణనీయంగా పెంచింది. ఈ నేపథ్యంలో అత్యధిక రద్దీ, పనిభారం ఉన్న తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు సబ్ రిజిస్ట్రార్లతో పాటు ఇతర సిబ్బందిని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పటాన్‌చెరు, యాదగిరిగుట్ట, గండిపేట, ఇబ్రహీంపట్నం, సూర్యాపేట, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాలలో అదనపు సబ్ రిజిస్ట్రార్లను, సిబ్బందిని నియమించారు.

కాళేశ్వరంపై ఏం చేద్దాం?

విజిలెన్స్ నివేదికను అమలు చేయాలా?



ఘోష్ రిపోర్టు తర్వాతే ముందుకెళ్లాలా?

బాధ్యులపై చర్యలకు సర్కారు మల్లగుల్లాలు

రేపటి క్యాబినెట్ భేటీలో ఈ అంశంపై చర్చ

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకునే విషయంలో ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న 17 మందిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ కమిషన్ సిఫారసు చేసింది. మరో 33 మందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని.. ఏడుగురికి జరిమానాలు విధించాలని సూచించింది. కాళేశ్వరం కట్టాలన్న నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి (2015 ఏప్రిల్) మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగిపోయేదాకా ఉన్న నీటిపారుదల, ఆర్థిక శాఖల ముఖ్యకార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వాన్ని కోరింది. సహేతుక కారణాలు లేకుండా ప్రాజెక్టు రీడిజైన్ ప్రతిపాదనలను ఆమోదించిన వీరిపై చర్యలకు ఉపక్రమించాలని సూచించింది. అయితే నివేదిక అమలు విషయంలో ఏ విధంగా ముందుకెళ్లాలనే దానిపై సర్కారు తర్జనభర్జన పడుతోంది. ఎందుకంటే.. కాళేశ్వరంపై ఇప్పటికే విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ముందు.. శుక్రవారం (జూన్ 6న) మాజీ మంత్రి ఈటల రాజేందర్, 9న మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, 11న మాజీ మంత్రి కేసీఆర్ హాజరు కావాల్సి ఉంది. వీరు షెడ్యూల్ ప్రకారం హాజరైతే... నెలాఖరుకు లేదా జూలై రెండో వారానికల్లా కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి అందించనుంది. విజిలెన్స్ కమిషన్ నివేదికను కూడా రిఫరెన్స్‌గా వాడుకోవాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిర్ణయించింది. ఇప్పటికే కాగ్ నివేదికతో పాటు జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) నివేదిక, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (వీ అండ్ ఈ) నివేదిక కమిషన్‌కు చేరింది. ఈ నేపథ్యంలో కాళేశ్వరం వైఫల్యానికి కారకులపై చర్యలు తీసుకోవడానికి ఏ నివేదికను ప్రామాణికం చేసుకోవాలనే దానిపై కసరత్తు ముమ్మరంగా జరుగుతోంది.

అదే జరిగితే..

ప్రధానంగా ప్రజాప్రతినిధులతో పాటు 24 మందికి పైగా అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా కాళేశ్వరం కమిషన్ నివేదిక సిఫారసు చేసే అవకాశాలు ఉన్నాయి. అదే జరిగితే జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక ద్వారానే ముందుకెళ్లాల్సి ఉంటుంది. విజిలెన్స్ కమిషన్ 17 మందిపై నేరారోపణలు చేయగా... అందులో 10 మంది పదవీ విరమణ చేశారు. మిగిలిన ఏడుగురిలో ఇద్దరు ఈ నెలాఖరున రిటైర్ కానున్నారు. మిగిలింది ఇక ఐదుగురే. అలాగే.. 33 మందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ కమిషన్ సిఫారసు చేయగా వారిలో 8 మంది రిటైరయ్యారు. 25 మంది సర్వీసులో ఉన్నారు. రిటైర్ అయిన ఏడుగురిపై పెన్షన్ సవరణ నిబంధనలను అనుసరించి పించనులో పెనాల్టీలు విధించాలని సిఫారసు చేసింది. అయితే 33 మందిపై ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ నమోదు చేసి, విచారణ అధికారులను నియమించాల్సి ఉంటుంది. ఆ విచారణలో తమపై మోపిన అభియోగాల నుంచి వారు బయటపడే అవకాశాలు కూడా లేకపోలేదు. అభియోగాలు నిరూపితమైతే జీవితాంతం ఆర్థిక నష్టం చేకూరనుంది. ఇంక్రిమెంట్లు కట్ చేస్తే ఆ ప్రభావం వేతనంపై, పదవీ విరమణ చేస్తే పెన్షన్‌పై శాశ్వతంగా ఉంటుంది. కాగా.. గురువారం (జూన్ 5న) జరిగే క్యాబినెట్ భేటీలో ఒక ఎజెండాగా విజిలెన్స్ కమిషన్ నివేదిక కూడా రానుంది. దీని కోసం అధికారులు కూడా సిద్ధమవుతున్నారు. ఏయే తప్పిదాలు చోటుచేసుకున్నాయి? ఎటువంటి చర్యలకు కమిషన్ సిఫారసు చేసింది? ఎంత మంది అధికారులు ఈ వ్యవహారంలో బాధ్యులు? వంటి అంశాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి, చర్యలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. అలాగే జస్టిస్ పీసీ ఘోష్ విచారణ ప్రక్రియ అంశం కూడా చర్చకు రానుంది. దాంతోపాటు జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ నివేదికపైనా క్యాబినెట్ భేటీలో చర్చించనున్నట్లు సమాచారం.

ఎర్రగడ్డ ఆస్పత్రి రోగులకు కలుషిత ఆహారం

(మొదటిపేజీ తరువాయి)

అందిస్తున్నారు. సోమవారం రోగులకు అందించిన ఆహారం కలుషితం కావడమే ఘటనకు కారణమని అనుమానిస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం రోగులకు తొలుత బెల్లంతో చేసిన పాయసం వడ్డించారు. అనంతరం సాధారణ అన్నం, అరటిపండ్లు, గుడ్లు ఇచ్చారు. అయితే సాయంత్రం డీసీ వార్డు, క్రోజ్‌వార్డుల్లో కొందరు రోగులకు స్వల్పంగా వాంతులు, తీవ్రంగా విరేచనాలు అయ్యాయి. మంగళవారం తెల్లవారుజామున ఏకంగా 71 మంది రోగులకు విరేచనాలయ్యాయి. ఉదయం రౌండ్స్‌కు వచ్చిన వైద్యులు.. పరిస్థితిని గమనించి రోగులకు చికిత్స ప్రారంభించారు. మేల్ డీసీ వార్డులో కరణ్(35) అనే రోగి బెడ్‌పై అచేతనంగా పడి ఉండగా.. వైద్యులు పరిశీలించి అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మిగిలిన వారికి చికిత్స కొనసాగించగా ఆరోగ్యం కుదుటపడింది. అయితే సాయంత్రానికి ముగ్గురికి డీహైడ్రేషన్ కారణంగా పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో వారిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆస్పత్రి కిచెన్‌లో సరైన శుభ్రత పాటించపోవడం వల్లే ఫుడ్ పాయిజన్ అయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ఆస్పత్రిలో మానసిక రోగులకు ఇచ్చే ఆహారాన్ని ముందుగా డైటీషియన్ రుచి చూస్తారు. ఆ తర్వాతే వారికి ఇస్తారు. ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఇంతకుముందు ఉన్న డైటీషియన్ స్థానంలో ఓ సైకియాట్రిస్టుకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఆరు నెలల నుంచి కిచెన్‌ను ఆయనే పర్యవేక్షిస్తున్నారు.



ఎర్రగడ్డ ఆస్పత్రిలోని వంటగదిలో నాణ్యతను పరిశీలిస్తున్న డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్ తదితరులు

నీటి శుభ్రతపై అనుమానాలు..!

ఆస్పత్రిలో తాగునీటి శుభ్రతపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సింటెక్స్‌లో నిల్వచేస్తున్న నీటి రక్షణ కోసం మూతలను సరిగ్గా వినియోగించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఘటనపై విచారణ జరిపిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల అన్నారు. మేల్ డీసీ వార్డులోని కరణ్.. ఫుడ్‌పాయిజన్ వల్ల మృతి చెందలేదని, అతనికి విరేచనాలు కాలేదని తెలిపారు. జ్వరం, అస్వస్థతతో చనిపోయాడని చెప్పారు. పోస్టుమార్టం తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. ఆస్పత్రి వైద్యులు, ఇతర సిబ్బంది కూడా పాయసం తీసుకున్నారని తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రి నుంచి మైక్రోబయాలజీ బృందం వచ్చి బాధితుల నుంచి మలం (స్టూల్) నమూనాలు సేకరించారని, మంచినీటి స్వచ్ఛతపైనా ఐపీఎం నుంచి పరీక్షలు చేయిస్తున్నామని, వీటి నివేదిక వచ్చాక వివరాలు తెలుస్తాయన్నారు. వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరేంద్రకుమార్ మంగళవారం ఆస్పత్రిని సందర్శించారు. ఫుడ్ పాయిజన్‌పై సిబ్బందిని, వైద్యులను ఆరా తీశారు. రోగులు అస్వస్థతకు గురికావడంపై విచారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నామని, కమిటీ నివేదిక అందిన అనంతరం చర్యలు తీసుకుంటామని అన్నారు. డీఎంఈ వెంట జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి ఉన్నారు. సాయంత్రం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆస్పత్రిని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆరా తీసినట్లు తెలిసింది.

వరంగల్‌లో కరోనా కలకలం

» ఒకే ఆస్పత్రిలో ఆరుగురికి పాజిటివ్

వరంగల్ మెడికల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంజీఎం సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మంగళవారం ఆరు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. తీవ్రమైన దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతున్న వారికి కరోనా పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు తెలుస్తోంది. అలాగే ఎంజీఎం ఆస్పత్రి పీజీ వైద్యురాలికి కూడా కరోనా నిర్ధారణ అయింది. నగరంలో ఒకే రోజు ఏడు పాజిటివ్ కేసులు నమోదుకావడంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ విషయంపై వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు స్పందించారు. నగరంలో ఎలాంటి కరోనా కేసులు నమోదు కాలేదని, ఇలాంటి ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని తెలిపారు. కరోనా పట్ల ఎలాంటి ఆందోళన అవసరం లేదని, తాము అప్రమత్తంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.

ఏసీబీ వలలో రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్

» రూ.10వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

రాయికల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా రాయికల్ మండల ఇన్‌చార్జి తహసీల్దార్ గణేశ్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. రాయికల్ మండలం సింగరావుపేట గ్రామ శివారులోని 42.5 గుంటల వ్యవసాయ భూమిని రవి అనే రైతు ఇతరులకు విక్రయించాడు. ఆ భూమిని కొన్న వారి పేరుపై రిజిస్ట్రేషన్ చేసేందుకు ఇన్‌చార్జి తహసీల్దార్ గణేశ్ రూ.15 వేలు డిమాండ్ చేశాడు. ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ ఎండీ ముజాఫర్ ద్వారా రూ.10 వేలు ఇచ్చేందుకు అంగీకరించిన రవి ఏసీబీ అధికారులను సంప్రదించాడు. అధికారుల సూచన మేరకు ముజాఫర్‌కు రవి రూ.10 వేలు ఇచ్చాడు. అనంతరం ముజాఫర్ నుంచి గణేశ్ ఆ నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

అప్పుల బాధతో పొలంలోనే రైతు ఆత్మహత్య

ఉట్నూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని శంభుగూడకు చెందిన సెడ్‌మకి పూలాజీరాం (45) అనే రైతు అప్పుల బాధతో సోమవారం అర్ధరాత్రి పొలంలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు గ్రామ శివారులో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. గత కొన్నేళ్లుగా పత్తి వేయగా.. సరైన దిగుబడులు రావడంలేదు. దీంతో పాటు కొంత కాలంగా అనారోగ్యం కూడా వెంటాడుతోంది. కుటుంబం గడవడం రోజురోజుకూ భారంగా మారడంతో.. గ్రామంలోని తెలిసిన వ్యక్తుల వద్ద రూ. 4లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు తీర్చాలని ఒత్తిళ్లు రావడంతో తీవ్ర మనోవేదనకు గురయి పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

పురపాలక వ్యర్థాల కరెంట్ ధర యూనిట్‌కు రూ.6.87

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పురపాలక వ్యర్థాలతో ఉత్పత్తి చేసే కరెంట్ ధరను తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ) ఖరారు చేసింది. యూనిట్ ధరను రూ.6.87లుగా నిర్ధారించింది. ఈ ఉత్తర్వులు గతేడాది మార్చి 3వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొంటూ ఈఆర్‌సీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా దుండిగల్‌లో 14.5 మెగావాట్ల సామర్థ్యంతో పురపాలక వ్యర్థాలతో(రెఫ్యూస్ డిరైవ్డ్ ఫ్యూయల్) ఆధారిత విద్యుత్ ప్లాంట్ ఉంది. ఒక యూనిట్‌కు రూ.15.87లుగా ఛార్జీ ఖరారు చేయాలని ఈ ప్లాంట్ యాజమాన్యం పిటిషన్ దాఖలు చేసింది. విచారణ జరిపిన కమిషన్.. ధరను యూనిట్‌కు రూ.6.87లుగా ఖరారు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

గోదావరి బనకచర్ల
అనుసంధానాన్ని ఒప్పుకోం

(మొదటిపేజీ తరువాయి)



త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. 'గోదావరి-బనకచర్ల' ప్రాజెక్టుపై రాష్ట్ర అభ్యంతరాలను కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి ఇప్పటికే వివరించామని తెలిపారు. అలాగే, సదరు ప్రాజెక్టుకు సాయం చేయరాదని కోరుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర జలశక్తి శాఖకు లేఖలు రాశామని తెలిపారు. ఈ మేరకు సచివాలయంలో మంగళవారం ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టు అమలు దిశగా ఏపీ వేగంగా అడుగులు వేస్తుండటంపై రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌ను ప్రశ్నించగా... త్వరలోనే కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తామని వెల్లడించారు. సముద్రంలో కలిసే నీళ్లను తరలిస్తామని ఏపీ ఏ విధంగా అంటుందని ప్రశ్నించారు. తెలంగాణలో గోదావరి నదిపై చేపట్టే ఏ ప్రాజెక్టు డీపీఆర్‌ను అనుమతుల కోసం సమర్పించినా.. నీటి లభ్యత లేదని వాదించే ఏపీ.. ఇప్పుడు ఏ నీటిని గోదావరి-బనకచర్ల ద్వారా తరలిస్తుందని మంత్రి విమర్శించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవడానికి శాయశక్తులా ప్రయత్నిస్తామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు.

రూ.81,900 కోట్ల అంచనా వ్యయం.. మూడు దశల్లో నిర్మాణం

పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం స్వీయ ఆదాయార్జన ప్రాజెక్టు అని ఏపీ ఆర్థిక శాఖ వెల్లడించింది. జలవిద్యుత్ ప్రాజెక్టులు, ఇళ్లు, పరిశ్రమలకు నీటి సరఫరా మొదలైనవాటి ద్వారా ఏటా రూ2,763 కోట్లను ఆర్జించే వీలుందని చెబుతోంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ అధికారులకు సోమవారం ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ఏపీ వెల్లడించింది. ఆ ప్రజెంటేషన్ తాలూకు సమాచారం 'ఆంధ్రజ్యోతి'కి అందింది. రూ.81,900 కోట్ల అంచనా వ్యయంలో 50 శాతం అంటే రూ.40,950 కోట్లు విదేశీ రుణంగా తీసుకోదలిచామని.. కేంద్రం 20 శాతం అంటే రూ.16,380 కోట్లు భరిస్తే.. రాష్ట్రం పది శాతం రూ.8,190 కోట్లు ఖర్చు చేస్తుందని.. మిగతా 20 శాతం వాటా అంటే రూ.16,380 కోట్లను ప్రైవేటు సంస్థల ద్వారా సమీకరిస్తామని ఏపీ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ వివరించారు. దేశంలోనే తొలిసారిగా వరద జలాలను ఎత్తిపోసే ఈ ప్రాజెక్టును మూడు దశల్లో చేపడతామని తెలిపారు. ప్రాజెక్టుపై నిర్మించే పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా రూ.201 కోట్లు, చెరో 200 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన రెండు హైడ్రో పవర్ ప్రాజెక్టుల ద్వారా రూ.651 కోట్లు, గృహాలకు మంచినీటి సరఫరా ద్వారా రూ.213 కోట్లు, పరిశ్రమలకు నీటి సరఫరాతో రూ.1,699 కోట్లు.. మొత్తంగా ఏటా రూ.2,765 కోట్ల ఆదాయం వస్తుందని వెల్లడించారు. గోదావరికి వరదల సమయంలో రోజుకు రెండు టీఎంసీల చొప్పున 100 రోజుల్లో 200 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తామని పేర్కొన్నారు.

దశలవారీ నిర్మాణమిలా..

- పోలవరం-బనకచర్ల పథకం తొలి దశలో గోదావరి వరదనీటిని తాడిపూడి వరద కాలువ ద్వారా పోలవరం కుడి ప్రధాన కాలువను కలుపుతూ 175 కిలోమీటర్ల మేర ప్రకాశం బ్యారేజీ దాకా 5,000 క్యూసెక్కుల చొప్పున తరలిస్తారు. ఇందుకయ్యే ఖర్చు రూ.13,800 కోట్లు.
- రెండో దశలో ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని బొల్లాపల్లి రిజర్వాయరు(150 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తారు)కు తీసుకెళ్తారు. ఇందుకు రూ.35,750 కోట్లు ఖర్చవుతుంది.
- మూడో దశలో బొల్లాపల్లి జలాశయం నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు నీటిని తరలిస్తారు. బొల్లాపల్లి వద్ద 200 మెగావాట్ల జలవిద్యుత్కేంద్రం నిర్మిస్తారు. 19.5 కిలోమీటర్ల టన్నెల్ తవ్వి సిద్ధాపురం చెరువును నీటితో నింపుతారు. దానిపై రూ.582 కోట్లతో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంటు నిర్మిస్తారు. అక్కడే 6.6 కిలోమీటర్ల మేర ఇంకో సొరంగం తవ్వుతారు. ఈ ప్రాంతంలో 200 మెగావాట్ల సామర్థ్యంతో జల విద్యుత్కేంద్రం నిర్మిస్తారు. అక్కడి నుంచి బనకచర్ల రెగ్యులేటర్ వరకు తీసుకెళ్లి నీటిని ఎత్తిపోస్తారు. ఈ ప్రక్రియ మొత్తానికి రూ.32,350 కోట్లు వ్యయమవుతుంది.

కాగా, మొత్తంగా 80 లక్షల మంది ప్రజలకు తాగునీరు, 91.4 లక్షల హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణ, కొత్తగా 3 లక్షల హెక్టార్లకు సాగునీరు, పరిశ్రమలకు 20 టీఎంసీల నీరు ఇవ్వాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యమని ఏపీ చెబుతోంది. ఈ పథకంపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని, డీపీఆర్ సమర్పిస్తే నిధుల మంజూరుపై కార్యాచరణను ప్రకటిస్తామని కేంద్ర ఆర్థిక శాఖ హామీ ఇచ్చినట్లు ఢిల్లీ వెళ్లిన ఉన్నతాధికారుల బృందం సభ్యుడొకరు వివరించారు.

బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ఖాయం : ఆది శ్రీనివాస్

హైదరాబాద్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): "ఏ పార్టీతోనూ బీఆర్ఎస్ పార్టీ పొత్తు పెట్టుకోదంటూ హరీశ్‌రావు అమాయకంగా చెబుతున్నారు. అసలు ఆ పార్టీ అంటూ ఉంటే కదా.. ఏ పార్టీతోనైనా పొత్తు పెట్టుకునేది! బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ విలీనం ఖాయం. ఈటల రాజేందర్ మధ్యవర్తిగా ఈ వ్యవహారం నడుస్తోందన్న ప్రచారం జరుగుతోంది" అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. బీజేపీలో విలీన ప్రయత్నాలను కేసీఆర్ కూతురు కవితే స్వయంగా బయటపెట్టారని పేర్కొన్నారు. పార్టీ క్యాడర్‌ను మభ్యపెట్టేందుకే ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమంటూ హరీశ్‌రావు మాట్లాడుతున్నారన్నారు. కవిత ప్రశ్నలపై ఇప్పటి వరకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఎందుకు స్పందించలేదని, పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడిన ఆమెపై ఎందుకు చర్యలు తీసుకోలేక పోతున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో కేసీఆర్ ఎందుకు పాల్గొనలేదని నిలదీశారు.

అమెరికాలో తెలుగు విద్యార్థులకు అండగా ఉంటాం

» పార్టీ తరఫున న్యాయ సహాయం అందిస్తాం

» బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అమెరికా వెళ్లి వివిధ కారణాలతో ఇబ్బందులు పడే తెలుగు విద్యార్థులకు అండగా ఉంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. ఎన్నో ఆశలతో ఉన్నతవిద్య కోసం వెళ్లిన విద్యార్థులు, అవగాహన లేక ఏమైనా తప్పు చేస్తే వారికి బీఆర్ఎస్ అమెరికా విభాగం తరఫున న్యాయ సహాయం అందిస్తామన్నారు. అమెరికాలోని టెక్సాస్ యూనివర్సిటీ(డాలస్) విద్యార్థులతో మంగళవారం జరిగిన ముఖాముఖిలో వారు అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికా వచ్చిన విద్యార్థులు ఏదైనా కారణంతో తిరిగివస్తే ఆ విద్యార్థితోపాటు వారి కుటుంబం ఎంతో ఆవేదనకు గురవుతోందని, ఈ కారణంగానే తాము అండగా నిలవాలని నిర్ణయించుకున్నామన్నారు. విద్యార్థులు అమెరికా చట్టాలు, ఆ సమాజంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకొని మసలుకోవాలని సూచించారు. లక్ష్యంవైపు సాగే క్రమంలో అవరోధాలు ఎదురైనా నిబద్ధతతో ముందుకు పోవాలన్నారు. నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. కష్టపడితేనే కలలు సాకారమవుతాయనేందుకు మాజీ సీఎం కేసీఆర్ జీవితమే సాక్ష్యమన్నారు. అమెరికాలో చదువుకుని భారత్‌కు తిరిగివచ్చాక.. కంపెనీలు ప్రారంభించాలని విద్యార్థులను కోరారు. దేశాభివృద్ధిలో, తెలంగాణ అభివృద్ధిలో విదేశాల్లోని యువత భాగం కావాలని, మన దేశంలో ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ అనేక అవకాశాలు ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అక్కడి విద్యార్థులకు కేటీఆర్ సూచించారు.

మాతృభూమి రుణం తీర్చుకోండి

అమెరికా ఐటీ కంపెనీల సీఈవోల సమావేశంలో కేటీఆర్

"భారతదేశ యువత మీలాంటి వారి కోసం ఎదురుచూస్తోంది. అక్కడికి వచ్చి పెట్టుబడులు పెట్టి.. మాతృభూమి రుణం తీర్చుకోండి" అని అమెరికాలోని డాలస్‌లో పలు ఐటీ కంపెనీల సీఈవోల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. విదేశీ పర్యటనలో ఉన్న కేటీఆర్ ఐటీ కంపెనీల సీఈవోలు, పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతున్నారు. ఈ సందర్భంగా డాలస్‌లో ఉన్న పలు ఐటీ కంపెనీల సీఈవోలతో ఆయన భేటీ అయ్యారు. కేటీఆర్ మాట్లాడుతూ.. భారత్‌లోని టైర్ టు నగరాల్లో అపార అవకాశాలు ఉన్నాయని, మంచి రోడ్లు, రైలు మార్గాల అనుసంధానంతో రాబోయే రెండు దశాబ్దాల్లో అద్భుతాలు జరుగుతాయన్నారు. తెలంగాణలో మూడేళ్ల తరువాత అధికారంలోకి రాగానే.. ఐటీ పరిశ్రమను మరింత విస్తృతంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. . ఈ సందర్భంగా పలువురు ఐటీ కంపెనీల యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో 9 సంవత్సరాల పాటు ఐటీ రంగానికి చేసిన అభివృద్ధిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈమేరకు కేటీఆర్ కార్యాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.